AOU1013102

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

గీతాలు

చాకచక్యము

చిత్రాలు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10446

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10446

c
bi

First Print,
March, 1961

T



MEMORIAL
D. P. R. I.
Acc. No.

PRINTED AT
THE HINDU PRESS
MASULIPATAM

PREFACE

by

Dr. B. GOPALA REDDI,

President, Andhra Pradesh Sahitya Akademi

Mirza Ghalib is attaining greater fame as days pass by. Perhaps he is better known today than about 30 or 40 years ago. A number of criticisms have come on his poetry and naturally they have stimulated greater interest in his work. His works in Nagari Script in recent years have brought an additional number of admirers, the film and the radio have popularised his Gazals and the sum total of all this is a larger clientele of readers who are trying to appreciate Ghalib's poetry.

Mirza Ghalib is acclaimed as the greatest of the Urdu poets, the other two in the Trinity could be Mir and Iqbal. People who are well versed in English poetry and scholars who are steeped in oriental learning like Arabic, Persian and Sanskrit, equally admire Ghalib's poetry. There is a rare charm in his similes and a grace in his expression. There are contexts where great philosophical truths are expressed in beautiful poetic language. At times he is very difficult both in thought and language and at times his language is very easy with popularly understood idioms and expressions used by common people.

In Urdu poetry we come across a new atmosphere both in the style of expression and the subject matter of the poetry. In Gazals it is usually the love theme, the lover pining for the beloved in utter despair. The beloved is tyrannical, hard-hearted, never keeping to promises and occasionally is picturised as the killer of the lover with sword in hand, piercing him with arrows shooting from the corners of her eyes. The Gul and the Bul Bul, the Shama and Parwana, the Burq and the Nasheman (the thunder and the nest), the Jam (cup) and the Saqi and the Badah and the Mykhana and the Theer-e-nazar and their synonyms haunt you at every turn. All told the subjective reactions of love are the main theme of Urdu poetry. They avoid

mere descriptions but one's own experiences or reactions under the impact of love find expressions and the whole idea must be complete in a Couplet. There is a newness in the style and the atmosphere which Urdu poetry creates. There is no gainsaying of the fact that there is great wealth of culture in Urdu and specially in poetry and it behoves cultured Indians to preserve what has been bequeathed to us and surely Ghalib shines like Venus on the firmament of the Urdu poetry.

Dasarathi, though young in age has already made a mark for himself among the modern poets of Andhra Pradesh. He is a well-known literary figure; he is modern, with roots in classical tradition. He is a student of Sanskrit literature, he is familiar with English poetry and has enjoyed the fresh morning breeze of the garden of Urdu poetry. Needless to say he drew inspiration from the classical Telugu poets. With this background and with his great admiration for the greatest of the Urdu poets, he has translated into Telugu verses over 400 Couplets of Mirza Ghalib's poetry. I had occasion to listen to some of his recitations of hese poems and I was greatly impressed by the manner in which he brought out the nuances and the elegance of the Urdu poetry into idiomatic Telugu. They read very well indeed in Telugu verse and I am sure the Telugu public would feel thankful to Dasarathi for his translation.

Omar Khayam has been translated by many modern poets of Telugu literature like late Shri Duvvuru Rami Reddi and Prof. Rayaprolu Subba Rao and this is the first attempt for any translation of Ghalib into Telugu. By the time the country celebrates Ghalib's death centenary in 1966, I am sure Telugu public also will be familiar with Ghalib's poetry by such translations which will be available to the Telugu lovers of poetry. Shri Dasarathi is eminently suited to undertake a difficult task like this and he has done it with commendable originality. It will be a welcome addition to the modern translations and I am hopeful it will stimulate greater interest in Urdu poetry.

V T
894.821
DAS

పీఠిక

మిర్జా అసదుల్లాఖాన్ 'గాలిబు' ఉర్దూ మహాకవులలో నిర్మకుట చక్రవర్తి. ఆ మహాకవి ఉర్దూ గీతములను గొన్ని దెనిగించి యాంధ్ర పాఠకలోకమున కందించిన యువమిత్రులు శ్రీమాన్ దాశరథిగారు మిగుల బ్రశంసనీయులు. అనువాదకు లాధునికాంధ్ర సుపర్నిసిద్ధ కవులలో నుత్తమశ్రేణికి జెందిన రససిద్ధులు. వారి ఓజఃపూర్ణమగు లేఖిని తెలంగాణా స్వాతంత్ర్యసమర దుందుభిని ప్రమోగించుటయేగాక, 'మహాబోధి' మున్నగు చారిత్రిక సాంస్కృతిక స్మృతిపథములను మార్మ్రోగించినది. రసధునియగు వారి కవితాఝరి నలువంకల ప్రవహించుచు, సాహితీ ఖండ్రికలను సస్యశ్యామల మొనరించుచున్నది. స్వతంత్ర రచనా పాటవమగల ప్రతిభావంతులు నేడరుదుగా ననువాదక్షేత్రమున గాలిడుదురు. కాని శ్రీ దాశరథిగారి వంటి సాహితీ మధులోలుపులగు రసికుల కే భాషయం దైనను గావ్యరసము కొల్లలుగా లభించును. అన్వేషణమే ముఖ్యము. శ్రీ దాశరథిగారిని వారి సరిక్రొత్త సాహితీ ప్రణయమునకై యభినందించు చున్నాను. వారు ప్రేమపూర్వకముగా నన్నొక పీఠిక వ్రాయవలయునని కోరినందున, ఉర్దూభాషానభిజ్ఞులకని ముఖ్యముగా నీ పరిచయ వాక్యములను వ్రాయుచున్నాను.

'గాలిబు' మహాకవి పేరు మిర్జా అసదుల్లాఖాన్. ఇతని పూర్వీకులు తుర్కీదేశస్థులు. ఈరాన్ యొక్క యాక్రమణానంతరము తూరానీయుల రాజ్యసంపదలు మంటగలసి ఈ తెగల వారందఱు వివిధ ప్రాంతములందు జెదరిపోయిరి. కత్తిగట్టి బ్రతుకుటయే వంశధర్మమగుటచే, నతని తాత మొగలాయి చక్రవర్తి షాఆలం కాలములో సమర్‌కంద్‌నుంచి ఢిల్లీకి వచ్చెను. అప్పటికే మొగలుసామ్రాజ్యము పతనదశకు జారుచున్నందున చక్రవర్తి కేవలము 50 గుఱ్ఱములు, నగారా, నిషాన్ మున్నగునవియును, నాసిబ్బంది ఖర్చులకును స్వంతఖర్చులకును ఫూసా (Phusa) పర్గణాను జాగీరుగాను నొసంగెను. అతని పుత్రులిరువురు - మిర్జా అబ్దుల్లాబేగ్ ఖాన్, మిర్జా నస్రుల్లాబేగ్ ఖాన్. వీరిలో పూర్వోక్తుని ప్రథమ పుత్రుడే మిర్జా అసదుల్లా ఖాన్. తండ్రి ఆగ్రాలో దన యత్తవారింటి యిల్లటపుటల్లుడై యుండుటచే 'గాలిబు' జన్మస్థలము ఆగ్రా యైనది. అతడు 1212 హిజ్రీ (క్రీ. శ. 1795) సంవత్సరమున (8) రజ్జబునాడు జనించెను. ఆరవయేటనే తండ్రి మరణించినందున మిర్జా అసదుల్లా ఖాన్ తన తమ్ముడగు మిర్జా యూసుఫ్‌ఖాన్‌తో సహా మాతామహులింట కొన్నాళ్ళు గడపి, పిదప పిన తండ్రియగు నస్రుల్లా ఖాన్ యొక్క పోషణలో నుండెను. పిత్రృచ్ఛాయా

విహీనుడయ్యాను, నైసర్గిక ప్రతిభావంతుడైన మిర్జా చిన్ననాటి నుండియే సాహితీ సామ్రాజ్యము నేలు చిహ్నాములను ప్రకటించుచు వచ్చెను. పదునాల్గవ యేట, బాల్యావస్థయందే 'హుర్ముజ్' అను పేరుగలిగి యిస్లాం మతమును స్వీకరించి 'అబ్దుస్సమద్' అను నామముతో ప్రసిద్ధిగాంచిన యొక పారసీక మహాపండిత కవియొక్క సాహచర్యము లభించినది. నైసర్గికప్రతిభ గలిగిన, 14 సంవత్సరములు గల యీ బాలునికి పారసీకభాషా సాహిత్యములం దనితర సామాన్యమగు పాండిత్య మలవడినది. 'గాలిబు' స్వయముగా ఫారసీ తన మాతృభాష కాకపోయినను, జన్మతః తన కా భాషాసాహిత్యములపై ప్రేమాభిమానములు మెండనియు, నా భాష తనకు విధేయమనియు సగర్వముగా చెప్పుకొన్నాడు. నిజముగా నతని ఫారసీభాషా సాహితీపాటవ మతనిచే సృజింపబడిన గద్య పద్యాత్మకమగు ఫారసీ రచనలందేగాక, నతని 'ఉర్దూ' రచనలయందు గూడ నత్యంత ప్రభావసమన్వితమై గోచరించును. అతని కాలమునకు బూర్వమే ఢిల్లీలో పోషితమైన 'ఉర్దూయె మొ అల్లా' అను అరబ్బీకృత ఫారసీకృతమైన ఉరుదూభాష పరిణతినిజెంది, ఇన్షా, ముస్హఫీ, నాసిఖ్, ఆతిష్, మోమిన్, జౌక్ వంటి ప్రతిభావంతులగు కవుల కీర్తికాస్కారమై విరాజిల్లినది. వీరిలో కొందఱు 'గాలిబు'కు సమకాలికులైన సుప్రసిద్ధకవులు. 'గాలిబు'ను ఉర్దూ కవి యనుటకంటె ఫారసీకవి యని యనవలెనని యతని సమకాలికులు గొందఱు గావించిన విమర్శ కతని ఫారసీ పక్షపాతమే కారణము. మొదట 'గాలిబు' కఠినములై, యితర పండితులచే క్లిష్టములనియు, నసాధువులనియు పరిగణింపబడు నెన్నియో ఫారసీ సమాసముల నుపయోగించి, కొందఱు సమకాలికుల వెక్కిరింతలకు గూడ పాత్రుడయ్యెను. అతని పాండితీ వైదగ్ధ్యములను మెచ్చుకొనువారును మెత్త మెత్తగా నతని ఈ ప్రవృత్తిని మార్చుటకై యెత్తిడి గావించిరి. తన సహజశైలికిని, ధోరణికిని విరుద్ధములైన యీ విమర్శలను తోలుదొల్త ప్రతిఘటించినను, తరువాత కాలవాహిని కెదురీదలేక కొంతమార్పు నంగీకరించెనని 'గాలిబు' యొక్క తరువాతి రచనలు చెప్పక చెప్పుచున్నవి.

'గాలిబు' తన ఉరుదూ రచనలను దన జీవితకాలమునసే కొందఱు సహృదయులగు మిత్రులకు ప్రకటనార్థ మప్పగించెను. కిషారనులు గలిగి జనరంజకములు కాజాలని రచనలను వదలివేసి, వారు ఏరికూర్చిన దీవాన్ (పద్యసంపుటి)ను 1849 లో ప్రకటించిరి. అందులో మొత్తము 1800 పాదములు గలవు. వానిలో 1500 గజళ్ళును, మిగతవన్నియు కసీదా, మస్నవీ, రుబాయీలు మున్నగునవి. ఏరికూర్చిన దీవాన్ నందును కొన్ని గజళ్ళు నేడును అయఃపిండములనియే పరిగణింపబడుచున్నవి. 'గాలిబు రచనల కర్థమేలే' దని యొక సమకాలికకవి గావించిన విమర్శనమునకు 'నసితాయెఖ్‌కి తఫున్నా, నసిలేకీపర్వా - నసహీ గర్ మెరె అష్‌ఆర్ మె మానీ నసహీ'

ఏ పొగడ్తలగోర నే నేరకడను,
లెక్కజేయను బహుమతుల్ జిక్కకున్న
నాదుకవితల నర్థమే లేదయేని
లేకపోనిమ్ము! అద్దాని లెక్కజేయ

నని సమాధానము జెప్పినాడు. కాని సమకాలికుల విమర్శలు న్యాయ్యములు కావనియు, నవన్నియు 'గాలిబు' యొక్క విశృంఖలమైన జీవితమువల్లను, రచనాపద్ధతివల్లను వెగటొంది వ్రాసిన వ్రాతలనియు, నా మహాకవికి జీవం తుడై యుండగను, తదనంతర మత్యధికముగాను ఫారసీ ఉరుదూ సాహిత్య ప్రపంచమున గలిగిన పరిశ్రమవలన తేటతెల్లమగుచున్నది. 'గాలిబు' కవి యును సాధారణముగా దన సమకాలికుల రచనలపై మెప్పులు గుప్పువాడు కాడు. అపూర్వమైన యర్థగౌరవమునో, పదరామణీయకమునో, లేక భావౌన్నత్యమునో వ్యక్తపరచు కవితనే, తన మనసుకు హత్తినచో, నెత్తి పొగడు వాడు. అందరికి 'గాలిబు' మెచ్చుకోలు నిచ్చువాడుగాడని దురభిప్రాయము. అందువలననే కొందఱు విమర్శనకు గురి యొనర్చిరేమో యని తోపకమానదు. ఐనను తరువాత, సహృదయులగు సాహిత్యవేత్తలును విమర్శకులునగు 'హాలీ' 'ఆజాద్' వంటి మహాపండితులచేతను, ఇతర మహాకవులచేతను కవితా సామ్రాజ్యమునకు పట్టము గట్టింపబడి తన యశస్సును చిరస్థాయిగా స్థాపించు కొన్నాడు 'గాలిబు'. ఏబది సంవత్సరముల కాలము ఫారసీ సాహిత్యవీధుల సంచరించి, అన్వరీ, ఖాఖానీలకు సరిదూగు కసీదాలను, 'ఉర్ఫీ', 'తాలిబు'ల కంటె మిన్నయగు గజళ్ళను, ఉమర్ ఖయ్యాంతో మేళవించు రుబాయీలను, అబుల్ ఫజల్, జుహూరీ మున్నగువారి గద్యములను పేలవములుగా గన్పింప జేయు గద్యకావ్యములను రచియించెను. ఉరుదూలో ముఖ్యమగు 'గజల్' కవితా సరణిని తీర్చిదిద్దిన యగ్రసరుడు 'గాలిబు'. ఆ మార్గమునందే కొన్ని క్రొత్త యడుగులు ద్రొక్కుచు కాలానుగుణమగు పరివర్తిత ప్రవృత్తులచే ప్రభావితులై, 'దాగ్', 'హస్రత్', 'ఫానీ', 'జిగర్' మున్నగు తరువాతి కవులు 'గజల్' కవితకు వన్నెచెట్టిరి. అందువలననే 'గాలిబు' యొక్క మహత్వము నిర్వివాదాంశము.

అసమానప్రతిభాసంపన్నుడైన 'గాలిబు' కు కవిత వెన్నతోబెట్టిన విద్య యని చెప్పకతప్పదు. రెండేండ్లొక మహాపండితుని సాహచర్యము లభించిన దంతియేగాని 'గాలిబు' సక్రమముగా నే గురువులయొద్దను సాహిత్యమును, శాస్త్రములను చదువుకోలేదు. పదమూడవయేట వివాహమైనపిదప ఢిల్లీ నగరమునకు వచ్చి, ఆమరణాంతమక్కడనే నివసించెను. వంశాభిజాత్యమును, స్వాభిమానమును నిలువబెట్టుకొనుటకెన్నియో కష్టములకు బాల్పడియెను. పిన

తండ్రి జాగీరనుండిగాని, మాతామహుని యాస్తినుండిగాని 'గాలిబు' యొక్క జీవితావసరములు తీరలేదు. పినతండ్రియాస్తికి సంబంధించిన పెన్షన్ కొరకు ప్రీవీకౌన్సిలు వరకు అప్పీళ్ళు చేసినను సంవత్సరమునకు 750 రూపాయల కంటె మించి లభించలేదు. మొగలుదర్బారులో బహాదుర్ షాః నెలకు 50 రూప్యముల వేతనమునుమాత్రమే యిచ్చుచుండెను. కాని నిజాంజంగ్, నజ్మొద్దౌలా, దబీరుల్ములుక్ అను ఖితాబులనొసంగి సత్కరించెను. బ్రిటిషువారి పెన్షన్, 1857 లో, మొగల్ రాజులతో సంబంధముగలిగి యున్నందున విద్రోహియను సంశయమునకు గురియై, యాపివేయబడినది. మూడేండ్లపిదప సంశయమునుతొలగించి తిరిగి జారీ చేయించుకొనువరకెన్నియో బాధలు భరించవలసివచ్చినది. రాంపూర్ నవాబులును, ఇతర మిత్రులును తఱుచు సహాయము చేయుచుండిరి. కాని యప్పులకుప్ప లెప్పటికిని 'గాలిబు'ను తిప్పలు బెట్టుచుండెడివే. ఐనను పల్లకీని విడిచి నడవలేదు. ఇంటిబైటికి వెళ్ళక స్వగృహమున కారావాసమొనరించెను. కాని నౌకర్లనెవరిని తీసివేయలేదు. వీలైనంతవరకు దాను రుచిమరిగిన మాంసాదులను, మధురములైన మామిడిపండ్లను భుజించుట మానలేదు. వృద్ధాప్యమున చెవుడు ముదిరి ఎన్నో యిడుముల పాలయ్యెను. కాని ప్రతిరాత్రి తానాస్వాదించు 'ఖైంచు' మధువునుమాత్రము వదలలేదు. 1857 లో ఢిల్లీనగరమునుండి ముస్లిం లందఱు పారిపోయినపుడు 'గాలిబు' మాత్రము వెళ్ళలేక ఢిల్లీలోనే యుండిపోయెను. అప్పుడతని మిత్రులగు హిందువులు సహాయమొనర్చిరి. దీర్ఘకాలము జీవించి ఢిల్లీనగరముయొక్క సౌకర్యములకును, సాంఘికాచారములకును అలవాటుపడిన 'గాలిబు' దన యవసానకాలమును దయనీయస్థితిలో గడపెను. ఒకసారి జూదమాడుచుండ బట్టుబడి మూడు నెలలు కారాగారశిక్షననుభవించెను. సంతానహీనుడై, పెంచుకొన్న భార్యమేసల్లుండ్రుగూడ నతని యెదుటనే మృతింప, వృద్ధాప్యమున బహుదుఃఖములకు గురియయ్యెను. ఈ వివరములన్నియు నతడు దన మిత్రులకును శిష్యులకును సహచరులకును దాపరికములేక దనజాబులలో దెలిపియున్నాడు. ఈ లేఖలన్నియు 'ఉర్దూయె మొఅల్లా' అను పేరుతో ప్రకటింపబడినవి. 'గాలిబు' ఢిల్లీనగరమున 15 ఫిబ్రవరి 1869 తేదీన, 74వ ఏట దివంగతుడయ్యెను.

ఉర్దూకవితలో 'గజల్' రచనా పద్ధతి రెండువందల సంవత్సరముల క్రితము ప్రారంభమై, ఈశతాబ్దారంభమున, హాలీ, ఎక్బాల్ మున్నగువారిచే నిరసింపబడి, అభ్యుదయ మార్గోన్ముఖులగు నవీన సాహిత్యోపాసకులచే బహిష్కరింపబడి, కొంత గౌరవమును గోల్పోయినను, నేటికిని ఉర్దూ కవితారంగమున ప్రధానమైన పాత్రనే ధరించుచున్నది. 'గజల్' శృంగారరసాత్మకమైన సిసలైన భావకవిత. దీని కాధారములు రెండు. ఒకటి కవియొక్క రాగరంజితమైన హృదయమును స్పృశించు అనుభూతులు. రెండవది భావనా

ప్రపంచములో విచ్చలవిడిగా విహరించి, వానిని రమణీయ వాగర్థ ప్రతిపాదకములుగా చిత్రించు ప్రతిభావ్యుత్పత్తులు. శృంగారరసమునకు నైసర్గిక ప్రాధాన్యము కలదని మానవస్వభావవేత్తలెఱిగిన విషయమే. అందువలననే సాహిత్యమునుండి శృంగారమును బహిష్కరించు ప్రయత్నము లెక్కడను చిరకాల సాఫల్యమును బొందలేదు. కొంతకాలమదుపులో నుంచిన నుంచ వచ్చును. కొంత సంస్కరింపనువచ్చును. కాని దానిని వెలివేయుటకు వీలు లేదు. ఉర్దూసాహిత్యమునం దెన్ని మార్పులు కలిగినను 'గజల్' యొక్క ప్రాధాన్యమందువలననే తగ్గలేదు. పై పెచ్చు జాతీయజీవనములోను, సాంఘిక వాతావరణములోను, కాలానుగుణ్యముగా గలుగు మార్పులు రూపొందించు సునోవికాసము 'గజల్' కవితాసరణియొక్క పరిధులను విశాలమొనరించి, విప్రలంభశృంగారమును పేర్కొయసీ ప్రియుల విరహవీధుల నధిగమింపజేసి దాని హద్దులను విస్తరించినది. ఉపరిదృష్టిచే జూచినచో 'గజల్' యొక్క ఇతివృత్తమునందును, తత్ప్రతిపాదనయందును రెండువందలయేండ్లకాలములో మౌలికమైన ఏ మార్పు కనబడదనియే చెప్పవలసియుండును. ఐనను కేవల మాంతరికానుభూతులపై నాధారపడియున్నందున, వికసిత మనోవృత్తుల పరిణతభావములను వ్యక్తీకరించుటకనువగు సరణి 'గజల్' కవితలో నాధునికుల కలవడినది. జాతీయ భావోద్రిక్తులైన కవులకు స్వాతంత్ర్య సమర దుందుభిని మ్రోగించుటకును సౌకర్యము నొసంగినది. ఆభ్యంతరికానుభూతి ప్రధానమగు నీ కవితలో భావపర్యికటనమునందెన్నో మెఱుగులు దిద్ది, వన్నెలచే నలంకరించి, యర్థగౌరవమును సంపాదించుటకవకాశముగలదు. విప్రలంభ శృంగారమును బ్రధానాంశముగా గ్రహించి, ప్రేయసితోడను, సాఖీతోడను, దేవునితోడను, స్వగతముగాను, ప్రపంచముతోడను పలువిధములుగ ముచ్చటించవచ్చును. ఛందోబద్ధమై యంత్య ప్రాసనియమములను పాటించవలసియున్నను, ప్రతి పాదము స్వతంత్ర భావార్థప్రతిపాదకమై యుండుటవలన, కవికి మరింత స్వైర విహారమొనర్చుటకు సుకరముగానుండును. కాని యంతర్దృష్టితోపాటు రస పరిప్లుతహృదయమును, కల్పనాశక్తితోపాటు అర్థగౌరవము గల వాక్పాటవ మును జతగూడినగాని నిజమగు 'గజల్' నిర్మాతకానేరడు. 'గాలిబు'లో నీగుణములన్నియు పరిణత దశలో భగవద్దత్తములై యుండినవనుట నిస్సం దేహము.

'గజల్' నిర్మాత యొక్క యంతర్దృష్టికి ప్రధానములైన యంగములు కల్పనాశక్తి, భావుకత. అసాధారణములైన యనుభూతులకును, పరిమిత దృష్టిచే స్పృశింపరాని సత్యములకును కల్పనాశక్తి జీవన్మూర్తిస్వరూపము నొసంగి, బుద్ధిని ఆశ్చర్యపరవశమొనర్చు నూతన సృష్టిని గావించును. కాని యట్టియనుభూతులును, సత్యములును స్పష్టముగా వ్యక్తపరచుట కనువైనవిగావు. వాని వ్యక్తీకరణయందు కొంత యస్పష్టత, గొంత రహస్యము, వ్యంగ్యము,

ధ్వని యుండకతీరదు. ఒక యవనిక, ఒక ముసుగు అత్యవసరము. శృంగా రానుభూతులను వ్యక్తపరచుటయందు వ్యంగ్యమునకును, ధ్వనికిని మిక్కిలి ప్రాధాన్యముగలదు. ప్రేమికునికిని ప్రేయసికిని ఈ 'పర్దా' సమానముగా నవ సరమగును. ఉర్దూ కవు లీయాథార్థ్యమును స్పష్టముగా నంగీకరించిరి. ఈ వ్యంగ్యమునకు పునాది కవియొక్క ఆంతరికానుభవముగాని బాహ్యానుభూతి కాదు. అందువలననే 'గజల్' నిర్మాత ప్రపంచసౌందర్య విలాసమును దన కాల్పనిక చిత్రములందు స్వయముగా జూచుచు నితరులకును ఆ ప్రకాశము నొకింత పంచియిచ్చును. ఈవిధములగు ననుభూతులందు భావోద్వేగమునకును కల్పనాశక్తికిని అవినాభావ సంబంధముండుటచే, భావప్రపంచమునందు కల్పన, మఱియు వాస్తవికతయను రెండింటికిని భేదము నశించును. అనుభవించు వానిలోను, అనుభూతవస్తువునందును ద్వైత్వము నశించి ఐక్యత సాధింపబడును. 'గజల్' కవితకు బాహ్యానుభూతులు గూడ పునాదులనుట సత్యమేయైనను, ప్రతిభాశాలురైన 'దాగ్', 'జురఅత్' వంటి కవులును దమ కల్పనాశక్తిని కేవల బాహ్యానుభూతులను జాగృతము లొనర్చుటకై యుపయోగించినందున, వారికవిత యంతరాంతరమునుగాని, యాధ్యాత్మిక సత్యమునుగాని స్పృశించుటకు సమర్థముకాలేదు. 'మీర్', 'గాలిబు', 'మోమిన్', 'హసరత్' మున్నగు మహాకవుల రచనలు అట్లుగాక అంతరికానుభూతి ప్రధానములై, వ్యంగ్యధ్వని పూరితములై, బాహ్యాభ్యంతరములగు నిరుతెగల భావనాపరంపరలను స్పృశించునవై, యున్నత శ్రేణికి జెందుచున్నవి. ఉత్తమశ్రేణికి జెందిన 'గజల్' లో బాహ్యానుభూతియు నాంతరికమై, పరివర్తన మొందుచున్నది. బాహ్యప్రపంచమే కవియొక్క భావనాప్రపంచముతో నైక్యమును బొందు చున్నది. హాఫిజు, సాదీ, బేదిల్ మున్నగు ఫారసీ కవులతోపాటు, 'మీర్', 'సౌదా', 'గాలిబు', 'హస్రత్', 'జిగర్' మున్నగువారి రచనలలో, బాహ్య ప్రపంచమంతయు మానవుని యభ్యంతర దృష్టి యొక్క ఛాయాచిత్రి మను భావమత్యంత సుస్పష్టముగాను విరివిగాను వ్యక్తీకరింపబడినది.

ఫారసీ, ఉరుదూ 'గజల్' కవితాసంప్రదాయములో విప్రలంభ శృంగార మునకే ప్రాధాన్యము గలదు. ఈ శృంగారమునకు పునాదియైన ప్రేమ 'హకీకీ' యని, 'మజాజీ' యని రెండుతరగతులకు జెందినదిగా పరిగణింపబడినది. 'మజాజీ' యనగా సాధారణమగు లౌకికమగు నాయికానాయకుల ప్రేమ. 'హకీకీ' యనగా భగవద్భక్తి, లేక పారలౌకిక ప్రేమ. విప్రలంభశృంగారము ఈ రెండింటికిని సామాన్యమైన రసము. కాని కొందఱు సూఫీకవులు, భక్తులు, ఖ్వాజామీర్‌దర్ద్, ఖ్వాజాబరేల్వీ మున్నగు ఉరుదూ కవులుతప్ప, సాధారణ ముగా 'గజల్' నిర్మాతలగు కవులందరి వలపు 'మజాజీ' లౌకికమనునది నిర్వి వాదాంశము. వారెన్ని ముసుగులను వేసినను, వారి ప్రేయసి సుకుమారాకార యతరమైన సుందరియే. వారు గోరుచుండు రసము గోష్ఠీరసమే. వారి

వర్ణనలు, వ్యంగ్యములు, ధ్వనులు, విరహము, విప్రలంభము, శోకము, ఎత్తి పొడుపులు, నిందలు, అన్నియు మానవ శృంగారమునకు సంబంధించినవే. ఐనను ఉచ్చశ్రేణికి జెందిన 'గజల్' నిర్మాతల వ్యంగ్యధ్వని పరిధానములగు రచనలు తరచుగా 'హకీకీ', 'మజాజీ' యను రెండర్థములకు దావలములై, యుదాత్త భావములను వ్యక్తీకరించునవై సహృదయుల నాకర్షించుచుండును. అట్టి యుదాహరణము లనేకములు 'గాలిబు' రచనలలో లభించును. ఈ ప్రేమ లౌకికమా పారలౌకికమా, కవిసంబోధించు ప్రేయసి సౌందర్యరాశియగు చందర్ముఖియా, లేక సచ్చిదానంద స్వరూపమైన పరబ్రహ్మమా యను సందేహమునుగూడ గలిగించుచుండును. ఈ ప్రక్రియ ఫారసీ ఉరుదూ కవితా సంప్రదాయమునకు గల యొక విశిష్టమైన గుణము. ప్రేయసిని నిర్దేశించుటయందును సౌందర్య ప్రతిపాదకములగు 'గుల్', 'సరోకద్', 'మాఁవష్', 'బుత్', 'కాఫర్' మున్నగు పదముల నుపయోగింతురు. ఇవి 'పంకజాక్షి' 'చంద్రముఖి' వంటివి. లేక గుణప్రతిపాదకములగు 'బేవఫా', 'జాలిం', 'సితంగర్' మున్నగు పదముల నుపయోగింతురు. 'చమక్', 'మై', 'బుల్బుల్', 'సాకీ' మున్నగునవి యుద్దీపనసామగ్రిగను, చషకము, పానశాల మున్నగునవి యంగములుగను ఉపకరించును. పూర్వాచారపరాయణుడగు 'జాహెద్' కవి నిర్మలప్రేమకును తన్మయత్వమునకును ఆటంకములు కలించువాడని యతనిని నిందించుట, వెక్కిరించుట కవి సంప్రదాయము. ప్రేయసి ఎల్లప్పుడు దయావిహీనురాలై ప్రేమికుడగు కవిని విరహాగ్ని జ్వాలలలో కాల్చుచుండును. అత డెల్లపు డశ్రుధారలగార్చుచు, ప్రేయసిని, దైవమును, కాలమును దూరుచుండును. ఒకప్పుడు ప్రార్థించును, ఒకప్పుడు నిందించును, మఱొకప్పుడు తనను తానే నిందించుకొనును, ఒకప్పుడు తన హృదయవేదన నొక దైవదత్తమగు వరముగా నాహ్వానించి స్వాగత మొసంగును, ఒకప్పుడు ప్రాతకాలపు వలపును స్మరించి, ఇప్పటి నిరాశను దలంచి నిశ్వసించును. వేయేల, విప్రలంభ శృంగారమును స్పృశించు నసంఖ్యాకములగు మధురభావములను వ్యక్తపరచును. ఈ వైవిధ్యము, కల్పనాచాతురి, అర్థగౌరవము, కవియొక్క ప్రతిభావ్యుత్పత్తులపై నాధారపడియుండును. సాధారణులైన 'గజల్' నిర్మాతలు పూర్వకవులచే వ్యక్తీకరింపబడిన భావములనే చర్వితచర్వణముగా ప్రకటించినను, శబ్దార్థములందేనో నూతనత్వమును, విశిష్టతను, చాతుర్యమును జూపుటకై ప్రయత్నించుచుందురు. ఈ రంగమున పూర్వకవుల యనుకరణమును వదలి 'గాలిబు' మహాకవి ఎన్నో క్రొత్తపోకడల నవలంచించెను. కేవల శృంగారమునకే గాక జీవితరంగము నందలి వివిధానుభూతుల వ్యక్తీకరణమందొక యపూర్వమైన నూతనత్వమును ప్రకటించెను. అదే 'గాలిబు' యొక్క ప్రత్యేకత.

ఈ పీఠికను ముగించుటకు ముందు మచ్చునకు మాత్రము గొన్ని పద్యముల నుదాహరణముగా నిచ్చుట యసమంజసముకాదు. అనేక జీవిత సమస్యలపై 'గాలిబు' దన పరిణత మనోభావములను వ్యక్తీకరించినాడు. ఒకచోట:

ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదులెమ్ము
నరుడు నరుడౌట యెంతో దుష్కరము సుమ్ము!

అన్నాడు. జీవితములో నేపనియు సుసాధ్యము కాదనుట యొక నగ్న సత్యము. కాని రెండవ పాదముందలి యుపమా చాని నొక యున్నతమైన నైతిక స్థాయికి గొనిపోయి యుదాత్త మొనర్చినది.

ఎన్నో సుఖసంపదలను వాంఛింతుగాని
మృతియె లేకున్న రుచిలేదు బ్రతుకునందు

అన్నాడు కవి. ఎన్నో వాంఛలు, వానిని పొందుటకై చేయు ప్రయత్నములు మానవునికి సహజములే. కాని మృత్యువనునది లేనిచో నా వాంఛలందును, వాని ప్రాప్తియందును రుచియే లేదు. జీవితమున కంతము దగ్గరగానున్నదను భావమే వాంఛల కొకశక్తిని, వాని ప్రాప్తికొక సుఖమును ఇచ్చుచున్నది. మృత్యువే లేనిచో నారుచిలేదు. ఇది యొక యపూర్వభావము.

మానవుని యుత్కృష్టతను, సృష్టిలో నతనికిగల ప్రాధాన్యమును కవి ఖురాన్ యొక్క వాక్యముతో ధ్వనింపజేసినాడు. చూడుడు—

తూరుపైగాక మాపైన జారిపడియె
దివ్యకాంతుల పిడుగులు దేజరిల్లి
పానశాలలో మధువును బంచుచుండ్రు
కోరువారల పాత్రల మేరవరకె.

ఖురాన్ యొక్క ఆయత్‌లో (వాక్యములో) నిట్లున్నది. 'మా జ్యోతిని భూమ్యాకాశములకును పర్వతములకును భరించుటకై యిచ్చెదమంటిమి. కాని యవి భరింపజాలనందున మానవున కిచ్చితిమి'. అచలమైన తూరుకొండను (మూసాకు జ్ఞానోదయమైన పర్వతము పేరు 'తూరు') దివ్యజ్యోతిని భరించుశక్తి లేనందున నది మానవుని సొత్తైనది. ఎవరికి ననుసరించి వారికి దేవుడిచ్చును. పానశాలలో నభ్యర్థికి వాని పాత్రలో నెంత మధువుపట్టునో అంతే సాకీ పంచియిచ్చునని యుపమించినాడు కవి. విశ్వములో మానవునికి గల యుత్కృష్టతను చాటినాడు 'గాలిబు'.

పరమేశ్వరునితో నే విధముగా సరసములాడుచున్నాడో ఈ క్రింది పద్యమున జూడుడు —

(ఆతా హైదాగె హ్రసతె దిల్ కా షుమూర్ యాద్
ముఝ్సే మెరేగునః కా హిసాబ్ అయె ఖుదా! నమాంగ్)

ఏనొనర్చిన పాపంబు లెన్నటంచు
లెక్కనడుగకు మోదేవ! ఒక్కసారి
మఱుల నెడదను గాల్చినమచ్చ లెల్ల
స్మృతిపథంబున బడి లెక్కచెప్పు మనును.

నీవు నా పాపముల లెక్కనడిగినచో నా హృదయముపై దగిలిన గట్టి గాయ ముల మచ్చలను గూడ లెక్కింపవలసి యుండును. అవి స్మరణకు రాగలవు. రెండును అసంఖ్యాకములే! ఎందు కీ బాధ! అన్నాడు కవి.

మరియొక్క తాత్విక సత్యమును ఈ క్రింది పద్యమున వ్యక్తీకరించినాడు:

దర్శనంబయ్యెనని దేనిదలచుచుందు
మదినిజంబుగానె అదృశ్యమైన యదియె;
స్వప్నమందున మేల్కొన్న జాగరూకు
డెట్లు మేల్కొను? నిదురించియే పరుండు.

సర్వాంతర్యామియని యెఱింగి పరికించుచున నే శక్తిని మనము జూచు చున్నామో యది చక్షురింద్రియమున కగోచరమై యతీతమైనది. మనము చూచుచున్నామని భావించుట స్వప్నములో మేల్కొనినట్లు కల గనిన వాని జాగరూకతకాని నిజమైన మెలకువ కాదు. ఇది యొక యుదాత్తమైన యాధ్యాత్మిక సత్యము.

మరియొక విచిత్రమైన యుదాత్తభావము —

దుఃఖమధికమైన దుఃఖంబె నశియించు
నరునిబాధలెల్ల నాశమౌను
కష్టజాలమెంత గ్రమ్మినో నాపైన
నంత సులభమయ్యె నదియె నాకు.

దుఃఖానుభవము పరాకాష్ఠసాయికి జేరినపు డది దుఃఖముగా నుండదని కవి.
మరియొక చక్కని భావము —

నీదు కలయిక సులభమ్ముగాదు ! సరియె !
కష్టమేమన, కష్టమ్ముగాదు ! గూడ !

ఈ ప్రేమ యాధిభౌతికమైనను నాధ్యాత్మికమైనను కవిభావము స్పష్టము. 'నీ సమాగమము సులభము కాదనినచో (దుస్సాధ్యమనినచో) నాశవదలుకొని కూర్చొని యుందును. కాని యది కష్టము (దుస్సాధ్యము) కానందున, నేనెల్లప్పు డాశాబంధమూ తెగిపోవక కుమిలిపోవుచుందును' అని యభిప్రాయము.

భైవభక్తి నిర్వ్యాజమై యుండవలయునను భావము నీ పద్యమున చక్కగా నొక్కి వక్కాణించినాడు—

నాకమును బట్టి ద్రోయు డా నరకమందు,
నచట భక్తుని కమృతంపు టాశ లేదు.

స్వర్గముయొక్క అమృతము నాశించి భక్తుడు దేవుని పూజించుచున్నాడు. ఆ స్వర్గమును నరకమందు ద్రోసినచో నా భక్తుని కాశలేని భక్తి యలవడును.

'గాలిబు' గీతములందు మనోహరములగు భావములు, విచిత్రములగు కల్పనలు, అపూర్వములగు నుపమానములు కొల్లలుగా లభించును. గ్రంథ విస్తర భీతిచే ననువాదకుల తెలుగు నేతనుండి కొన్ని హృదయంగమములైన పద్యముల నీ క్రింద పొందుపరచుచున్నాను.

వలపువలన బ్రతుకు బహురుచ్యమైనది
ఎడద తీయదనము బడయసాగె ;
బాధకౌషధమ్ము బడసియు డెందంబు
మందులేనిబాధ నందె మరల.

చిత్రగుప్తుడువ్రాసిన మాత్ర మనము
పాపులగుదుము ; సాక్షి యెవ్వండుకలడు ?

నేనుమరణింప నామె దుఃఖాన కుమిలె
ఎంత తొందరగా కరుణించె నన్ను ?

నా యెడదచీల్చి రక్తమండలముసేసె,
నేను వేదనతో మరణించినాను;
ఇపుడు గోళ్లకునెరుపు రంగెట్లు లెక్క-
వెలది తాను గోరంటాకు పెట్టుకున్న ?

స్వీయలోపమ్ము లెరుగుట పెద్దవిద్దె;
లోప మెరిగినవాడె పూర్ణుడగునరుడు.

ఆమె తోటకు వాహ్యళికరిగెనంట
ఇంక తోటలో పూలు వాంఛించునెవడు ?

భ్రుకుటిక్రిందుగ నయనమ్ము పోల్క గురువ!
ఆలయముపంచలనె పానశాలవలయు.

స్వాస్థ్య మెడలిన మందిచ్చువాడు వలదు
ప్రాణములుపోవ నేడ్చెడివాడు వలదు.

ద్వారబంధములును తలుపు తాళము లేని
ఇరుగుపొరుగు లేని ఇల్లు వలయు.

మాటలాడువాడు సుందలించెడువాడు
నెవరు లేనియెడ వసింపవలయు.

అందక త్తెలతో మాటలాడుకొరకు
చిత్రలేఖనవిద్య నేర్చితిని నేను.

హరినిప్రార్థింప తలవంచినట్లుగానె
బాగప్రాగి ప్రొక్కము మధుభాండమునకు.

ఆమెపాదతీర్థ మాన గోరితిగాని
కాళ్ళు నేలమీద గడిగెనామె.

ప్రేయసి గృహవీధి స్పృహతప్పి పడిపోయి
ముదిత కాలిగురుతు ముద్దుగొంటి.

శస్త్రవైద్య కత్తిసైతము రక్తాశ్రు
కణములొలికె, నీవు కరుగవేమె ?

నాదు గుండెగాయము కుట్టు సూదికంట
అశ్రుజలధార దారమై అవతరించె.

ఎచట నీ పదాంకముల నీక్షింతు, నచట
అడవి దారియు నందనమట్లు తోచు.

నాకొరకు నీవు వత్తువన్నయది నిజము,
జాగుసేయవటన్నది సత్యమగును,
అసలు నావార నీకందునంతలోన
మట్టిలో నేనుకలిసెడి మాట నిజము.

గాలిబా! నీదు తాత్వికకలన, యహహా!
త్రాగకుండిన నిను మేము యోగియనమె!

చింతలెడు మాకు బ్రహ్మాండమెంతో ఇరుకు
అందు గగనమ్మొక పిపీలికాండమయ్యె!

వేరునందుండి కొమ్మలు వెలసినట్లు
లన్నిశబ్దాలు నిశ్శబ్దమందె పుట్టె.

పానశాలయె లేనిదైననేమి
బడి, మసీదు, సత్తరువు సర్వమ్మొ నొకటె.

ఇంతటితో నుదాహరణములను, నా యుపోద్ఘాతమును ముగించుచు శ్రీ దాశరథిగారి కృషికి సహృదయాంధ్ర పాఠకలోకము సహర్షముగా స్వాగతమొసంగగలదని విశ్వసించుచున్నాను.

రాజ్‌భవన్
లక్నో
12-3-1961

బూర్గుల రామకృష్ణరావు.



మిర్జా అసదుల్లా ఖాన్ గాలిబ్

జననం :

27, డిశంబరు 1797

★

మరణం :

15, ఫిబ్రవరి 1869

అవతారిక

భారత దేశ చరిత్రలో మొగలులు పరిపాలించిన కాల మొక ప్రత్యేక అధ్యాయము. ఈ అధ్యాయమును గూర్చి యెవరు యేమి అభిప్రాయాలు ప్రకటించినప్పటికిని, ఈ యుగము యొక్క ప్రత్యేకతలలో రెండు మాత్రము నిర్వివాదాస్పదమైనవని సర్వజనులు అంగీకరించి యున్నారు. ఈ రెండింటిలో మొదటిది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సౌందర్య నిలయము తాజ్ మహల్; రెండవది మన గాలిబ్ మహాకవీంద్రుడు. ఇందువలన గాలిబ్ మహాకవి వ్యక్తిత్వమును ఆంధ్ర పాఠక మహాశయులు ఊహించుకొనవచ్చును. మహామేధావి, గొప్ప విజ్ఞాని, సాహితీ సార్వభౌముడునైన కీర్తిశేషుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒక పర్యాయము ఆత్మ పరీక్షా దృక్పథముతో ప్రసంగించుచు తన అభిప్రాయాలమీద, తన జీవిత దృక్పథముమీద గాలిబ్ కవిశేఖరుని ప్రభావము గోచరించునని చెప్పిన మాటలను ఈ సందర్భమున పేర్కొనవలసి యుండును.

గాలిబ్ మహాకవి ఆంధ్ర మహాజనులకు- విశేషించి పూర్వపు హైద్రాబాదు రాష్ట్రమున నివసించిన వారికి - క్రొత్తవాడు కాడు. ఉర్దూ పరిచయము కలిగిన ప్రతివారికిని గాలిబ్ సుపరిచితుడు. కాని చిత్రమేమనగా, ఆ గాలిబ్ కవిత్వమును తెలుగులోనికి తీసికొని వచ్చుటకు ఈనాటి వరకును సరియైన ప్రయత్నము జరుగలేదు. అరబ్బీ, ఫారసీ, ఉర్దూ భాషలలో పరిణులైనవారు, రచనాశక్తి కలిగినవారు, ఎవరును తమదృష్టిని ఈవంక ప్రసరించలేదు. ఉమర్ ఖయ్యాం మనవారిని చాలమందిని ఆకర్షించినాడు. బహుశా గాలిబ్ అనువాదము శ్రీ దాశరథికి వదలివేయుట విధివిధానమేమో ! మహాపురుషులకువలె, మహాకవులకు గూడ ప్రకృతి కొన్ని కర్తవ్యములను నియమించు చుండును. భారత రామాయణాలను ఆంధ్రీకరించిన పూర్వకవులు భాగవతమును తనకు విడిచి పెట్టినారేమో యని పోతనామాత్యుడు చెప్పుకొనినాడు. శ్రీ దాశరథి కవీంద్రుడే గాలిబ్ కవిత్వమును ఆంధ్రీకరించుటకు తగిన సమర్థుడని, పూర్వకవులెవరును ఇందుకు యత్నించలేదేమో ! ఈ యాలస్యము ఆంధ్ర భాషకు లాభదాయకమైన దని శ్రీ దాశరథి అనువాదము రుజువు చేయుచున్నది. ఈనాడు మన దేశములో ఒక భాషలోని మహాకవులను ఇతర భాషలకు పరిచయము గావించుటకు బ్రహ్మాండమైన కృషి జరుగుచున్నది; సకల భారతసాయిలో జాతీయ దృక్పథమును పెంపొందించుటకు విద్వాంసులు, రచయితలు కంకణము కట్టుకొని ముందడుగు వేయుచున్నారు. ఈ తరుణమున గాలిబ్ కవీశ్వరుడు తెలుగు సీమకు పరిచితుడగుట సర్వవిధాల సముచితముగా

నున్నది. శ్రీ దాశరథి లేఖిని ద్వారా ఈ పని జరుగుట వలన బంగారమునకు పరిమళమబ్బినది.

ఉర్దూ సాహితీ ప్రపంచమునకు గాలిబ్ కవీశ్వరుడు సూర్యుని వంటి వాడు; ఉర్దూ సారస్వతమున గాలిబ్ మహాకవిది ఉన్నతోన్నతమైన స్థాన మని సాహిత్య చరిత్రకారులు, విమర్శకులు ఏకకంఠముగా అంగీకరించి యున్నారు. మన శ్రీనాథుని వలె గాలిబ్ విద్వాంసుడైన కవిసార్వభౌముడు. కొంచెము పరిశీలించినచో ఈ యుభయుల యందు కొన్ని పోలికలు గూడ గోచరించగలవు. శ్రీనాథునివలె గాలిబ్ కూడ భోగములయందు ఆసక్తిని, ప్రీతిని కలిగి, వానిని నిర్భయముగా ప్రకటించిన స్వైర విహారధీరుడు; స్వతంత్రుడు. కావునే, ఈ యిద్దరి రచనలయందు శక్తిమంతము, ప్రతిభావంతము నైన వారి వ్యక్తిత్వము అడుగడుగున ప్రత్యక్షమగుచుండును. చరమ దశలో అనేకకష్టాల పాలైనప్పటికిని, శ్రీనాథుడు తన జీవితములోని అత్యధిక భాగమును రాజా శ్రయమునందు గడపి, తాను కాంక్షించిన సమస్త భోగములను పొంది, అనుభ వించుటలో కృతార్థుడయ్యెను. కాని ఇందుకు విరుద్ధముగా, రాజాశ్రయ మును సంపాదించి, భోగకాంక్షలను నెరవేర్చుకొనవలెనని యెంత ఊత్కంఠ కలిగి యుండినప్పటికిని, అందుకొరకు ఎంత ప్రయత్నము గావించినప్పటికిని, గాలిబ్ మాత్రము కృతార్థుడు కాలేదు. కావున శ్రీనాథుని తుదిదశ విషా దాంతమైనట్లుగా, గాలిబ్ జీవితమంతయును విషాదగాథ యైనది. శ్రీనాథుని భాషాప్రౌఢిమ, వైదుష్యము, భావ గాంభీర్యము గాలిబ్ రచనలలో కూడ పుష్కలముగా కనుపించుచుండును.

విలాసములందు ఎంత అనురక్తుడైనప్పటికిని, విషాద జీవితమునే గడుప వలసి వచ్చిన గాలిబ్ మహాకవి మరొక విధముగా చాల అదృష్టవంతుడని చెప్పవలసి యున్నది. (ఈ యదృష్టము శ్రీనాథునికి లభించలేదు.) అందరు కవులకు వలెనే, గాలిబ్ మహాకవికి గూడ సమకాలికుల మెప్పు సంపూర్ణ ముగా లభించక పోయినప్పటికిని, మరణానంతరము ఉర్దూ కవులందరిలో నిర్వివాదాస్పదమైన అగ్రగణ్యత ఆయనకు లభించినది. గాలిబ్ రచనలకు "చుగ్తాయి" వంటి ఉత్తమ చిత్రకారుని కుంచె ప్రతిభావంతమైన వ్యాఖ్యా నము గావించినది. "ఎఖ్బాల్" మొదలైన మహాకవుల రచనలకు గూడ "చుగ్తాయి" చిత్రరూపము కల్పించినాడు. కాని గాలిబ్ కవిత్వమునకు వాసిన చిత్రములే అన్నిటికన్న ఎక్కువ గణ్యతను పొందినవి. బహుశా ఈ చిత్రకారుడు గాలిబ్‌వంటి చిత్తవృత్తి కలిగిన ప్రతిభావంతుడైనందు వలన కాబోలు, గాలిబ్ కవిత్వమునకు సంబంధించిన చిత్రాలు సర్వోత్తమ మైనవిగా కీర్తిగాంచినవి. సైగల్ వంటి గొప్ప గాయకుడు గాలిబ్ గీతాలను గానము చేసి, ఉర్దూ భాషాప్రియులకు హృదయాహ్లాదకరమైన మీనులవిందు

గావించినాడు. గాలిబ్ జీవిత చరిత్రను వ్రాయుటకు హాలీ వంటి గొప్ప పండితుడు, ఉత్తమ రచయిత లభించినాడు. హాలీ రచించిన గాలిబ్ జీవిత చరిత్ర ఉరుదూ వాఙ్మయములో గొప్ప రచన. ఈ విధముగా చిత్రకారుడు, గాయకుడు, చరిత్రకారుడు—ముగ్గురు గాలిబ్ కవీంద్రుని అజరామరుని గావించినారు.

గాలిబ్ వ్యక్తిత్వము సర్వవిధాల విశిష్టమైనది; ఆచార విచారములందు, ఆహార విహారములందును ఈ విశిష్టత గోచరించుచుండును. గాలిబ్ శైలిని తరువాతి కవులు కొందరు అనుకరించుటకు ప్రయత్నించి విఫలులైన సత్యమిందుకు నిదర్శనము. గాలిబ్ కవితను పరిశీలించినప్పుడు ఆయన తన వ్యక్తిత్వమునకు అత్యంత ప్రాధాన్యము నిచ్చినట్లు స్పష్టము కాగలదు. ప్రేమ కవిత్వము వ్రాసిన ఉరుదూ కవీశ్వరులది సాధారణ స్త్రీదృక్పథము; కాని గాలిబ్ కవీశ్వరునిది మాత్రము పురుషదృక్పథము. గాలిబ్‌లో 'అహం' చాలయెక్కువ; ఆయన ప్రత్యేకతకు ప్రధాన కారణములలో ఇది యొకటి. ఈ ప్రత్యేకతకు గాలిబ్ రచనలన్నియును ఉదాహరణములే.

ఉర్దూ భాషలో 'గజల్' సుప్రసిద్ధమైనది. ఉర్దూ కవులలో అనేకులు ఈ పద్ధతినే అనుసరించినారు. గాలిబ్ 'గజల్' రీతిలోనే గాక ఇతర రీతులలోగూడ కవనము అల్లినప్పటికిని, గజల్ రీతికి గాలిబ్ సార్వభౌముడై, ఈ మార్గమున ఇతరులను మించి అగ్రగణ్యుడైనాడు. గజల్ కవితా రీతిని అనుసరించిన ఉర్దూ కవులు రెండు విషయాలకు మాత్రమే హెచ్చు ప్రాధాన్యము నిచ్చినారు. మొదటిది ప్రేమ; రెండవది సూఫీతత్వము. కాని వీరందరి వలెగాక గాలిబ్, మానవ జీవితమును సమగ్రముగా తన కావ్య దర్పణమున ప్రతిఫలింప జేసినాడు. జీవితమును, దాని భిన్న దృక్పథములను చిత్రించిన మొట్ట మొదటి ఉర్దూ కవి గాలిబే యని చెప్పవచ్చును. జీవిత రంగము, అందలి విలాసము, విషాదము, తీపి, చేదు, మరియు అందలి ఒడుదుడుకులు గాలిబ్ తన 'గజల్' కవిత్వములో ప్రదర్శించి, ఉర్దూ కవులలో అద్వితీయమైన స్థానము నాక్రమించినాడు.

గాలిబ్ కవి మాత్రమే కాదు; గొప్ప వచనరచయితగూడ. ఉత్తమ వచనమును వ్రాయవలెనని ఆయన ఉద్దేశించలేదు. తనకు మిత్రులు, ఆప్తులు, శిష్యులు నైనవారికి వ్రాసిన లేఖా పద్ధంపరలో గాలిబ్ వచన శైలిని మనము రుచిచూచుచున్నాము. ఈ లేఖా పరంపరలోని శైలి తరువాత ఉర్దూ వాఙ్మయములో నూతన యుగానికి దారి తీయగలదని కాని, ఆధునిక ఉర్దూ వచన వాఙ్మయానికి ఆదర్శ పాత్రము కాగలదని కాని ఆనాడు గాలిబ్ భావించి యుండలేదు. ఉర్దూ భాషలో ఉత్తమ వచన రచయితలుగా వన్నెకెక్కిన హాలీ, షిబ్లీ, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, నజీర్ అహ్మద్ ప్రభృతు

లకు గాలిబ్ శైలి ఒరవడియైనది. వీరి వచన రచనలు ఆధునిక ఉర్దూ వచన వాఙ్మయానికి ఆచార్య పీఠము లైనవి. సారస్వతములో అనేక మార్గాలను ద్రొక్కినప్పటికిని, గాలిబ్‌కు ఆచంద్ర తారార్కమైన కీర్తిని కల్గించి, ఉర్దూ వాఙ్మయములో ఆయనకు అగ్రగణ్యత్వము ప్రసాదించినది ఆయన గజల్, మరియు ఆయన లేఖలలోని వచన శైలియే. లేఖా రూపమైన గాలిబ్ వచన రచనలలో ఆయన శక్తివంతమైన వ్యక్తిత్వము, సర్వతోముఖమైన ప్రతిభ మనకు కనుపించుచున్నవి. ఆధునిక కాలములో ఉర్దూ వాఙ్మయమున ఇటు వంటి వ్యక్తి నిజానికి కీర్తిశేషులైన మౌలానా అబుల్‌కలాంఆజాద్ ఒక్కరే.

తెలంగాణా మహాకవి- కాదు, సకలాంధ్ర మహాకవి-శ్రీదాశరథి గాలిబ్ కవిత్వమును ఆంధ్రీకరించుట మిక్కిలి సంతోషకరమైన సంగతి. శ్రీ దాశరథిని తెలుగు పాఠకలోకానికి పరిచయము చేయవలసిన ఆవశ్యకములేదు. జగమెరిగిన బ్రాహ్మణునికి జంధెమేల ? ముంజేతి కంకణానికి అద్దమెందుకు ? మన జాతీయోద్యమా లన్నింటి యందును పాల్గొని, ఆధునికాంధ్రముయొక్క ఆశయాలకు, మనోరథాలకు ప్రాతినిధ్యము వహించిన శ్రీ దాశరథిమహాకవి ఈ అనువాదమును మిక్కిలి ప్రతిభావంతముగా నిర్వహించినారు. అనువాద ధోరణి చాల సరసముగానున్నది. అనువాదముకొరకు స్వీకరించిన ఛందస్సు, భాషౌచిత్య శోభితములై యున్నవి. శ్రీ దాశరథి అనుసరించిన ఛందస్సు 'గజల్' పోకడకు అనుగుణముగా నున్నది. అనువాదకునికి మూల గ్రంథకర్తతో సమానమైన భావనాశక్తి అవసరమై యుండును. ఆ భావనాశక్తి శ్రీ దాశరథికి సంపూర్ణముగా కలదని ఈ అనువాదములోని ప్రతి పంక్తి నిరూపించుచున్నది. అనువాదమును చేయుటలో శ్రీ దాశరథి చూపించిన నేర్పు అనన్యము. గాలిబ్ కవిత్వములోని హైందవేతర వాతావరణమును హైందవ వాతావరణముగా పరివర్తించుటలో దాశరథి ప్రత్యేక ప్రతిభ చూపించినాడు.

"ఏడి మాంధాత ? పురుకుత్సు డేడి నేడు ?"
"గుడిని శివుడు దొరుకకున్న కాశికి గాని
పరుగు లెత్తి నేను బడయ గలను"
"లోకమందు సుఖము, శోకమ్ము గల వంద్రు,
శోక మొకటె యిచ్చె నాకు బ్రహ్మ."

ఈ పద్యపాదములు దాశరథికి ఉరుదూ, ఫారసీ భాషలలోగల ప్రావీణ్యమునకు, ఆ సంప్రదాయములతోగల పరిచయమునకు, వానిని మన వాతావరణములోనికి తీసికొని వచ్చుటలోగల శక్తి సామర్థ్యాలకు మంచి తార్కాణములుగా నున్నవి. ఉమర్ ఖయ్యాంను జీర్ణించుకొని ఆంగ్లభాషలో పరివర్తించిన

ఫిట్జుజీరాలువలె, దాశరథి గాలిబ్ కవిత్వమును హృద్గతము గావించుకొని అనన్య సాధ్యమైనరీతిని ఆంధ్రీకరించినాడు. మూలమునకు అనువాదము ఇంత సన్నిహితముగా నుండుట కడు కష్టసాధ్యము. ఈ అనువాదము కడు సరసముగా సాగినది. పూర్వజన్మలో దాశరథియే గాలిబేమో! లేక ఈ జన్మలో గాలిబే దాశరథియై అవతరించెనేమో!

ఉరుదూ కవులలో ఎవరును తమ రచనలలోని భాగాలను యేరి కూర్చి ప్రకటించి యుండలేదు. కాని గాలిబ్ మాత్రము ఆ పనిని గావించినాడు. తన జీవితకాలములో స్వయముగా తానే యేరికూర్చి ప్రకటించిన కావ్యభాగములు వాస్తవముగా ఆయన కవిత్వములో ఉత్తమోత్తమమైనవి. ఈగ్రంథము దాశరథికి ఎంతవరకు ఉపయోగించినదో తెలియదు. ఎందుకనగా ఆ సంపుటపుప్రతులు ఈనాడు లభ్యమగుట లేదు. గాలిబ్ గజల్‌ను ఒక్కొకదానిని తీసికొని ఆమూలాగ్రముగా దాశరథి అనువదించలేదు. గజల్‌లో కొన్ని 'షేర్' లనే తీసుకుని ఆంధ్రీకరించినాడు. ఈ పద్ధతి మిక్కిలి ఔచిత్యవంతముగా, సరసముగా నున్నది. గాలిబ్ గజల్లలోని ఉత్తమ విభాగములను ఎన్నుకొనుటలో దాశరథి కవితా హృదయము, మరియు ప్రతిభ ప్రతిబింబించుచున్నవి.

దాశరథి యేరి కూర్చిన ఈ ఖండ కృతులలో గాలిబ్ కవి ప్రేమార్ద్ర హృదయము తొంగి చూచుచున్నది. గాలిబ్ ప్రేయసి ఒకమారు పరిహాసాలు; మరియొకమారు పరాఙ్ముఖురాలు. 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అన్నట్లుగా నున్నది ఆమెకథ. ఆమెకు గాలిబ్ ఏకైక ప్రియుడు కాడు. ఆ పద్మము మీద మరికొన్ని భృంగములు ఝంకరించుచున్నవి. కాని గాలిబ్ క్రోధ పూరితుడు కాలేదు. ఆయన ప్రేమ ఆవంతయును తగ్గలేదు. ఇది నిరుపమానమైన ఘటన—

"ఒరుల కొసగ లేదె ఉవిద! నీ యధరమ్మ్ము?
నాకు గూడ నోరు లేక పోదు"

అనియు :

"ఉవిద గోష్ఠిలో నే నుండకుంట మేలు,
నన్ను గూర్చిన ప్రస్తావనమ్మె చాలు"

అనియు గాలిబ్ తన హృదయమును ప్రకటించి యున్నాడు. తుదకు :

"నాదు చిన్నిగూడు, నా జీవితపు గోడు,
నా విషాద గాథ నాదె కాదె!"

అని ఆవేదన చెందినాడు. నిజముగా గాలిబ్ జీవితము విషాద గాథ. గాలిబ్ ప్రేమ స్వార్థరహితమైనది.

"నాకు నిష్కామ కర్మ యెంతయు ప్రియమ్ము" అని ఆయనయే స్వయముగా చెప్పుకొనినాడు. ఆయన ప్రతిపాదించిన ప్రేమ సిద్ధాంత మేమో ఇది! ఒకమారు ప్రమోదము, మరొకమారు విషాదము; ఒకమారు ఆశ, ఇంకొకమారు నిరాశ; వేరొక పర్యాయము వేదాంతము గాలిబ్ ప్రేమోపాసనలో గోచరించుచున్నవి. ఈ ప్రేమ తరంగములన్నియు ఈకావ్యమున చక్కగా కనుపించు చున్నవి.

మానవ జీవితమును ప్రతిబింబించు గీతములున్నను, ఎక్కువగా ప్రేయసికి, ప్రేమకు సంబంధించినవే ఈ కావ్యసంపుటములో అనువదించుట జరిగినది. గాలిబ్ కవిత్వములో మానవ జీవితము సమగ్రముగా ప్రదర్శితమైన దని మొదటనే మనవిచేసినాను. కావున ఆయా భాగాలను కూడా మరికొంత విపులముగా మరొక సంపుటముగా అనువదించి ప్రకటించుట సమంజసముగా నుండగలదు. అప్పుడే గాలిబ్ కవిత్వము, వ్యక్తిత్వము తెలుగు సీమకు సంపూర్ణముగా లభించగలదు. ఈ సంపుటము కూడ త్వరలో శ్రీ దాశరథి ప్రకటింపగలడని ఆశించుచున్నాను. ఈ "గాలిబ్ గీతాలు" పరికటించిన యం. శేషాచలం అండ్ కో వారిని హృదయ పూర్వకముగా అభినందించు చున్నాను. ఈ కావ్యమునకు మనోహరమైన చిత్రములను కూర్చిన శ్రీ 'బాపు' కృషి ప్రశంసనీయమైనది.

క్రొత్త ఢిల్లీ
18-2-1961

— దేవులపల్లి రామానుజరావు

అంకితం

ఆప్తమిత్రులు, అమృత హృదయులు, అశేష ప్రజ్ఞాశాలి
నటశిఖామణి

శ్రీ అక్కినేని నాగేశ్వర రావు గారికి

మైత్రి యనెడి దివ్య సూత్రమ్ము బంధించె
నిన్ను నన్ను, మిన్ను మన్ను ఓలె.

తారకా పథాల దనరు నీ చేయూత
ధరణి పైని నాకు దొరుక జాలె.

విషమును భుజించి నవ సుధా చషక మిడిన
విశ్వ రక్షకుడైన నాగేశ్వరుడవు.

నశ్వరంబైన ఈ మహా విశ్వమందు
నలుగురికి మేలుసేయు అనశ్వరుడవు.

కలుష పంకమ్ము తనరు లోకమ్మునందు
విమల పద్మమ్ము ఓలిక వెలసినావు.

అజ్ఞతా గాఢ తమసమ్ము నవల దోయ
జ్ఞాన దీపమ్ము వెలిగించ జాలినావు.

ద్వేష పాషాణ కఠిన ధాత్రీ తలాన
స్నేహ సుకుమార కుసుమముల్ నింపినావు.

ధన మదాంధ ధాత్రీ తలమ్మును పవిత్ర
దాన జల ధారలందున తడిపి నావు.

గర్వ గహనాటవీ భయంకర కరీంద్రు
నమ్రతాంకుశమున గ్రుచ్చినావు నీవు.

కుల మతమ్ముల చీకటి గొలుసులందు
కట్టు బడని విశాల దృక్పథము నీది.

సంకుచిత వర్ణ వర్గ నిస్సార వీధి
లాగ బడబోని నవ మనోరథము నీది.

శారద సరస్సు వంటి నీ స్వచ్ఛ హృదిని
నవ కళా పయోజమ్ములు నాట్య మాడె.

వారిదము వంటి నీ దయా స్వాంతమందు
వితరణ ప్రవాహినీ లతల్ విరియ బారె.

అర్ణవము వంటి నీ హృదయమ్ము నుండి
పూర్ణ మానవతా శశి పొంగి వచ్చె.

పాత్రుడవు, మిత్రవరుడవు, చిత్ర లోక
చక్రవర్తివి, శాశ్వతావకీర్తి!

స్నేహితుల పాలి కల్పావనీరుహాంబ!
మన్మనో నందనావనీ మార్గ వర్తి!

ముచ్చ లేని పున్నమ చందమామ వీవు,
చిత్తముల దోచు సౌందర్య సీమ వీవు.

కనికరమునకు రత్నాల గనివి నీవు,
స్నేహ మంత్రమ్ము పల్కరాచిల్కవీవు.

సాంధ్య వేదికపై నటస్వామి వీవు,
పుణ్యకార్యమ్ములకు రంగ భూమి వీవు.

ఇచ్చుటే గాని కైకొంట యెరుగ నట్టి
నీకు కానుకగా నేమియు నీయ జాల.

నీ గళాన సమర్పింప నిమ్ము నన్ను
మేలి గాలిబు గీతాల పూల మాల.


10(a)

10(b)



ಕರ:

10(C)



శ్రీ కర్త

10(d)



స్వీకారము

మహాకావ్యం తల్లిప్రేమలాటిది. పువ్వుల అందంలాటిది. పరిమళం లాటిది. వెన్నెలలాటిది. మహాపురుషుడి మనసులాటిది. దానికి ఆరమరికలు లేవు. అందరూ సమానులే. అందరూ ఆనందించాలనీ, అందరూ వృద్ధికి రావాలనీ మహాకావ్యం కోరుతుంది అని పెద్దలు అంటారు. కోరడమేకాదు అందుకు పాటుపడుతుంది, తల్లిలాగే. మనలో 'మానవుడి' ని పెంచి పెద్దచేసే తల్లి అదే. పసివాడికి వాడి తాహతునుబట్టి ఉగ్గుపాలు పడుతుంది. కొంచెం వయసువస్తే పెరుగూ వెన్నా పెడుతుంది.

చిన్నప్పుడు, నాయనమ్మవడిలో కూర్చొని విన్నప్పుడు, భారత రామాయణాలు అప్పటి మన వయసుకు, బుద్ధికి, తాహతుకు తగినంతవరకే అర్థం అవుతాయి. తరవాత, బడిలో కూర్చుని పాఠం విన్నప్పుడూ ఆతరువాత స్వయంగా చదువుకున్నప్పుడూ మరికొంత కొత్తకథ తెలుస్తుంది; మరికొన్ని కొత్త అందాలు కనిపిస్తాయి. వయసు, అనుభవం, సంస్కారం పెరిగినకొద్దీ కొత్తరుచులు, కొత్త అందాలు అందుతాయి. కొత్త విషయాలు బోధపడతాయి. నాయనమ్మ వడిలో కూచున్నపుడు, బడిలో విన్నప్పుడు కూడా ఈ మహాఇతిహాసాలకి మనపట్ల ఆదరం, ప్రేమ ఒక్కలాటివే. మాతృవాత్సల్యంలాగే అదీ అనంతం.

పాఠశాలలో విద్య నేర్చుకునే అదృష్టం, అవకాశం లేని నాకు ఈ విధంగా మానవ సమాజంలో ఒక సభ్యుడుగా, వెన్నెలనీ, పువ్వుల అందాన్నీ, పరిమళాన్నీ అనుభవించి ఆనందించే హక్కు వున్నట్టే కావ్యాలను 'చేపట్టే' హక్కుఉంది. ఆ ప్రాథమిక హక్కుతో మాత్రమే నేను ఈ రోజున ఈ పుస్తకం దగ్గరకువచ్చి నమస్కరించి నిలిచాను.

అయితే, మహాకావ్యాన్ని అంకితంగా అందుకోగల అధికారం, అర్హత నాకు ఉన్నాయని అనుకోవటంలేదు. మహాకావ్యాన్ని అందుకొనే అధికారం లేదు అంటే, మామూలు కావ్యాలమీద జులుం చలాయించగలననికాదు.

అధికారం అంటూ పరిశ్నవస్తే దేనికైనా ఉండాలి. ఎక్కాల పుస్తకానికి గూడ అవసరమే.

"మహాకవి గాలిబ్ గీతాలను నేను తెనిగించినాను. మీకు కృతి యివ్వాలనుకున్నాను," అని ఆంధ్రమహాకవి దాశరథిగారు నాతో అన్నప్పుడు ఈ సంగతే సవినయంగా వారికి చెప్పాను.

"ఎందుకు ఇస్తున్నారు అంటే నేనేమి చెప్పగలను ? ఎన్నాళ్ళనుంచో మిమ్మల్ని తెరమీద చూస్తున్నాను. నా అభిమానానికి గుర్తుగా ఈ కానుక ఇవ్వాలనిపించింది. మీరు ఒక రంగంలో కళను ఆరాధిస్తున్నారు; నేను మరొక మార్గంలో ఆరాధిస్తున్నాను. ఇవి మీకు నా అభివందనలు — ఒక కళారాధకుడు మరొక కళారాధకుడికి ఇస్తున్నవి" అన్నారు దాశరథిగారు.

నేనేం చెప్పగలను? వారి సహృదయతకు కృతజ్ఞత చెప్పగలను. వారి మాట శిరసావహిస్తూ మరొక్కమాట చెప్పగలను.

ఈ గౌరవం వ్యక్తిగా నేను అందుకొంటున్నా, వ్యక్తిగతంగా మాత్రమే స్వీకరించడం లేదు. ఇది చలనచిత్ర కళాకారులందరికీ దాశరథిగారు బహూకరిస్తున్న అభినందనగా, తెలుగుసినిమాకు సన్మానంగా అందుకొంటున్నాను.

ఇంత గొప్ప సత్కారాన్ని అందుకొని నా తోడి కళాకారులందరికీ అందచేసే గౌరవం నాకు ఇచ్చినందుకు కృతికర్తకు మనసారా కృతజ్ఞత తెలియజేసుకొంటున్నాను.

ఇది నాకు హస్తభూషణంగా లభించినందుకు గర్విస్తున్నాను. నాలో వ్యక్తికి గూడ ఇది భూషణం కాగలదని, మహాకవి గాలిబ్ మధురకావ్యాలు ఇంతవరకూ చదవకపోయినా - విన్నవాడుగా, ఆశిస్తున్నాను.

—అక్కినేని నాగేశ్వరరావు

గాలిబ్ కవితా వైభవం

వేదనలోనుండే కవిత వెలువడుతుందంటారు. కడుపులో చల్లకదల కుండా ప్రశాంతంగా గడిచిపోతుంటే, జీవితం కల్లోలంలేని చిన్ని తటాకంలా నిశ్శబ్దంగా వుంటుంది. కాని చాలామంది మహాకవుల జీవితాలు మహా సముద్రాలవలె అనుక్షణం క్షోభించి, ఆ క్షోభలోనుండి కవితాశోభను వెలువరించినవి.

గాలిబ్ అట్టివాడు. అతను పలికిన ప్రతిపద్యం హృదయాన్ని పిండి వెలువరించినదే. ఉరుదూభాషలోనేగాక అన్యదేశ భాషయైన ఫారసీలోనూ అనన్య సామాన్యమైన ప్రజ్ఞను సంపాదించి ఆభాషలోను చక్కని కవితను వెలువరించినాడు గాలిబ్. గాలిబ్ పద్యరచనలో ఎంత దిట్టయో, వచనం కూడా అంత బాగా వ్రాసి చక్కని వచనరచనా రీతికి ఒరవడి పెట్టినాడు.

గాలిబ్ తన పదకొండవయేటనే ఉరుదూలోనూ, ఫారసీభాషలోనూ కవిత చెప్పినాడు. ఉరుదూ సాహితీ సామ్రాజ్యంలో కవితా మకుటం ధరించి ఈ నాటికీ ఏకచ్ఛత్రాధిపత్యం నెరపుతున్న మహాకవి గాలిబ్ ప్రతిభ పసినాడే అలా విజృంభించింది. గాలిబ్ సహజకవి. శ్రమపడి కవిత నేర్చినవాడుకాదు.

"ఏను స్వయముగా కవితఁ వరించలేదు,
తానె వరియించె కైతల రాణి నన్ను"

అని అతడే చెప్పుకున్నాడు. అతను ఫార్సీగజల్ తన పదకొండవ ఏటనేర్చాసి అంత్యనీయంలో "కచె" అనే ఒక ప్రయోగం చేశాడు. తన గురువైన షేఖ్ మొఅజ్జంకు ఆ పద్యం వినిపించగా ఆయన విసుక్కుని 'ఇలాటి అర్థంలేని ప్రయోగాలు ఇక ముందుచేయకు' అన్నాడట. గాలిబ్ మనస్సు అందుకు చాలా నొచ్చింది. తన ప్రయోగం సరియైనదని తనకు నమ్మకం

వుంది. కాని సరియైనదని వాదించే శక్తిలేని పసితనం. కాగా ఒకనాడు, తాను ప్రయోగించిన రీతినే ముల్లాజుహూరీ అనే ఒక కవి రచనలో ఒక ప్రయోగం కనపడింది. ఆ పద్యం తీసుకుని గురువుగారివద్దకు పరుగెత్తాడు. తన ప్రయోగం సరియైనదే అని రుజువు చేశాడు. గాలిబ్ చూపిన ఉదాహరణకు గురువు ఆశ్చర్యపడ్డాడు. హృదయం ఉప్పొంగిపోయింది. ''నాయనా! దైవదత్తమైనది నీ కవితాశక్తి. ఎవరి మాటలనూ లెక్క చేయకుండా రచన సాగించు'' అన్నాడు.

గాలిబ్ ఎంత ప్రతిభావంతుడో అంత దురదృష్టవంతుడు. అయిదవ యేట తండ్రి గతించాడు. తొమ్మిదవయేట పినతండ్రి గతించాడు. ఇక ఇంటిపెద్ద ఎవరూ లేకపోగా అమ్మమ్మగా రింటిలో పెరగవలసి వచ్చింది. తండ్రిలేని పిల్లవాడని అక్కడ అంతా గాలిబ్‌ను చాలా గారాబంగా పెంచారు. ఎట్టి కట్టుబాట్లు లేకుండా స్వేచ్ఛగా పెరిగాడు గాలిబ్. అయినా అతనిలో కవితా రచన సహజసిద్ధంగా ఉప్పొంగి వచ్చింది.

పసితనంలో గాలిబ్ రాసిన కవిత ''మీర్ తఖీ'' అనే కవి విన్నాడు. ''మీర్ తఖీ'' అప్పటికే చాలా సుప్రసిద్ధ కవి. అతడన్నాడట—''ఈ అబ్బాయికి సరియైన ఉపాధ్యాయుడు దొరికి సరియైన దారిలో పెడితే గొప్పకవి అవుతాడు'' అని. కాని సరియైన ఉపాధ్యాయుడు లేకుండానే గాలిబ్ గొప్ప కవి అయినాడు. స్వయంశక్తితోనే పాండిత్యం సంపాదించుకున్నాడు. తనను తాను దిద్దుకున్నాడు. తనను తాను నిర్మించుకున్నాడు. ఆ కాలంలో గురువువద్ద విద్యాభ్యాసం చేయనివానికి గౌరవం ఉండేదికాదు. కనుక తాను ''ముల్లా అబ్దుస్సమ్మద్'' గారి వద్ద శిష్యత్వం నెరపినట్లు చెప్పుకున్నాడు. నిజానికి అతనివద్ద నేర్చుకుంది అంతంత మాత్రమే.

గాలిబ్ స్వతంత్ర ప్రవృత్తి గలవాడు. ఆలోచనలో దాని అభివ్యక్తీకరణలో, రచనలో అన్నిటిలో కొత్తదనాన్ని కోరేవాడు గాలిబ్. జనానికి విడ్డూరం అనిపించినా, రూఢిగ్రస్తమార్గానికి భిన్నంగా తోచినా తాను లెక్కచేసేవాడు కాదు. పసితనాన అతను రాసిన ఒకపద్యం చూడండి:

''నాశమునగూడ సౌఖ్యమున్నది గ్రహింప,
విడివడిన గోరు సుఖమును బడయజేయు''

లోకంలో వినాశనంలో కూడా రుచి, సౌఖ్యం ఉన్నాయి. అది తెలుసుకోకుండా జనం వినాశనాన్ని ద్వేషిస్తారు. గోరూడిపోతే సుఖంగా వుంటుంది. గోరు ఊడడం వినాశనానికి సంకేతం. గోరుపోవడంవల్ల కలిగే హాయి వినాశంలోనూ హాయి ఉన్నది అనే సత్యాన్ని బోధిస్తున్నది అంటున్నాడు గాలిబ్. మృత్యువులోకూడా రుచి వుందనే భావాన్ని గోరూడ

టంతో పోల్చిచెప్పిన గాలిబ్ ఆలోచనారీతి కడు బాల్యంలోనే జనాన్ని చకితులను చేసింది.

"మృతియె లేకున్న రుచియేది బ్రతుకులోనన?" అంటాడు మరోచోట. మృత్యువు సమీపిస్తుంది అని అనుకునే వఱకు ఈ జీవితం రుచిస్తుంది. ఇక మృత్యువులేదు అనుకుంటే రుచేలేదు జీవితంలో. మన చేతిలో ఉన్న ఒకానొక పదార్థాన్ని మరోగంటలో ఎవరోవచ్చి తీసుకోపోతారు, తప్పదు అని పించినపుడు ఆ గంటసేపు ఆ వస్తువు అమోఘు మనిపిస్తుందికదా !

విచిత్రమైనభావాలు, విచిత్రమైన అభివ్యక్తీకరణరీతి గాలిబ్ కు ఉరుదూ సాహిత్యంతో ప్రత్యేకస్థానాన్ని చేకూర్చిపెట్టినవి. ధ్వనిప్రధానమై, వ్యంగ్యస్ఫోరకమైన ఇతని రచన ఆనాటి సాహితీపరుల ఆలోచనారీతిలో కొత్త మార్పులను తీసుకోవచ్చింది. గాలిబ్ ప్రత్యేకతావాది. తనకంటే పూర్వులు పోయినమార్గం తనకు అక్కరలేదు. తాను కొత్తదారి వేసుకుని దానిమీదే నడవాలి. ఈ ప్రత్యేకతావాదం అతని రచనలోనే కాదు, జీవితంలో అడుగడుగునా కనబడుతుంది. పదిమందిలో తానొకడుగా బ్రతకడంగానీ, చావడంగాని ఇష్టంలేదు. ఈ ప్రత్యేకతకు ఒకచిన్న సంఘటన ఉదాహరిస్తాను. గాలిబ్ చనిపోవడానికి ఏడెనిమిదిఏండ్లు ముందు అతను ఉన్నట్లో ఏదో అంటువ్యాధి---కలరావంటిది వ్యాపించింది. జనం విపరీతంగా చనిపోయినారు. "అందరితోపాటు నేనూచస్తే నా ప్రత్యేకత ఏమీ వుండదుగనుక ఈ మహామారి తగ్గిపోయినతరువాత చావాలని ఇలాగే బ్రతికివున్నాను. లేకుంటే ఇంత వృద్ధాప్యంలో ఆ జబ్బు నన్ను వదిలేసిందంటే ఆశ్చర్యం కాదూ?" అంటాడు గాలిబ్.

సంప్రదాయానికి భిన్నంగావెళ్లే గాలిబ్ ఆకాలపు చాలామంది విద్వాంసులకూ, విమర్శకులకూ కన్నెఱ్ఱ కలిగించాడు. కాని పాఠకులూ, సహృదయులూ గాలిబ్ రచనలలోని నూతనత్వాన్ని చవిచూచి ఆనందించేవారు. గాలిబ్ రచన చదువుతుంటే మనం ఇదివరకెన్నడూ చూడని కొత్త లోకాలు సాక్షాత్కరిస్తాయి. మైదానాల్లో జీవితం వెళ్ళబుచ్చినవాడికి పర్వతాలమీద ప్రయాణంచేసిన అనుభూతీ, నేలమీద ఉన్నవాడికి సముద్రాలమీద సంచారం చేసిన అనుభూతీ కలుగుతాయి గాలిబ్ రచనలు చదివితే.

తనపూర్వులు నిర్మించిపెట్టిన రాజమార్గంమీద సుఖంగా ప్రయాణం చేయడంకాదు అతను కోరేది. తన మార్గం ఎంత చిన్నదైనాసరే తాను స్వయంగా నిర్మించుకుని దానిమీద వెళ్ళాలనేది అతని సిద్ధాంతం.

గాలిబ్ రచనలలోని విశిష్టతను, ప్రత్యేకతను అవగాహన చేసుకోవడానికి అతని కొన్ని పద్యాలను ఉదాహరణగా పరిశీలిద్దాం.

"ప్రతిది సులభమ్మగా సాధ్యపడదు లెమ్ము,
నరుడు నరుడౌట యెంతో దుష్కరమునుమ్ము"

మొదట చదవగానే ఈ పద్యం ఏదో సాధారణభావాన్ని వ్యక్తపరుస్తున్నట్లు అనిపిస్తుంది. కాని సునిశితంగా పరిశీలిస్తే ఇందులోని కొత్తదనం హృదయానికి గిలిగింత పెడుతుంది. ఈ ప్రపంచంలో చాలా సులభంగా జరగవలసిన పనికూడా చాలా కష్టంమీద జరుగుతుంది. మనం సులభం అనుకుంటాం కాని అవి దుర్లభమవుతాయి తుదకు. చూడండి! తుదకు మనిషి మనిషి కావడం కూడా ఎంత కష్టమైన పనో! మనిషి మనిషికావడం ఏంకష్టం? అనిపిస్తుంది. కాని ఈనాడు మనకు కనిపించే మనుషుల్లో ఎంతమంది నిజమైన మనుషులు? అంటే నిజంగా మానవత్వంకలవా రెందరు? దయాదాక్షిణ్యాలు, ప్రేమ, స్నేహం, పరోపకారబుద్ధి కలవారెందరు? అట్టి సద్గుణాలు కలవాడే మనిషి. అందరూ మనుషులా? గాలిబ్ ఈ పద్యంలోని రెండవపంక్తిలో ఇచ్చినది తార్కిక సాక్ష్యంకాదు. కవితాసాక్ష్యం. అతను చెబుతోంది తార్కిక సత్యంకాదు, కవితా సత్యం. మొదటిపంక్తిలో అతను ప్రవచించిన సిద్ధాంతానికి రెండవ పంక్తిలో సాక్ష్యం ఇస్తున్నాడు.

మానవస్వభావాన్ని పరిశీలించడంలో గాలిబ్ దిట్ట. ఒకచోట అంటాడు:—

"ఎంతో ఉత్సాహపడుచు కష్టింతు మార!
మృతియె లేకున్న రుచి యేది బ్రతుకులోన!

మృత్యువు సమీపిస్తున్నది. ఇంక ఎంతోకాలం మనం ఈప్రపంచంలో ఉండబోము అనే భావం మనస్సులో మెసలుతుంటే ఎంతో తొందర తొందరగా ఉత్సాహంగా లౌకిక సుఖాలను అనుభవించడానికి, వాటిని సాధించడానికి శ్రమించుతాం. కాని ఇక మృత్యువు రానే రాదనిపించినప్పుడు ఈ ఆరాటం, ఆతురత వుండవు. పైగా స్థబ్ధత ఆవరిస్తుంది. మృతి అనేది లేనట్లైతే బ్రతుకులో రుచి లేదుసుమా!

"హింసపడు మాకు బ్రహ్మాండ మెంతో ఇరుకు,
అందు గగనమ్మొక పిపీలి కాండ మంత."

బాధపడుతున్నవానికి ప్రపంచం ఇంత విశాలంగా వున్నా చాలా ఇరుకుగా కనిపిస్తుంది. సంతోషం గలవాడికి ఇదే లోకం విశాలతరమై స్వర్గధామంలా వుంటుంది. ఒకే వస్తువు ఇరువురికి రెండు రీతులుగా కనిపిస్తుంది. కారణం మనస్సు. ఇక్కడ గాలిబ్ తన బాధను బొమ్మగీసి చూపుతున్నాడు. ప్రియు

రాలి వియోగంవలనగానీ, మరి ఇతర దౌర్భాగ్యంవల్లగానీ హింసపడుతున్న తమకు ఈ అఖండ బ్రహ్మాండం ఎంతో ఇరుకుగా వుంది. ఎంత ఇరుకుగా వుందో మన హృదయానికి స్ఫురించడానికి ఒక ఉదాహరణ ఇస్తున్నాడు. విశాలమైన ఆకాశం చీమగ్రుడ్డుఅంత చిన్నగా కనపడుతున్నదట! అంత పెద్ద ఆకాశం చీమగుడ్డంత చిన్నగా వుంటే ఇక బ్రహ్మాండం ఎంత ఇరుకుగా వుంటుందో ఊహించండి. ఆ ఇరుకుదనానికి కారణమైన ఆ దుఃఖం ఎంతటిదో భావించండి! ఇట్టి ఆలోచనారీతి అనన్య సామాన్యము. మొదటిపం క్తిలో ఒక సిద్ధాంతాన్ని ప్రవచించడం రెండవ పం క్తిలో దాన్ని గుండెకు హత్తించడానికి చక్కని సాక్ష్యాన్ని కూర్చడం గాలిబ్ ప్రత్యేకత.

"ఏమి వచియింతు దౌర్భాగ్య మింతకన్న!
చచ్చిపోవుదమన్నను చావు రాదు."

తన దౌర్భాగ్యం ఎంత ఘోరమైందో చెప్పడానికి "చచ్చిపోదామనుకున్నా చావు రావడం లేదు" అంటున్నాడు. చావాలనీ, చస్తే బాధలు పోతాయనీ చావడానికి సిద్ధపడ్డవానికి చావు రాకపోతే ఎంత దౌర్భాగ్యం! దౌర్భాగ్యాన్ని ఇంతకంటే స్పష్టంగా చెప్పడం అసాధ్యమేమో!

"నీటిచుక్క ముత్తెమౌట వర్జించెను
కనులలోన నిలువగలిగె తాను."

నదిలోనే ఉండిపోతే నీటిచుక్క మహా అయితే ముత్యం అవుతుంది. అంత కంటే నదీజలానికి విశిష్టమైన రూపం మరొకటి రాదు. కాని నీటిచుక్క ముత్తెం కావడానికి ఇష్టపడక, ఆ పదవిని తిరస్కరిస్తే అది ఎవరి నయనాలలోని కన్నీటిచుక్కైనా కావచ్చు. కన్నులలో కన్నీటి చుక్కగా వెలిగి నయన సింహాసనం మీద ప్రతిష్ఠ పొందడం ముత్యం కావడంకన్న వేయిరెట్లు విలువైనది. ముత్యమే అయితే ఏకంఠంలోనో మాలగా వెలుస్తుంది. ఎవరి చెవులకో ఆభరణంగా ప్రకాశిస్తుంది. కాని కాంతిమయమై, అన్ని ఇంద్రియాలలోనూ ప్రధానమైన నయనంలో స్థానం సంపాదించుకోడం సాధ్యపడుతుందా? కన్నీటిచుక్క ముత్యంకంటే కడు విలువైనది అని చెప్పడానికి ఈ పద్యంరాశాడు గాలిబ్. ముత్యంకావడంతో తృప్తిపడితే ఆ బిందువుకు ఈ పదవి లభించేది కాదుగదా! ఉత్తమ కల్పన ఇది.

"ఈ యజాండమ్ములోన నశించు నన్ని,
గాలిలో దీపమట్లుండెగా చె రవియు!"

మొదటిపం క్తిలో ఒక "స్టేట్ మెంట్" చేస్తున్నాడు కవి. రెండివపం క్తిలో

ఆ "స్టేట్‌మెంట్" సత్యాన్ని రుజువుపరుస్తున్నాడు. రెండవపంక్తి వినేసరికి మన హృదయంలో గాలిబ్ సిద్ధాంతం తిష్ఠవేసుకుంటుంది. నిజంగా ఈ బ్రహ్మాండంలో నశించని వస్తువేది? ప్రకృతీ నశిస్తుంది. మరి అనేక గోళాలు తన కుటుంబంలో చేర్చుకుని జాజ్వల్యమానంగా వెలుగుతున్న ఆ సూర్యుడో? సూర్యుడుకూడా నశిస్తాడు. సూర్యుడు గాలిలో దీపంలాగా వున్నాడట! గాలిలో దీపాన్ని సూర్యునితో పోల్చడం ఎంతో బావుంది. విశాలవాయు మండలంలో సూర్యుడు దీపంలాగే ఉంటాడు. ఒకనాటికి మలిగిపోతాడు.

"గాయపడిన నా గుండెను కాంతురేల?
తరుణికరమునకే దిష్టితగులునట్లు."

ఇది వ్యంగ్యార్థస్ఫోరకమైన పద్యం. తన గుండెకు బలమైన గాయం తగిలింది. జనులు ఆ గాయాన్ని, లేదా గాయపడిన గుండెను చూస్తున్నారు. తన గాయపడిన గుండెను జనులు చూస్తే, గుండెను గాయపరచిన తరుణి కరమునకు దృష్టి తగులుతుందని భయం. ఇందులో రెండర్థాలు స్ఫురిస్తాయి. ఒకటి—తన గుండెను అంతగా గాయపరచిన చేయి ఎంత కోమలమైనదై ఉండాలి! అలాటి ప్రియాకరమునకు దృష్టి తగులుతుందేమో అని. రెండవది—అంత గాయం కలిగించిన ఆమెచేయి ఎంత కఠినమైనది! అని.

"నాకమును పారవేయుడీ నరకమందు
అమృతమాశించు భక్తుల యాశ లుడుగ."

చాలామంది దైవభక్తులు స్వర్గంలో అమృతం లభించుతుందనే ఆశతో భగవంతుణ్ణి ధ్యానిస్తుంటారు. అసలు స్వర్గాన్ని తీసికెళ్ళి నరకంలో పారేస్తే ఇక అమృతం ప్రసక్తేలేదు. అప్పుడు అమృతాన్ని ఆశించే భక్తులుండరు. నిష్కామంగా, నిస్స్వార్థంతో దేవుణ్ణి కొలిచే నిజమైన భక్తులు కొద్దిమందే అప్పుడు సాక్షాత్కరిస్తారు.

గాలిబ్ తన భావాలను వ్యక్తీకరించే పద్ధతి ఎలావుంటుందంటే, ఆతని పద్యం చదవగానే సరీగా అదేభావం మనమనస్సులో ఇదివరకే నిరాకారంగా ఉన్నట్టున్నా, సరీగా అదే భావాన్ని అతను వెలువరించినట్లున్నా అనిపిస్తుంది. మనం చెప్పదలచుకున్నదే అతను చెప్పినాడా అనిపిస్తుంది. అంటే అంత చక్కగా హృదయంలోకి చొచ్చుకుపోతుం దన్నమాట.

ఉపమానాలకు గాలిబ్ కాళిదాసుతో పోలగలవాడు. ఇతరులు వాడిన ఉపమాసామగ్రిని అతడు వాడనేవాడడు. సరికొత్త ఉపమానాలను తాను సృష్టించుకుంటాడు.

"భ్రుకుటిక్రిందుగ నయనమ్ముపోల్కి-గానె
ఆలయముపంచలనె పానశాల వలయు."

కనుబొమ్మక్రింద కన్నుంటుంది. అది సహజం. అంత సహజంగా ఆలయముపద్ది పానశాల ఉండా లంటాడు. భ్రుకుటి చూడలేదు. కన్ను చూస్తుంది. ఆలయంలో కనిపించే దేమీలేదు. పానశాల సమ సలోకాలనూ కళ్ళకు కట్టిస్తుంది. అయితే రెండూ విరుద్ధం. అయినా ఒక్కచోట ఉండవచ్చు. కనుబొమ్మక్రిందుగా కన్నులేదా? అలాగే. ఎంత చక్కని ఉపమానము!

"ప్రతికుసుమముకుళ మ్మొక రక్తకణము
కోమలీరాగరంజితాంగుళికవోలె."

ప్రతిపూలమొగ్గా రక్తకణంలా కనిపిస్తున్నదట. ఎర్రగా కనబడుతున్న ప్రతికుసుమముకుళం ప్రియురాలి రాగరంజితమైన వ్రేలివలె వుందిట. పువుమొగ్గను ఎరుపురంగద్దిన కోమలమైన అంగుళితో పోల్చినాడు.

"గ్రీష్మమున వాన కురిసిన నూష్మమెసగు,
నల్లె కన్నీటితో గుండె నగ్ని పెరిగె."

ఎండాకాలంలో వర్షంకొడితే భూమి చల్లపడడానికి బదులు ఆవిరులురేగి మరీ ఉబ్బ ఎక్కవవుతుంది. అలాగే కన్నీళ్లవల్ల గుండెల్లోని చింతాగ్ని చల్లారదు సరిగదా ఇంకా ఎక్కవవుతుంది. కన్నీళ్లవలన మరీ పెరిగే చింతాగ్నిని గ్రీష్మకాలంలో వానకురియగా పెచ్చిన ఊష్మంతో పోల్చడం ఎంతో మనోహరంగా వుంది. కాళిదాసాదులుతప్ప అన్యుల కింత చక్కని ఉపమ అందదు.

"దరులు నదినీరు కోరినకరణి, సాకి!
ఎంత త్రాగింతు వంత వాంఛింతు మధువు."

సాకి అనగా మధువందించునది. ఆమెతో అంటున్నాడు— "నదిలో ఎంత నీరొచ్చినా ఇంకా కావాలనే అంటాయి గాని దరులు తృప్తిచెందవు. అలాగే నాకు నీవు ఎంత మధువును ఇచ్చితే అంతా పుచ్చుకుంటాను. చాలును అనను" అని.

"సహృదయునకు బయట సన్మానమబ్బును
శక్తి విడిననాటి మాక్తికముగ."

సహృదయుడైనవాడు ఇంటిలో కంటే బయటనే ఎక్కవ సన్మానం పొందుతాడు. తన దేశంలోకంటే ఇతర దేశంలో ఎక్కవ ఆదరం పొందు

తాడు. ముత్యపు చిప్పలో ముత్యం ఉంటే దాని విలువ ఏమీ లేదు. అది బయటపడి విపణిలో ప్రవేశిస్తే దాని విలువ తెలుస్తుంది.

"పూలు ముకోర్కుపి వారి ముఖాలవోలె
ఎఱ్ఱబడిపోవు, నంతలో కఱ్ఱియగును."

ముకోర్కుపులైనవాళ్ల ముఖాలు కోపంతో క్షణంలో ఎఱ్ఱబడిపోతాయి. మళ్ళీ అంతలో నల్లబారిపోతాయి. అలాగే పూలు అంతలో ఎఱ్ఱగా కనపడతాయి. అంతలో కాంతులుడిగి, వాడి వత్తలై వెలవెలబోతాయి. ముకోర్కుపుల ముఖాలతో పూలను పోల్చడం బాగాలేదూ!

"హృదయదీపమ్ము మలిగిపోయినదిగాన
పొగ వినీలాంబరము కట్టి పొగులజొచ్చె."

దీపం మలిగిపోగానే పొగ గుప్పున లేస్తుంది. భర్త గతించిన భార్య చింతాక్రాంతయై నీలిరంగు చీరెలు కట్టుకున్నట్టు దీపం మలుగగా పొగ నల్లబట్టలు కట్టుకున్నదట.

"వ్రాయునపుడు సిరా యొల్కిపడినయట్లు
విరహనిశలు నా బ్రతుకున మరక లిడెను."

రాసేప్పుడు చప్పున కలంలోనుంచి సిరా పడితే కాగితం వికారమైపోతుంది. అలాగే శుభ్రమైన బ్రతుకులో విరహ రాత్రులు మరకల్లా తయారైనాయి. మంచిరాత్రులు, మంచి అక్షరాలవలె జీవిత పత్రంమీద శోభను చేకూర్చుతవి. కాని అవి విరహరాత్రులైనప్పుడు సిరామరకలవలె వికారంగా వీర్పడుతవి.

"నిప్పు నీళ్ళలో పడగానె చప్పుడగును
ఎదియు నశియించునపుడు రోదించు గాదె!"

చుంయిమంటుంది నీళ్ళలో నిప్పు పడ్డప్పుడు. నీళ్ళలో నిప్పుపడడమంటే నిప్పు నశించడమేకదా! అలాగే బాధతో మానవుడు చనిపోతున్నప్పుడు కేక వేస్తాడు. నేనుకూడా అలాగే విరహవేదనతో నశిస్తున్నాను. కనుక ఏడుస్తున్నాను— అంటాడు గాలిబ్. నిప్పు నీళ్ళలో పడినప్పుడు అది ఆరిపోవుటవలన కలిగే శబ్దాన్ని, తాను నశించేప్పుడు వచ్చే దుఃఖాక్రందనతో పోల్చినాడు.

"వెలుగుచున్న దివ్వె మలిపివేసినయంత
కానిపించు నల్లనైన మచ్చ.

అల్లె పూర్తికాని అభిలాషముల మచ్చ
గుండెలోన కూరుచుండెనాకు.''

కొవ్వువత్తిని మధ్యలో మలిపితే ఆ వత్తిచుట్టూ నల్లగా మచ్చ కనపడుతుంది. అలాగే అభీష్టసిద్ధి జరుగకుండానే కోర్కెలు తెగిపోతే గుండెలో మచ్చ ఏర్పడి బాధిస్తూవుంటుంది.

''గగనమనెడు 'సాకి' కడ సౌఖ్యమధు వేది?
బోరగిలిన గిన్నెవోలె నుండె.''

మానవుల జీవితచక్రాన్ని నడిపే నవగ్రహాలు ఆకాశంలో ఉంటాయి. కనుక ఆకాశం అందరి అదృష్టాలకూ కర్త. అలాటి ఆకాశాన్ని మధువదించే సాకీతో పోల్చినాడు. అయితే ఈ ఆకాశాలు, గ్రహపంక్తి తనకు సౌఖ్యమును ఇవ్వజాలటలేదు. అంటే ఈ సాకీ వద్ద మధువు లేదు. ఆకాశం బోరగిలిన గిన్నెలా వుంది. అందులో మధువు లేదు. ఆకాశం బోర్లవేసిన గిన్నెలా కనపడుతుంది. పరికించి చూడండి!

గాలిబ్ ఉపయోగించే రూపకాలు, సంకేతాలు విచిత్రంగా వుంటాయి:

''మెరుపొకటి వచ్చి కనులలో మెరిసిపోయె
కొంత మాటాడగా దప్పిగొంటి నేను.''

ప్రియురాలు మెరుపు మెరిసినట్లు వచ్చింది, పోయింది. అంతమాత్రాన ఏమి తృప్తి! ఆమెతో కాస్త మాట్లాడాలనే తృష్ణ తీరనైనా లేదుకదా!

''వానచినుకుల ప్రింగగా వాగులోని
పరితితరంగము మొసలియై వాయి విచ్చె,
శుక్తిలో జేరి చినుకులు మౌక్తికమ్ము
లగుట కెన్నో యాటంకము లావహించు.''

మానవుడు పూర్ణత్వాన్ని పొందడానికి ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవాలి. ముత్యం కావడానికి పైనుంచి దూకిన వానచినుకును పరితితరంగం మొసలిగా మింగజూస్తుంది. శుక్తిలోకి వెళ్లలేకపోతే అది వృథా అయినట్టేకదా!

''గ్రింథి పడనినాడు కలవయ్యె నఖములు
గ్రింథిపడెను నేడు, కలదె నఖము?''

దారానికి చిక్కుముడి పడితే గోటితో విప్పుతాం. అయితే ఇందుకు ఉప

యోగపడే గోళ్ళు గ్రంథులు లేనినాడున్నాయి. కాని తీరా గ్రంథిపడిననాడు గోళ్ళు లేవు. అంటే భావం-కష్టాలు ఆవరించనినాడు వాటిని ఎదిరించే శక్తి వుండింది. ఇప్పుడు కష్టాలు దాపురించినవి. ఎదిరించే శక్తిపోయింది.

గాలిబ్ రచనలోని మరో విశిష్టత ఏమిటంటే ఎంతో గంభీరమైన అర్థాన్ని బోధించేటప్పుడుకూడా మనను నవ్వించే నర్మహాస్యంలో దాన్ని పొదిగి అందిస్తాడు.

"నడుము బిగియించుచుంటివి నన్ను దునుమ,
నాకు తెలియులే నీ కెంత నడుము కలదో!"

తనను చంపడానికి నడుము బిగించి వస్తున్నది ప్రియురాలు. కాని ఆమెకు ఎంత నడుముందో తనకు తెలుసట! ఆ సిన్నా సివిచికిత్సను కలిగించేటంత సన్నని నడుము గల నీవు నడుమేం బిగిస్తావులే అంటాడు ప్రేయసితో.

"బాధలో నాకు రుచి కనుపట్టగానె
చాన నన్ను బాధించుట మానుకొనియె."

ప్రియురాలు తనను నానాబాధలూ పెడుతుండేది. 'తినగ తినగ వేము తియ్యనుండు' అన్నట్లు బాధలు అనుభవించీ అనుభవించీ వాటిలోనే రుచి లభించింది. బాధలో తనకు రుచికలుగుతోందని ఆమెకు తెలియగానే బాధించడం మానుకుందట. అంటే బాధలలోని రుచినైనా అనుభవించకుండా చేసి మళ్లీ బాధిస్తున్నది.

"ఎంత తీయని పెదవులే ఇంతి! నీవి?
తిట్టుచున్నప్పుడున్ గూడ తీపి కురియు."

నవ్వు తెప్పించే పద్యమే. కాని అందులో వేదన నిండుగా వుంది. ఆమె తిట్లలో తీయదనాన్ని వెతుక్కుంటున్న దౌర్భాగ్యుని దీనస్థితి స్ఫురించుతుంది.

"ప్రణయినీ రాగరంజిత పదయుగమ్ము
ముద్దుగొను కోర్కి తీరకపోయెగనుక
ప్రియు సమాధి సమీపధరిత్రినిండ
చిక్కచిక్కగా మైదాకుచెట్లు పెరిగె."

ప్రియురాలు రోజూ కాళ్లకు మైదాకు పెట్టుకునేది. ఆ మైదాకు రంగుతో కాళ్ళు ఎఱ్ఱగా వుండేవి. ఆలాటి కాళ్ళను ముద్దుపెట్టుకునే భాగ్యం అబ్బకుండానే అతడు చనిపోయినాడు. కోర్కెలు తీరకుండా చనిపోయినవారికి

ఆ కోరికలు ఆకారం ధరించివచ్చి పిశాచాలై వెంటబడతా యంటారు. ఇక్కడ ఆమె రాగిరంజిత పాదాలకు ఎఱుపుఅద్దిన మైదాకు చెట్లుచెట్లుగా అతని సమాధిచుట్టూ పెరిగి, అతని అసంపూర్ణవాంఛితాలను తెలుపుతున్నాయట! ఇంతశోభాకరమైన భావం వున్నా ఇందులోనూ హాస్యం చొప్పించినాడు గాలిబు.

"కలను కానుపించి పలికె 'వత్తు'నటంచు
బ్రతుకునెల్ల నిద్రపట్టలేదు."

ఒకనాడు ఎన్నడో స్వప్నంలో ప్రియురాలు కనపడి వస్తానన్నదట. వీక్షణాన వస్తుందో అని జీవితమంతా నిద్రపోకుండా వేచివున్నాడట! నవ్వు తెప్పించే ఈపంక్తుల్లో ఎంతో వేదన వుంది. జీవితాంతం ఆమెకై నిరీక్షిస్తూ నిద్రపోని ప్రియుని బాధ వుంది.

"ఏల కాళ్ళు నొచ్చె బాలామణికి? రాత్రి
ఎవని స్వప్నసీమ కేగివచ్చె?"

ఆమెకు కాళ్లు నొప్పులుగా వున్నాయని తెలిసింది. చస్తే ఎవరింటికీ వెళ్ళదు. ఎవరినీ అనుగ్రహించదు. అలాంటిమనిషి ఎవరి స్వప్నంలోకైనా వెళ్ళివచ్చి వుంటుంది. అందుకే కాళ్లు నొచ్చినై అని హాస్యం చేస్తున్నాడు. గాలిబ్. తన ఇంటికి ఒక్కనాడూ రాలే దామె. ఎవరింటికీ వెళ్లలేదు. కాని తనవలెనే ఎందరెందరినో స్వప్నంలో కనిపించి బాధిస్తున్నది. ఇష్టురాలైన స్త్రీ లభ్యం కానప్పుడు స్వప్నంలో ఆమె తనవద్దకు వచ్చినట్టు కనిపిస్తుంది.

"పానశాలయె లేని దేదైన నేమి!
బడి, మసీదు, సత్తరువు, సర్వమ్ము నొకటె."

కావలసింది పానశాల. అది లేనప్పుడు బడి, మసీదు, సత్తరువు—ఇవి ఎంత విశిష్టమైనవైనా తనకు అన్నీ ఒకటేనట!

గాలిబ్ వివిధవిషయాలను గూర్చి రచన సాగించినాడు. రసాశ్రయమైన ఈయనకవిత ఏవిషయం తీసుకొని రాసినా రమ్యంగా వుంటుంది. శృంగారపరమైన ఈయనరచనలు ఇనుమిక్కిలిగా ఆనందాన్ని కలిగిస్తవి. "శృంగార ఏవ మధురః పరబ్రహ్మదనో రసః" అన్న ధ్వన్యాలోకసూక్తి గాలిబ్ యెడల అన్వర్థకము. శృంగారంలోనూ విప్రలంభశృంగారాన్ని ఆశ్రయించిన గాలిబ్ రచనలలో మధురవేదన అడుగడుగునా కనిపిస్తుంది. విప్రలంభ శృంగారరస భరితములైన ఈయన పద్యాలకు భగవత్పరమైన అర్థం చెప్పడానికి కొందరు ప్రయత్నిస్తారు. గాని ఉరుదూభాషా విమర్శకులు ఆ వాదాన్ని అంగీకరించ

లేదు. అక్కడక్కడ భగవత్ పరమైనవి లేకపోలేదుగాని, తక్కినవి నిజంగా ప్రేయసీ పరమైనవనుటలో సందేహంలేదు.

తనను కరుణించని ప్రేయసికై విరహావివశుడైన ప్రియుడు అనుభవించు వేదన గాలిబ్ గజళ్ళలో పరిపుష్టంగా కనిపిస్తుంది.

"అన్ని రోగములకు నౌషధం బుండియు
ప్రణయరోగమునకు కనము మందు."

మానవుని హృదయంలో ప్రణయం ఏర్పడితే అది హృదయాన్ని కలచివేస్తుంది. దానికి మందులేదు. ఇతర రోగాలకు మందుందిగాని వలపువెతలకు మం దేది? తొలివలపు రుచిగానే వుంటుంది. మనస్సు పులకిస్తుంది. తీయదనం స్ఫురిస్తుంది. ఒంటరితనపు జబ్బుకు మందు లభించినట్లవుతుంది. కాని క్రమంగా వలపే వలవంతగా పరిణమిస్తుంది.

"వలపువలన ప్రబలకు బహురుచ్యమైనది,
ఎడద తీయదనము బడయసాగె,
బాధ కౌషధమ్మ్ర బడసియు డెందంబు
మందులేని బాధ నందె మరల."

చిరకాలం కోపించి ఒకనాడు అదృష్టవశాన ప్రియుణ్ణి కనికరించిన ప్రియురాలు అతడు తన ఇంటిలోకి రావడానికి అనుమతించిందట. ఇన్నాళ్ళకైనా ఆమె కనికరించిందని సంతోషించి ప్రియుడు తన ప్రక్కచుట్ట తెచ్చుకుని ఆమె ఇంట్లో పరుచుకున్నాడు. అంతలో ఆమెకు మళ్ళీ కోపంవచ్చింది. వెళ్ళి పొమ్మన్నదట. ఈపద్యం చిత్తగించండి:—

"ఇంట నుండంగ ననుమతి నిచ్చి తీవు
చుట్టియుండిన నా "ప్రక్క" నట్లె విచ్చి
పఱచితినో లేదొ శయనించుకొఱకు నేను,
అంతలో "వద్దు, వద్దు పో" మ్మందువేమె?"

పడక పరచుకునేలోగా మనసుమారిన చంచలురాలైన ప్రియురాలి మనస్థితిని ఎంతో చక్కగా చెప్పినాడు.

"ఎంతకని ప్రాతు నా గుండెవంత? నింక
ఆమెకే చూపెదను రక్తికలాంగుళులను."

తన గుండెబాధను ఎంత వ్రాసినా పూర్తిగా వ్యక్తపరచలేకుండా వున్నాడు ప్రియుడు. తన బాధనంతా వ్రాసి ఆమెకు పంపితే కరగి తనను కరుణిస్తుందని అతని భావం. కాని ఎంత వ్రాసినా తన బాధ పూర్తిగా ఇమడదు. వ్రాసి వ్రాసి నెత్తురులు క్రక్కుతున్న వ్రేళ్ళను ఆమెకు చూపిస్తే తన హృదయబాధ పూర్తిగా ఆమెకు తెలుస్తుంది. కనుక రాసినదంతా చూపినదానికంటే రక్తాంగుళులు చూపితే ఆమెకు తన బాధ పూర్తిగా అర్థమౌతుంది అంటాడు గాలిబ్.

"నేను మరణింప నామె చింతింపదొడగె,
నెంత తొందరగా కరుణించె నన్ను ?"

విరహవేదన భరింపలేక తాను చనిపోయినాడు. అప్పుడు ఆమె అతనికోసం చింతించదొడగినది. ఈ కనికరం ఎంత తొందరగా కలిగింది? అంటే, ఇంత ఆలస్యంగానా తనను ఆమె కనుకరించుట!

"నాయెడద చీల్చి రక్తమండలము చేసె,
నేను వేదనతో మరణించినాడ,
ఇపుడు గోళ్ళకు నెరుపురం గెట్లు లెక్క-
వెలది తాను గోరంటాకు పెట్టకున్న ?

ప్రియురాలు తనను చాలా బాధించింది. గోళ్లతో గుండెను చీల్చి రక్తమయం చేసింది. గుండె చించడంవల్ల ఆ బాధ భరించలేక తాను చనిపోయినాడు. తాను బ్రతికిఉన్నప్పుడు తన హృదయరుధిరంతో ఆమెగోళ్లు ఎఱ్ఱబడుతుండేవి. ఇప్పుడు తాను చనిపోయినాడు. ఇక తన గోళ్లను ఎఱ్ఱపరచుకోడానికి పాపం! గోరంటాకును ఆశ్రయించవలసిన దౌర్భాగ్యం కలిగింది. తనను అంతగా బాధించి చచ్చేఅంత పని చేయకపోతే తన రుధిరంతో ఆమె గోళ్లు ఎఱవారుతూఉండేవికదా! తాను బ్రతికిఉంటే తన రుధిరంతో ఆమెకు సేవ చేయగలిగేవాడు. కాని చనిపోయినాడు. ఇప్పుడామెగోళ్ళు మైదాకుమాద ఆధారపడవలసిన కర్మపట్టినే అని వగచుచున్నాడు ప్రియుడు. ఇందులో ప్రియుని ప్రేమ, ప్రియురాలి కాఠిన్యము అభివ్యక్తం అవుతున్నవి.

"ఏల నన్ను మరచె నెరుగబోయితి, నామె
వలపుచూపు చూచె భస్మమైతి."

ఆమెకోసం తాను ఎంతగానో వగచుచున్నాడు. కాని ఆమె తనను మరచినది. ఇంత కాఠిన్యమేల? తెలుసుకోవలెనని కోపంగా ఆమెఇంటికి చరచరా వెళ్ళినాడు. అది గ్రహించి ఆమె ఒక్క వలపుక్రీగంటిచూపు చూచింది. ఆ

చూపుతో అతని కోపం నశించడమేగాక అతను భస్మమైపోయినాడు. అనగా ఆమెను ఏమీ అనలేక నీళ్ళుకారిపోయినాడు అనిభావం.

ప్రేయసిపై తనకు గల అనురాగాన్ని చెబుతున్నాడు :—

"ఎచట నీపదాంకముల నీక్షింతు, నచట
అడవిదారియు నందనమట్లు తోచు."

ఆమె నడచిపోయినట్టి కాలిగురుతులు కనిపిస్తే చాలు, ఆచోటు అడవిదారి అయినా నందనంవలె సుందరంగా కనపడుతుంది. ఆమెకాలిగురుతులు చూస్తే అతని కంత సంతోషం అన్నమాట.

ప్రియావియోగసంజనిత హృదయదాహాన్ని భరించలేక పోవడాన్ని చెబుతున్నాడు :—

"పత్రమున నగ్నిశిఖ భద్రపరచవచ్చు
హృదయమున దుఃఖవహ్ని భరించ లేము."

✓ కాగితంలో నిప్పుమ దాచినా దాచవచ్చునటగాని దుఃఖాగ్నిని హృదయంలో దాచడం కష్టసాధ్యంగా వుందట!

"వత్తునని రాక నాయింటి వాకిటికిని
నన్నె కాపలాగా నిల్పినా వదేమె?"

వస్తా నన్నదిప్రియురాలు. నిజమే అనుకుని స్వాగతంచెప్పడానికి వాకిట్లో నిలుచునిఉన్నాడు. ఎంతకూ రాదు. ఆమెకోసం తన వాకిట స్వాగతానికై నిలుచునిఉండడం "తన యింటికి తననే ఆమె కాపలాగా ఉంచినట్లు" దంటాడు గాలిబ్.

తన సంపూర్ణానురాగాన్నీ, ఆమె నిర్దాక్షిణ్యాన్నీ ఎంతోచక్కగా చెప్పిన పద్యం :—

"ఆమెపాదతీర్థ మానగోరితిగాని
కాళ్లు నేలమీద కడిగె నామె"

ఆమెవలపులో ఎంత మగ్నమైనాడంటే, ఆమెపాదాలు కడిగి ఆ తీర్థం పుచ్చుకోవా లనుకున్నాడు. ఒక పళ్లెరం తెచ్చాడు. కాళ్ళు ఆపళ్లెరంలో కడుక్కోమని ప్రార్థించాడు. కాని ఆమె ఎంతకఠినురాలంటే తన పాదతీర్థంకూడా అతనికి అందకుండాచేసింది కాళ్ళు నేలమీద కడుక్కుని. కాళ్ళు నేలమీద

కడుక్కుంటే నీళ్ళు నేలలో ఇంకిపోతాయి. లేదా గచ్చు నేలైతే అంతటా వ్యాపిస్తాయి. మొత్తంమీద ప్రియుడికి పుచ్చుకోడానికి చేతికి అందవు.

ఆమె కాఠిన్యాన్ని చెప్పే మరో పద్యం :—

"శస్త్రవైద్య కత్తిసైతము రక్తాశ్రు
కణము లొలికె, నీవు కరుగ వేమె!"

విరహబాధవలన గుండెలో గాయమేర్పడింది. ఆ గాయాన్ని బాగు చేయడానికి శస్త్రచికిత్స జరిగింది. అప్పుడు కత్తిసైతం అతని గుండెగాయాన్ని చూచి నెత్తుటికన్నీరు కార్చిందట! కాని ప్రియురాలుమట్టుకు కనికరించలేదు. కత్తి గుండెను కోస్తున్నప్పుడు గుండెలోని రక్తం కత్తికి అంటడాన్ని కత్తి నెత్తుటి కన్నీరు కార్చడంగా ఊత్ప్రేక్షించాడు గాలిబ్.

ఇట్టిదే మరో పద్యం :—

"నాదు గుండెగాయము కుట్టు సూదికంట
అశ్రుజలధార దారమై అవతరించె"

హృదయాన్ని కరగించే పద్యం ఇది. తన గుండెలో పెద్ద గాయం పడింది. దాన్ని కుట్టకపోతే ఇంకా పెద్దదై మృత్యువు దాపురిస్తుంది. అయితే గుండె గాయాన్ని కుట్టే సూదిలో తన కన్నీరే దారమై అవతరించిందట.

ప్రియురాలి తిరస్కారభావంవలన ఏర్పడిన వేదన ఎంత భయంకరమైనదో చెబుతున్నాడు.

"వెలది! నీ ప్రణయాకృతి కొలుతునేని
ప్రళయభీభత్సమే ఒక నిలువు చిన్న."

ప్రణయాకృతియైన ప్రియురాలిప్రక్కన అసలు ప్రళయ బీభత్సాన్ని నిలబెట్టి కొలిస్తే ప్రళయం ఒక్కనిలువెడు తక్కువే వుందట ఎత్తులో ఆమెకన్న. ఆమె వల్ల తనకు కలిగిన బాధ ప్రళయంవల్ల కలిగే బాధకన్న ఒక్కనిలువెడు ఎక్కువే అన్నమాట! విచిత్రమైన కల్పన!

ఆమె తనను పెట్టే హింస తగదని చెబుతున్నాడు :—

"ప్రేమభిక్షుకునిన్ హింసపెట్టు టరయ
ప్రణయ సౌందర్యరాజ్ఞికి పాడిగాదు."

బిచ్చగాడు వచ్చి ఏదైనా అడుగుతే రాణులు లేదనక ఇస్తారు. బిచ్చగాణ్ణి

హింసపెట్టరు. ''నీవు సౌందర్యరాజ్ఞివి. నేను ప్రణయభిక్షుకుణ్ణి. నన్ను హింసించడం న్యాయంకాదు'' అంటున్నాడు.

తన ప్రేయసి ఔన్నత్యాన్ని చెబుతున్నాడు :—

''నీ వెలుగుచేత సూర్యుడు నింగి మెరయు
లేనిచో సూర్య డొక బిచ్చగాని కరము.''

ప్రియురాలి కాంతివలన సూర్యుడు వెలుగుతున్నాడు. అంతేగాని అతనికి సహజమైన కాంతి లేదు. తన వెలుగును ఆమె సూర్యునికి ప్రసాదించకుంటే సూర్యుడు బిచ్చగాని చేయిలాగా రిక్తమైపోతాడట. అంత కాంతిమంతురాలా యమ.

తన విరహబాధను చెబుతున్నాడు :—

''మునుపు పువుతోటలన్నచో మురిసిపోతి,
పూలవాసన కూపిరిపోవు నేడు''

ఇదివరకు పూలతోటలంటే ఎంతో మురిసిపోయేవాడట. కాని ఇప్పుడు పూల వాసన తగిలితే ఊపిరిపోయేట్టుంది. అనగా పూలవాసన ప్రేయసిని మరింత తలపించి తన వేదనను మరింత పెంచి ప్రాణంపోయేంత పని చేస్తున్నది.

''ఆమె రానుండె నను వార్త యందె నిపుడె,
నాకు నే డింట చాపైన లేకపోయె.''

ఇన్నాళ్లకు ఆమె తన ఇంటికి రానున్నట్టు వార్త తెలిసింది. ఆమెను కూర్చో పెడదామంటే చాపచింపైనా ఇంట్లో లేదు. ఆమెకోసం పిచ్చివాడై సమస్తం పోగొట్టుకున్నాడని భావం.

''మృత్యు వే తెంచినపు డామెలేఖ వచ్చె
చదువకయె వక్షమున నుంచి చచ్చినాను.''

తీరా మృత్యువు సమీపించిననాడు--ఇన్నాళ్లకు--ఆమెవద్దనుంచి లేఖ వచ్చింది. చదివే శక్తిలేదు. వక్షంమీద పెట్టుకుని, చదవకుండానే, చనిపోయినాడు. ప్రాయక ప్రాయక ఇన్నాళ్ళకు ప్రాసింది ఆమె. ఆ లేఖలో ఏముందో చదువు కునే భాగ్యమైనా కలుగలేదు.

''దుఃఖవిషము నాప్రాణాలు తోడివేసె
నీవు సను చంపితి వటంచు నింద యేల ?''

దుఃఖంతో తాను చనిపోయినాడు. లోకమంతా, తనను చంపింది ఆమే, అని ఆమెను నిందించుతున్నారు. "నిన్ను నిందించడం దేనికి? నన్ను చంపింది నీవు కాదే, పాపం! నా దుఃఖమే నన్ను చంపింది. లోకం నిన్ను నిందిస్తుందేమిటి?" అంటున్నాడు ప్రేయసితో. "నీ వల్లనే నేను దుఃఖపడి చచ్చినాను" అనే అర్థాన్ని ధ్వనిగా అందిస్తున్నాడు కవి. చక్కని వ్యంగ్యప్రధాన కవిత.

"అన్ని బంధాల విదలించినట్టి యెడద
కురుల ఉరులందున చిక్కుకొనెను, చెలియ!"

అన్ని బంధాలను విడిలించుకున్న తన హృదయం, తన ప్రియురాలికురులు అనే ఉరులనుండి మట్టుకు తప్పుకోలేక వాటిలో చిక్కుకొన్నదట!

ఇన్ని బాధలు అనుభవిస్తున్నా ప్రణయాన్ని వదలుకోలేడు:

"జ్వాలయే దీపమునకు సర్వస్వమట్లు
ప్రణయమే జీవితంపు సర్వస్వమయ్యె."

తనలో దరుల్లారయనున్న వేదనను చెబుతున్నాడు:

"నన్ను కవ్వించబోకు, నా కన్నులందు
అశ్రుధుంధూమరుత్ సమూహములు కలవు."

తన కన్నులలో కన్నీటితుఫాను లున్నవట!

"వత్తునని మాట నిచ్చె నా వలపురాణి
ఎదురుచూచెద, రాకపోయినను గాని"

వస్తానని మాట ఇచ్చింది. రాదని తనకు తెలుసు. అయినా ఎదురుచూస్తాడట. దానిలోనైనా కొంత తృప్తి లభిస్తుందేమో!

"ప్రణయమున చావుబ్రతుకు, సర్వమ్మునొకటె,
ఎవరికై చావగలనో, జీవింతుగూడ"

ప్రణయంలో చావుబ్రతుకులు రెండూ ఒకటే. ఒకటి ప్రియముకాదు, ఒకటి అప్రియము కాదు. కాని నీ కోసం చనిపోగలను, నీ కోసం బ్రతుకగలను కూడా.

"నీదు కనుచూపు కత్తిగానీ యెడంద
జొచ్చినపుడు మిత్రమువోలె జూచికొందు"

ఆవిడ చూపు కత్తివలె గుండెలో గుచ్చుకున్నది. హృదయంలో ప్రవేశించిన వానిని మిత్రునివలె చూచుకోవలెగనుక కత్తినైనా మిత్రునివలె చూచుకుంటాను. నీ చూపు నాగుండెలో దిగి బాధిస్తున్నది. అయినా ఆ చూపును ఇష్టంగా స్వీకరిస్తాను.

ఇంచుమించు ఇలాటి భావమే మరికొంత అందంగా ఈ క్రిందిపద్యంలో చెప్పినాడు గాలిబ్.

"ఎడదలోనుండి వెడలిన, వెడలకున్న
క్రాలు నీబాణసునిశితాగ్రమ్మె ప్రియము"

ప్రియురాలు విడిచిన బాణం గుండెలో గుచ్చుకుంది. అయితే వెలికి తీయరాకుండా వుంది. తీయవచ్చినా, తీయరాకున్నా గుండెలో గ్రుచ్చుకున్న నీబాణం నాకు చాలా ప్రియమైనది అంటున్నాడు. బాణ మనగా ఆమె చూపే కావచ్చును, లేదా ఆమె వలపే కావచ్చును. బాధించేదే అయినా అది తన హృదయంలో గ్రుచ్చుకున్నదిగనుక తనకు ఆ బాణపు వాడిముక్క ప్రియమట!

"ఊహలోనున్న ఆమెకై ఉబ్బిపోదు
మధువు నూహించి పాడెడి మధుపమట్లు."

ఆమె ఇంకా తనకు లభింపనేలేదు. అప్పుడే ఆమెకోసం ఉబ్బిపోతున్నాడు. తేనె ఇంకా గ్రోలకుండానే కేవలం తలపుతో పాటపాడే మధుపంగా వుంది ప్రియుని పరిస్థితి.

నిజానికి, మధుపానం చేసినతరువాత ఆ నిండుమత్తులో మధుపం పాడలేకపోవచ్చు, అనుభవించినతరువాత మధువుపై ఆసక్తి తగ్గనూవచ్చు. కనుక మధువుకై ఆరాటపడుతున్నప్పటి మధురానుభూతి తరువాత కలుగదు. ప్రేయసిరాకకై నిరీక్షించడంలో కలిగే అనుభూతి ప్రియాసంయోగం తరువాత సన్నగిల్లడం సహజం. కోర్కెలు ఫలించకపోవడమే మేలేమో!

"వెతల కుంచెడివాడు నవ్విన విధాన,
పైన సంతోషమును, లోన బాధ నాకు"

తానెప్పుడైనా సంతోషంగా కనుపడ్డా అది పైపై నవ్వే గాని లోనమాత్రం బాధే.

"బాధ భరియింపలేక బాష్పజల మోడ్చి
దాన తానమాడితి, పవిత్రతను గంటి"

గుండెలో బాధ తగ్గాలంటే కన్నీరు కార్చాలి. అప్పుడు కాస్త బరువు తగ్గినట్లౌతుంది. ఆ కన్నీళ్ళలో స్నానం చేస్తే పాపాలు క్షాళితము లౌతాయి. పవిత్రత యేర్పడుతుంది.

"ఆననము చూపకుండిన మానెగాని
ముసుగు తీసి కుపిత నేత్రములనె చూపు"

నీ అందమైన ముఖాన్ని చూపడం ఇష్టం లేకపోతే, నీకోప సంభరిత నేత్రాలనైనా చూపించు. ప్రసన్నవదనంతో కనపడకుంటే మానె. కోపంతో నావైపు చూచినా చాలు. ఆ కోపం తొణికిసలాడే కన్నులైనా ఆ ముసుగు తొలగించి చూపు!

"ఎంత దుష్కరాలవే! నిరాశాదేవి!
హృదయ రాజ్ఞి నె మరపించజూతు."

ఇక ఆమె లభించదనే నిరాశ బలంగా నాటుకుంటే ఆమెను క్రమంగా మరువగలుగుతాడు. కాని ఆమెను మరవడం ఇష్టంలేదు. మరపు కలిగించడానికి ప్రయత్నించే నిరాశాదేవిని నిందిస్తున్నాడు. ఆమెపైన నిరాశ కలిగినా ఆమెను మరవడం ఇష్టంలేదు తనకు.

"ఆమె కోపన; నాకథ అధికదీర్ఘ,
మద్ది వినిపింప సందేశహరుడె జడియు."

తానంటేనే ఆమెకు కోపం. ఇక తన వేదనాకథ సుదీర్ఘం. అలాంటి కథను ఆమెకు వినిపించమని సందేశహరుణ్ణి పంపితే వాడికే భయం కలుగుతున్నది. ఆమె ఏమంటుందో? అసలు వింటుందో? అసలే కోపన.

"కరుణ గలిగియు తన పూర్వసరణి దలచి
సిగ్గుతో తాను వెనుకకు తగ్గజొచ్చె."

పూర్వం బహుకఠినంగా ప్రవర్తించేది ఆమె. కాని ప్రియుని దీనావస్థచూచి కరుణ కలిగింది ఆమెకు. అయినా పూర్వం కఠినంగా ప్రవర్తించేది ఇప్పుడు మారితే లోకం ఏమనుకుంటుందో అని సిగ్గుపడి తన కారుణ్యాన్ని ప్రదర్శించడానికి వెనుకాడుతున్నది. కరుణ కలిగికూడా కాఠిన్యమే ప్రదర్శిస్తున్న దని భావం.

"దుఃఖవిష మింక గళమునే దూరలేదు
నరములన్ చేరినపు డెంత నరకమగునో!"

ఇంకా సరీగా గొంతులోకే చేరలేదే దుఃఖ మనే విషం, అప్పుడే ఇంత బాధగా వుంది, ఇక అది డొక్కలోకి వెళ్లి జీర్ణించి రక్తంలో కలిసి రక్తనాళాలలో ప్రవహిస్తే ఎంత నరకంగా వుంటుందో?

"ఇంతి దారికి వచ్చెడిదేమొ తుదకు,
నీవు తొందర పడి మరణించినావు."

తనతో తానే అనుకొంటున్నాడు. నీవు బాధ భరించలేక తొందరపడి చని పోయినావుగాని బ్రతికేవుంటే మరికొన్నాళ్లకైనా ఆమె దారికి వచ్చి నిన్ను కనికరించేదేమో! ఎంత బాధైనాసరే మరికొన్నాళ్ళు బ్రతుకవలసివుంటివి. ఆమె దారికివచ్చి నిన్ను ఆదరించేదేమో!

"ఇంత దుఃఖము సైప నా కేక హృదయ
మేల? ఒకపది ఇవ్వవై తేమి? దేవ!"

బాధ భరించవలసింది హృదయం. అయితే ఉన్నది ఒక్కటే హృదయం. బాధ చాలా రెట్లు ఎక్కువై పోయింది. ఇంత బాధను భరించే శక్తి ఆ ఒక్క హృదయానికి లేదు. కనుక దైవమా! ఒక్క హృదయం ఎందుకిచ్చావు? ఓ పదిహృదయా లివ్వక పోయినావా? దుఃఖాన్ని భరించ గలగడంలో అవి తోడ్పడేవి. దీన్ని పట్టి అతని వేదన ఎంతో అంచనా వేసుకోవచ్చు.

"నను వదలి పొగవలె నేగె నాదునీడ
గుండెలో అగ్ని గలవాని గోరనేది?"

తాను సుఖపడి ఇతరులను సుఖపెట్టే వానివద్ద ఎవరైనా ఉండడానికి ఇష్టపడ తారు. కాని ఇతను గుండెలో అగ్నికలవాడు కనుక నీడకూడా ఇతన్ని విడిచి వెళ్ళిపోయింది. ఇప్పుడు మరీ ఒంటరివాడైనాడు. తనను నీడ వదలిపోవడాన్ని నిప్పులోనుంచి పొగ పైకిలేచిపోవుటతో ఉపమింపజేసినాడు. కడు కొత్త పోలిక.

"తరుణిదీర్ఘ కేశములు సౌందర్యఖనులు
వెలసినవి నేడు నన్నుఱి పెట్టుకొంఒకు."

ఆమె పొడవైన వెండ్రుకలు అందాలకు నిలయాలు. కాని అవి తనకు సౌఖ్యము నీయడానికి బదులు ఇప్పుడు ఉరి పోస్తున్నవి. అనగా ఆమె అనుగ్రహించి

నప్పుడు తాను ఆ కురులను ఆనందించగలడు గాని, ఇప్పుడు ఈ విరహసమయాన అవి మరీ బాధపెడుతున్నవి.

"కలలలో నామె నాస్థితి తెలియవచ్చు,
కనుక ప్రత్యక్షముగ నడుగంగరాదు."

తన పరిసితులు తెలుసుకోడానికి ఆమె కలలో వస్తుంది. ప్రత్యక్షంగా రాదు. కనుక ఆమె తనను యెందుకు బాధిస్తున్నదో అడుగాలంటే కలలోనే అడగాలి. ప్రత్యక్షంగా అడుగడానికి వీలులేదు. ఎందుకనగా ఆమె ప్రత్యక్షంగా రానే రాదు. కలలో రావడం అనగా ఆమె తనవద్దకు రానేరాదని అర్థం.

"నా సమస్త మెరింగియున్నయటు లామె
మోసగించు, నింకేమి చెప్పుదును నేను?"

అదృష్టవశాన ఎప్పుడైనా ఆమె కనపడితే నా కష్టసుఖాలు చెబుదామనుకుంటాను. కాని చెప్పబోయేప్పటికి నా సమస్తం తనకు తెలిసినట్లు నటించి మోసగిస్తుంది. ఇక నేనేమి చెప్పేది? చెప్పే అవకాశం వచ్చినప్పుడుకూడా నన్ను తాను చెప్పనీయదు.

"ఆమె దారిబోవుచు నాదు క్షేమ మరయు,
ఏమి చెప్పుదు దారిలో నింక నేను?"

ఎవ్వరూలేని ఏకాంతస్థలంలో కలిసి ఆమె నా క్షేమం అడిగితే నా దౌర్భాగ్యాన్నిగూర్చి, బాధలనుగూర్చి చెప్పుకుంటాను. కాని దారిలో పదిమందిముందర "క్షేమమేనా" అని అడుగుతే 'ఆ' అని తలఊపవలసిందేగాని చెప్పుకోడానికి వీలులేదుకదా! ఈ విధంగా నా బాధలను నేను చెప్పుకోడానికి వీలివ్వకుండా లాంఛనంగా "క్షేమమేనా" అని అడిగి "ఆ" అనిపించుకొని తెలివిగా బయటపడుతుంది దారిలో కలిసి.

"నీదునిండుచూపు నే గోరి వేచితి,
కాంతు వేమిటె అరకంట తుదకు?"

నిండుచూ పనగా ప్రేమగలిగి, కనికరము గలిగి, అనుగ్రహించ సిద్ధపడిన ప్రియురాలి చూపు. అట్టిచూపును కోరి ఇంతకాలం వేచిఉంటే తుదకు అరకంట మాత్రమే వేమే? అనగా నిండుచూపు కోరినవానికి అరకంటిచూపు చాలదు. చమత్కారము!

''మొరపెట్టుకొనుటకై స్వరతాళములు లేవు
కన్నీటిపాటలో గణయతులు కనరావు''

దుఃఖం వెళ్ళబోసుకోడానికి స్వరాలు తాళాలు ఎందుకూ? కన్నీటిపాటకు గణాలూ యతులూ ఎందుకు? హృదయంలోనుండి పొంగులెత్తి వచ్చే బాధకు నియమాలు నిబంధనలు లేవు.

''స్వప్నమందు తాను వచ్చి ననోన్మాదార్చి
శాంతపరచెనేని చాలు నాకు,
కాని దుఃఖవహ్ని కాసంత నిద్దుర
పట్టనీదు, స్వప్న మెట్టులబ్బు?''

ఆమె నిజంగా రాకున్నా మానె. కలలోనైనా కనపడి ఓదార్చితే అంతకే తృప్తిపడతాను. కాని కలలోకూడా నాకు ఆమె కనపడే భాగ్యంలేదు. ఎందుకనగా, దుఃఖంవల్ల రవ్వంతైనా నిద్రపట్టదు. నిద్రపట్టనిది కల ఎలా వస్తుంది? విచిత్రమైన కల్పన!

''చావగోరెడు వానికి చావురాని
ఘోరదుర్గతి నిక చూచి తీరవలయు''

చావాలనుకొన్నవానికి చావురాకుంటే అంతకన్నా ఘోర మేముంటుంది?

''పీడవో, పిశాచమవో, దుర్విధివొగాని
నీవు నాదానవై తివేని అదె చాలు''

నీ వల్ల నాకు చాలా కష్టాలు కలిగినవి. నీవు పీడవేఅయినా, పిశాచమవే అయినా, దుర్విధివే అయినా నీవు నాదానవై తే నాకు తృప్తి. బాధిస్తున్నావు గాని నా దానివి కాకుండా ఉన్నావు.

''తరుణిచేతి అంబు తగులునట్లుగ నిల్చి
గాయపడగ కోర్కి గలదు నాకు,
అంబు తగులదేని అద్దాని గొనిపోయి
తరుణి కిత్తు మరల తాను వేయ''

ప్రియురాలి చేతి బాణపుదెబ్బ తినాలనే కోరిక ఉన్నది. ఆమెవలన సుఖం లభించకుంటే మానె కష్టమైనా కలిగితే దాన్ని అనుభవించి తృప్తిపడతాను. ఆమె బాణం ఎక్కుపెట్టగానే ఎదురుగా నిలుచుంటాను. పొగపా

టున అది నా గుండెకు తగులక గురితప్పిపోతే ఆ బాణాన్ని వెదికితెచ్చి ఆమెకే ఇచ్చి మళ్ళీ నా గుండెకు కొట్టించుకుంటాను.

''కాళ్ళు బొబ్బలెత్తి కడు మెల్లగా సాగు
బాటసారి వోలె బరగినట్టి
తారకాగణమ్ము త్వరగా చరింపదు
ప్రణయదీర్ఘమార్గ వర్తియగుచు''

ఆకాశంలో నక్షత్రాలు గబగబా నడుస్తున్నట్టు కనపడవు. మెల్లగా సాగుతుంటాయి. సుదీర్ఘమైన ప్రేమమార్గం ఎంతకూ ముగియక నడచినడచి కాళ్ళు బొబ్బలెత్తగా మెల్లిగా నడుస్తున్నయట చుక్కలు. అవి కాళ్లుబొబ్బలెత్తిన బాటసారిలా వున్నాయి.

''ఆమె జూడగ నామెొగ మందగించె,
రోగి బాగయ్యె ననుకొనసాగె నామె''

కనపడక కనపడక కనపడిన ఆమెను చూడగానే చిరవిరహరోగంతో కృశించిన నా ముఖంలో తాత్కాలికంగా కొంత కాంతి వచ్చింది. ఆది చూచి నా రోగం బాగైందనుకున్న దామె. నిజానికి ఆ జబ్బు అలాగే వుంది. ఆ నిజం ఆమెకు తెలిసివుంటే నా వద్ద ఉండి నాకు సపర్యలుచేసి, చికిత్స సాగించును. కాని ముఖంమీది క్షణకాలపు కాంతినిచూచి బాగైనానని తాను వెళ్ళిపోయింది. పోగానే జబ్బు మళ్ళీ ముదిరింది.

''రాత్రిగోష్ఠిలోన రాగిల్లిన జగంబు
తెల్లవారగానె నల్లవారె.''

రాత్రంతా ప్రేయసితోను, మధువుతోను లోకం రాగిల్లింది. కాని తెల్లవారే వరకు మధువు లేదు, వధువు లేదు. జగం నల్లబడిపోయింది. తెల్లవారి మళ్ళీ అదే వేదన.

''ప్రణయ బాధితులను గూర్చి పలుకవశమె?
పాదములనుండి తలదాక బాధ యొప్పు.''

మరేదైనా బాధైతే శరీరంలోని ఏదోఒక భాగంలో వుంటుంది. ఈ ప్రణయ బాధ ఆపాదమస్తకం కమ్మివుంటుంది.

''పిచ్చివాడ నేను చచ్చిపోయినగూడ
నా సమాధిమీద దోసమనక

పిల్లవాండ్రు విసరివేసినా రెన్నెన్నో
బండరాళ్లు పూలచెండులట్లు.''

ప్రియా విరహంతో పిచ్చెత్తినవాడిమీద పిల్లలు రాళ్ళు విసరుతారు. 'మజ్నూ' మీద అలాగే రాళ్లు విసరేవాళ్ళు. అయితే ఇతను ఆపిచ్చిలో ఉన్నప్పుడు పిల్లలు మజ్నూమీదిలాగే రాళ్లు వేసేవారు. కాని ఇతను చచ్చిపోయిన తరువాత కూడా ఇతని గోరీమీద పిల్లలు రాళ్లు విసరుతున్నారు పూలవాడిరి. నిజానికి గోరీలమీద పూలు చల్లాలి, రాళ్లుకాదు. కాని ఇక్కడ ఇతని పిచ్చి ఎంత ముదిరిందంటే పిల్లలు ఇతను బ్రతికిఉన్నప్పుడేగాక చనిపోయిన పిమ్మటకూడా రాళ్లు విసరటం మానుకోలేదు. అంత పిచ్చి పుట్టివుండింది ఇతనికి. ఇదంతా ప్రియురాలికోసం విలపించే కదా!

''నాకు విధిలేక మూగనైనానుగాని
లేనిచో నేను మాట్లాడలేని దేది?''

వ్యధాభిన్నమై హృదయం నిశ్శబ్దాన్ని అవలంబించింది. ఏమి చెప్పుకనే శక్తి లేదు. ఆమెను నిందించడం ఇష్టంలేదు. చెప్పుకోనిది బాధ ఎవరికీ తెలియదు. చెప్పుకుంటే రహస్యం బయటపడుతుంది. కనుక మూగిగా కూర్చున్నాను. అంతేగాని నేను మాటాడలేనిదేది?

''నన్నుగూర్చి వార్త నాకె అందనిచోట
నేను వాసముండినాను నేడు.''

తన వార్త తనకే అందనిచోట ఉన్నాడట. తన ఒంటరితనం, తన బాధ, తన దౌర్భాగ్యం ఎట్టివో ఇంతకన్న ఎలా చెప్పగలరు ఎవరైనా?

''ఏది యమునింటి అగ్నిలో ఇంత వేడి?
కనపడక కాల్చు వేదనాంగార మిద్ది.''

తన హృదయంలో దాగివుండి బయటికి కనరాకుండా కాల్చే వేదనాగ్నివలన కలిగే బాధ నరకంలోకూడా ఉండదు అనటానికి—కనపడక కాల్చు వేదనాంగారంలోని వేడి నరకంనిప్పులోకూడా లేదంటున్నాడు.

''నన్ను హత్యచేసి నాసమాధిని నీదు
వీధి గట్టబోకు ప్రియలతాంగి!
నా సమాధిబట్టి నలుగురు నీయిల్లు
తెలిసికొనుట నోర్వగలనె నేను?''

నన్ను చంపి నా సమాధిని నీవున్నవీధిలో మట్టుకు కట్టించకు. ఎందుకంటే — ఫలానావాని సమాధి ఉన్నవీధిలో ఫలానాచోట ఆమె ఇల్లు అని గుర్తుపెట్టుకుని పరులు నీఇంటికి వస్తారు. అది నేను భరించలేను. నిన్ను నాసమస్తంగా భావించు నేను, నీవద్దకు అన్యులు చేరడాన్ని భరించలేను. కనుక నన్ను హత్యచేస్తే చేయిగాని నా సమాధిని నీవీధిలోమట్టుకు కట్టించకు.

తనను ఆమె దరిజేర్చకున్నను అన్యులు ఆమెవద్దకు వెళ్ళడాన్ని గాలిబ్ భరించలేడు.

"నీదు లేఖను పొంది ఆమోదపడను,
జాబు తెచ్చువానిపయి నీర్ష్యపడుకతన."

నీవద్దనుంచి రాకరాక లేఖ వస్తే సంతోషించలేను. ఎందుకంటే నీలేఖను తెచ్చిన వార్తాహరునిమీద నాకు ఈర్ష్య. అందుకు కారణం: నేను నిన్ను చూచే భాగ్యానికి నోచుకోలేదే, ఆ వార్తాహరుడు నిన్ను కళ్లారా చూచి నీ సౌందర్యాన్ని అనుభవించివుంటాడు. ఆ అవకాశం వాడికి కలిగి నాకు కలుగనందుకు వానిమీద ఈర్ష్యపడతాను.

"నారోదనము నిన్ను చేరినంతటనె
మారిపోవునుగదే మధురగానముగ"

నేను ఏడ్చిన ఏడ్పు నీకు అందితే అది గానంగా మారిపోతుంది. నీవు అందుకుంటే నాదుఃఖమే సుఖంగా పరిణమిస్తుంది.

"ఆమెకనులు నిశ్శబ్దమ్మ్మలయ్యి పలుకు,
పలుకుటగ్గిని పొగయె కజ్జలముగాగ."

ఆమెకళ్ళు మాట్లాడకనే మాటాడతాయట. ఆ కనులపలుకు లనే అగ్నికి దాని పొగయే కాటుక. కన్నుపలుకుల అగ్నికి కనులలోని కాటుక పొగయట! ఏమి ఊహ!

ఆమెకు తనమీద ఎంత అనిష్టమో చెబుతున్నాడు:

ఆమె పల్లకిలో నెక్కి అరిగె నాదు
వీధివెంబడి పడి కడు వేగమునను.
పల్లకిని మోయు బోయీలు బరువువలన
బుజము మార్చగాగోర నొప్పుకొనకుండ."

నేనున్న వీధినుంచే పల్లకిలో ఆమె వెళుతున్నది. అయితే ఎలాగో గబగబా నన్ను తప్పించుకునిపోవాలని ప్రయత్నం. పల్లకీబరువువల్ల బోయీలు బుజము మార్చుకుందా మనుకుంటే అందుకు అనుమతించకుండా గబగబా వెళ్ళిపోతున్నది.

"వానరాతి నిన్ను వదలి యెట్టుల పుత్తు?
లెక్కబెట్ట నొక్క చుక్క లేదు."

విరహంలో ఆకాశంలోని చుక్కలను లెక్కపెడుతూ రాత్రులు ఒంటరిగా గడుపవలసిఉంటుంది కాని మబ్బుపట్టినరాత్రి ఒక చుక్కైనా కనరాదు. ఏమిలెక్కపెట్టను?

"ఉన్న హృదయ మొకటి—నిన్ను చూడని బాధ,
నిన్ను వినని బాధ యెన్న రెండు."

హృదయమేమో ఒక్కటి. కాని బాధలు మట్టుకు రెండు. ఒకటి - నిన్ను చూడలేదన్న బాధ, రెండవది- నీవు మాట్లాడగా విను భాగ్యం కలుగ దాయెనే అన్న బాధ.

"అలిగితిని నీపయిన్, ప్రియురాల! నేను,
అదియు నావెట్టిలో నొక అంగమగును."

నీమీద నేను అలిగినాను. నీవు నామీద అలుగుట న్యాయంగాని నేను నీమీద అలగడం ఏమిటి నాపిచ్చిగాక?

"ఎవ్వరేని నాగాథ వచింప నామె
వినును చక్కగా; ననుగూర్చి అన దొకింత."

ఎవరైనా నాగాథను ఆమెకు చెబితే వింటుందిగాని, నోరు విచ్చి అయ్యో! అని అనదు. విని ఊరుకుంటుంది. ఎంత కఠినురాలు!

"గాలిబా! ఆమెతో చెప్పగలము నీదు
వ్యథను గూరిచి, నీ గుండెవంత గూర్చి;
కాని అంతమాత్రమున తా కనికరించి
చేరవచ్చు నటన్నది చెప్పలేము."

"గాలిబ్! నీ బాధను మేము ఆమెకు చెప్పగలం గాని అంతమాత్రాన

ఆమె మనస్సు కరగి నీ వద్దకు వస్తుందనేది నట్టుకు చెప్పలేము''. అనగా ఆమె అంత కఠినురా అన్నమాట.

''సౌఖ్యమును గోరి మధువాను చవటయెవడు ?
లోకమెల్లను మఱవగోరుదును నేను.''

మధువు పుచ్చుకునేది సుఖంకోసంకాదు. ఉన్న దుఃఖాన్ని మరచిపోవడానికి పుచ్చుకుంటున్నాను. ఈ దుఃఖభరితమైన లోకాన్ని మరువడానికి మధువు సేవిస్తున్నాను.

''కఠిన శిలవంటి హృదయము గల్గు దాన!
తల పగులగొట్టుకొనుటయే వలపులైన
నీ గృహద్వార బంధ సన్నిష్ఠ శిలనె
తల పగులగొట్టుకొనియెడి తలపు లేల ?''

ఆమె కఠినశిలవంటి హృదయం కలది. కనుక తాను ఎంత బాధపడినా కనికరించదు. కాగా ఇక బాధ భరించలేక తల పగులకొట్టుకోవలసియే ఉన్నయెడల ఆమె ఇంటిముందరి రాతికే తలపగులగొట్టుగోడం దేనికి? ఏ రాతికైనా కొట్టుకోవచ్చు. కాని ఆ రాతికే తల పగులగొట్టుకోవాలనే కోర్కె కలుగుతున్నది. చచ్చినా ఆమె ఇంటిముందే చావాలి.

''నావలెనె దుర్దినములున్న నరు డొకండు
రేయినే పగలనుకున్న పోయెనేమి ?''

మబ్బులక్రమ్మిన పగలునూ, దుఃఖాలున్న రోజునూ దుర్దినం అంటాం. దుర్దినం నాడు ఎవరైనా నావంటివాడు రాత్రిని పగలనుకుంటే తప్పేమిటి? అని అడుగుతున్నాడు. ఎందుకంటే, చీకట్లుక్రిమ్మిన పగలు, రాత్రి ఒక తీరుగానే ఉన్నవి. కాగా పగలును రాత్రి అనుకున్నా, రాత్రినే పగలనుకున్నా ఒకటే. రెండూ, మేఘావృతమై అంధకార బంధురాలే. అయితే గాలిబ్‌లోని చమత్కార మేమంటే ''పగలును రాత్రి అనుకోవడంలో ఏంపోయింది'' అనటానికి బదులు ''రాత్రిని పగలనుకుంటే ఏంపోయింది'' అని తలక్రిందులుగా పలికి చమత్కరిస్తున్నాడు.

''బ్రతికినన్ని నాళ్ళు వెతలు తప్పవుకదా !
మృతియె వెతలదీర్చు మేటి మందు''

దుఃఖాలను పొగొట్టే మంచిమందు మృత్యువొక్కటేనట !

"ఆమె తననుగూర్చి అతిగర్వపడుచుండు
కాన పిలువబోదు తాను నన్ను,
నేను స్వాభిమాన నిరతుడ గావున
పిలువకుండ పోను, కలియు కొట్లు?"

గర్వంగల ఆమె తనంత తాను నన్ను రమ్మనదు. స్వాభిమానం గల నేను పిలువనిదిపోను. ఇక మేమిద్దరం కలుసుకోడం ఎలా?

"కత్తి చేత లేక కదనమ్ము జరిపెడి
ఇంతి కెవ్వ డసువు లీయకుండు?"

ఆమె ప్రియునితో యుద్ధంచేస్తుంది. కత్తిమాత్రం లేదు. కేవలం చూపుల తోనో, హృదయంతోనో, వలపులతోనో యుద్ధం జరుపుతుంది. అలాటి దానికి ప్రాణాలు అర్పించకుండా ఎవ డుండగలడు? అనగా ఎవడైనా ఆమెకు ఓడి తన ప్రాణాలు సమర్పిస్తాడు. నిజంగా కత్తిపట్టుకుని యుద్ధానికి వస్తే మరో కత్తితో పోరాడి గెలువవచ్చు. కాని ఆమె కత్తిలేకుండా కదనం జరుపుతుంది!

"లోకమందు సుఖము శోకమ్ము కల వండు
శోకమనసె ఇచ్చె నాకు బ్రహ్మ."

లోకంలో సుఖాలు, దుఃఖాలు రెండూ ఉంటూ యంటారుగాని నాకు సుఖాలు ఎన్నడూ లభించలేదు. దుఃఖితమనస్సునే బ్రహ్మ నాకు ప్రసాదించినాడు.

"ప్రళయ ముండెగాని తలప నద్ది వియోగ
రాత్రికన్న దుర్భరమ్ము గాదు."

అంతా ప్రళయమంటే చాలా దుర్భరమైన దనుకుంటారు. అది నిజమే. ప్రళయం దుర్భరమే. కాని వియోగరాత్రికన్న దుర్భరంమాత్రం కాదు. అనగా వియోగరాత్రి ప్రళయంకన్న దుర్భరము అని.

"పరుల తీపి మాటలకు లోబడెను తాను,
నోరులేని న న్నాయమ చేరనీదు."

తియ్యతియ్యని మాటలు చెప్పి దగా చేసేవాళ్లకు లోబడిందిగాని, నిజంగా ప్రేమించిననావంటి నోరులేనివాణ్ణి దగ్గరకు చేరనీయదు.

ఈ విధంగా ఉదాహరణలు చూపుతూపోతే ఎన్నైనా చూపవచ్చు. దీన్ని నేను స్వాదువేదన అంటాను. విరహాతరమైన గాలిబ్ మనస్సు వెలు

వరించిన మాటలు ఎంత వేదనాభరితములో అంత స్వాదువులు. ప్రియురాలి పరిష్వంగంవలన కలిగిన ఆనందంకంటే ఆమె వియోగంవలన కలిగిన విషాదమే ఎక్కువ హృదయసంచాలకంగా వుంటుంది. కడు రమ్యమైన వేదన గాలిబ్ది. అతని శృంగారవర్ణన చవకబారుది కాదు. గంభీరమైనది. ఉదాత్తమైనది. ఆయనబాధ మన బాధగా గోచరించి మనను రసలోలుపులను చేస్తుంది.

ఉరుదూలోను, ఫారసీలోను తనకంటె పూర్వులు పోని ఈ మార్గాన్ని అనుసరించినాడు గాలిబ్. అతని వేదన పవిత్రమైనది.

గాలిబ్ గొప్ప మానవత్వవాది. అడుగడుగునా మానవత్వం అతని రచనలలో తొణికిసలాడుతుంది. మరువరాని శాశ్వతసత్యాలను అతను వక్కాణిస్తాడు. లోకపు దౌష్ట్యాన్ని తాను అనుభవించి దాని వలన కలిగిన అనుభూతిని ఎంతో చక్కగా అభివ్యక్తంచేస్తాడు.

"స్వీయలోపమ్ము లెరుగుట పెద్దవిద్ది,
లోప మెరిగినవాడె పూర్ణుడగు నరుడు."

వాస్తవాన్ని ఇంత చక్కగా చెప్పడం చాలా కష్టం. అన్నివిద్యలలోకీ పెద్దది తన లోపాలను తాను తెలిసికొనుట. లోపాలను తెలుసుకున్నవాడే పూర్ణుడట! లోపం లేనివాడు పూర్ణుడు అని సాధారణుడు చెబుతాడు. మహాకవి గాలిబ్ అలా చెప్పడు. అతనికి తెలుసు మానవు డెంతవాడైనా లోపం లేకుండా వుండడు. అయితే లోపం తెలిసికొనినవాడు గర్వించడు. జాగ్రత్తగా మెలగుతాడు. వాడే పూర్ణుడు.

"ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట యెంతో దుష్కరము సుమ్ము."

ప్రతిపనీ సులభంగా జరుగుతుం దనుకోవడం పొరపాటు. చిన్నచిన్న పనులు ఎంతో కష్టంమీద జరుగుతాయి. ఉదాహరణకు నరుడు నరుడవడమే ఉంది. అది చాలా చిన్నపని అనుకుంటాం. కాని అది అంత సులభసాధ్యమా? రెండు కాళ్ళు, రెండు చేతులు ఉన్నవాడల్లా నరుడేనా? దయామయుడు, గంభీరుడు, ఉత్తమగుణసమన్వితుడు, స్నేహశీలి, పరోపకారపరాయణుడు అయినవాడే నిజమైన నరుడు. ఈ గుణాలు ప్రతి నరునిలోనూ కానవస్తాయా? ఇవన్నీ కలవాడు కోటికొక్కడు. కనుక మానవుడు మానవుడు కావడం సులభసాధ్యమనుకోకండి. చాలా దుస్సాధ్యమైన విషయం అని బోధిస్తున్నాడు మహాకవి గాలిబ్ ఈ పద్యంలో.

"వెతలపోర్లోలు మందేది, మృతియెగాక ?
ఉదయమగుదాక దివ్వె వెల్గొందవలయు."

బహుజనావరణపొందిన పద్యాలలో ఇదొకటి. జీవితంలోని దుఃఖాలను పోగొట్టే మంచు మృతి వొక్కటే. అది వచ్చేదాకా అన్నిరకాల దుఃఖాలు సహిస్తూ కాలం వెళ్ళబుచ్చాలి. ఎలాగంటే — తెల్లవారేదాకా రాత్రి సాంతం దీపం వెలిగితీరవలసిందే. ఒకమాటు నిండుగా, ఒకమాటు తగి, ఒకమాటు కొడిగట్టి, ఒకమాటు రంగురంగులుగా వెలగాలి. జీవనయాత్ర మృతి వచ్చే దాకా సాగవలసిందేగదా!

"కానుపించుగాని గమ్యమ్ము చిక్కదు
నేను నడచినట్లు తాను నడచు."

ఎంత పరుగెత్తినా అందని గమ్యాన్నిగూర్చి ఇంత చక్కగా క్లుప్తంగా చెప్పినవాడు కానరాడు. దూరాన గమ్యం కనిపిస్తున్నది. దాన్ని చూస్తూ ఒకడు నడుస్తున్నాడు. అతను ఏవేగంలో నడుస్తున్నాడో సరీగా అదే వేగంలో గమ్యం ముందు సాగిపోతున్నది. అతను ఎన్నాళ్లు ఎంత వేగంగా పరుగెత్తి ఏంలాభం? గమ్యం అందే మాట అబద్ధం. కనపడుతూనే వుంటుందిగాని అందదు గమ్యం. అతను నడిచినట్లు అదీ నడుస్తూవుంటుంది.

"ఎంతో ఉత్సాహపడుచు కష్టింతు మూర!
మృతియె లేకున్న రుచి యేది బ్రతుకులోన?"

చస్తామనే భయం వుంటేనే బ్రతికిఉన్న ఈ నాలుగురోజులూ మన కోరికలను తీర్చుకోడానికి కష్టించి పనిచేస్తాం. వ్యవధి తక్కువగా ఉన్నప్పుడే ఆరాటం హెచ్చు. చావు లేదంటే మనిషికి తొందరే ఉండదు, కృషీ ఉండదు. కనుక మృతివల్లనే బ్రతుకురుచి.

"ఈజగత్తుస్వభావమ్ము నేమి యందు!
మంచిచేసినవానిని ముంచునీర!"

లోకస్వభావాన్ని ఎంతచక్కగా చెప్పినాడు! మంచిచేసినవాణ్ణే ముంచుతుంది ఈలోకం. అమాయకులు బాధపడతారు. ఉత్తములు నశిస్తారు. పాడులోకం ఇది. దీని స్వభావం విచిత్రమైనది.

"వేరులోనుండి కొమ్మలు వెలసినట్లు
అన్ని శబ్దాలు నిశ్శబ్దమందె పుట్టు."

శబ్దానికి విరుద్ధమైనది నిశ్శబ్దం. కాని నిశ్శబ్దంలోనుంచే శబ్దం పుట్టిందట! ఎడారిలా అంటే భూమిలో కానరాకుండా వుండే వేళ్లలోనుండి వృక్షం వెలువడినట్లు. ఎంత చక్కని ఉపమానం! మహాకవులైన కాళిదాసాదులు తప్ప అన్యులవలన ఈ ఉపమానప్రయోగం సాధ్యపడ దనుకుంటాను.

"మచ్చలను మృత్యువే కప్పిపుచ్చుకున్న
అంబరము లెన్ని యున్న దిగంబరుడనె."

తానుచేసిన పాపాలుగానీ, తప్పులుగానీ మచ్చలవలె ఏర్పడి వికారంగా వున్నాయి. వాటిని మృత్యువు కప్పిపుచ్చింది. అనగా చనిపోవుటవలన అవన్నీ కనరాకుండాపోయినవి. అంతేగాని బ్రతికియేవుంటే ఆ కళ్ళను, ఆ మచ్చలను, ఆ లోపాలను, పాపాలను దాచడానికి ఎన్ని అంబరాలు కట్టుకున్నా దాచలేడట. అవి బయటపడి లోకానికి కనిపిస్తాయట. అంబరాలు ఎన్ని కట్టుకున్నా దిగంబరుని దేహంలా మచ్చలతో బయటపడతాడట తాను!

"మల్లియ, గులాబి, చంపకవల్లి పూచె
రంగు వేరయ్యును వసంతు రాక చెప్పె."

మల్లె తెలుపు, గులాబి ఎరుపు, చంపకం పచ్చరంగు. ఇలా ఈ మూడూ వేరువేరు రంగులలో ఉండికూడా వసంతుడు వస్తున్నాడనే ఏకవార్తనే తెలుపుతాయి. అనగా వసంతం ప్రవేశించినప్పుడు అన్నిరంగుల పూలూ పూస్తాయి. ఏ మతం వాడైనా భగవంతుని సాక్షాత్కారమార్గమే తెలుపుతాడు.

"అన్నిరోగములకు నౌషధం బుండియు
ప్రణయరోగమునకు కనము మందు."

ప్రణయరోగానికి మందు లేదని అందరికీ తెలుసు నేమో గాని "లేదు" అని ఈరీతిని ఇంత చక్కగా చెప్పడం ఇతరుల తరంకాదు.

"పిల్లలకు 'మతాబ'లు కాల్చుపిల్ల ఆట,
అల్లె ప్రేమించుటయు నాట యగును మొదట,
తుదిని భీషణపరిణామ మొదవుగాదె!
ఈ ప్రమాదపుటాట సృష్టించె నెవడో?"

దీపావళీసందర్భంగా పిల్లలు మతాబాలు కాలుస్తారు. అది వాళ్లకు ఆటగా వుంటుంది. కాని పొరపాటున గుడ్డలకుగాని అంటుకుంటే బహుప్రమాదం. అలాగే ప్రేమించడం అంటే ఆటగావుంటుంది మొదట. కాని తీరా

హృదయం ఒకదాని పరమై పోయి, అది లభించక, దానికై ఏడ్చి బాధపడి కృశించినప్పుడు తెలుస్తుంది ప్రణయం ఎంత ప్రళయకారియో !

"భిక్షుకునివంటి వేషము వేసి నేను
దాతలగువారి చేతలు చూతునోయి."

లోకంలో చాలామంది దాతలనిపించుకోవడానికి ప్రయత్నిస్తారు. నిజమైన దాత లెందరో, కుహనాదాత లెందరో, వాళ్ళు ఏ యే విధంగా ప్రవర్తిస్తారో తెలుసుకోడానికి భిక్షుకవృత్తి నవలంబించాడట. ఒంటరిగా నిర్జనప్రదేశంలో బిచ్చగాడు కనబడితే దమ్మిడీ ఇవ్వని వారు, నలుగురు చూస్తుండగా ఒక అణా పడేసి తన కరుణాగుణాన్ని వ్యక్తపరచుకోవడానికి ప్రయత్నించేవారు, పేరు ప్రతిష్ఠలకై పెద్దపనులు చేయాలనుకునేవారు చాలామంది ఉంటారు. ఎట్టి స్వార్థం లేక కేవల దయాబుద్ధితో ఇతరులకు సహాయం చేసేవారు కడు తక్కువ.

"బ్రతుకుపై నింత విశ్వాసపడెద రేల ?
ఏడి మాంధాత ? పురుకుత్సు డేడి నేడు ?"

చక్రవర్తులే పోయినారు, మన మెంత, మన బ్రతుకు లెంత ? ఈ బ్రతుకుమీద విశ్వాసం పెట్టుకోకు అంటున్నాడు.

"మూగవడు నెప్డో తనువల్లకీగళమ్మ్న,
కాన దుఃఖాశ్రుగీతమే యైన ప్రియము."

ఈ శరీర మను వీణ ఏక్షణానో మూగవడిపోతుంది. అనగా ఈ శరీరం నశిస్తుంది. కాగా ఈ బ్రతికిన నాలుగుక్షణాలూ ఈ శరీరవీణ ఆనందగీతాలు ఆలాపించే భాగ్యాన్ని పొందకుంటే, దుఃఖగీతాలైనా ఇష్టమే. ఎందుకంటే అసలు పలుకక నశించడంకంటే ఏదో గీతం పాడడం మంచిది కదా!

"బానిసనై యయ్యు స్వాతంత్ర్యపరుడ నేను,
తిరిగివత్తు కాశిని తల్పు తెరువకున్న."

కాశికి వెళ్ళినప్పుడు కూడా గౌరవంగా తలుపు తెరచి ఆహ్వానించితే తప్ప, అట్లా కాకుంటే తిరిగివస్తాడట. అంత స్వాతంత్ర్యపరుడు. ప్రియురాలికొరకు వలపుబూని, ఆమెకు బానిస అయిపోయినా ఆమె తనను తగురీతిగా గౌరవించి ఆహ్వానించకుంటే తిరిగి వస్తాడట!

"పడవ నెక్కింపవచ్చెడివా రెరుగరు
పడవలో మధ్య కలిగిన బాధ లెల్ల."

పడవ నెక్కించి వెళ్ళిపోతారు మిత్రులు, బంధువులు. తీరా ఈ ప్రయాణికుడు నడిసముద్రంలోకి పడవలో వెళ్ళాక అక్కడ కలిగిన బాధలు ఈ వీడ్కోలు చెప్పిపోయినవాళ్ళ కేం తెలుస్తుంది ? ఇది ఏ ఘటనకైనా అన్వయించుకోవచ్చు.

"'నేడు' వెనువెంట 'రేపు' తారాడినట్లు
క్రియకు ప్రతిక్రియ వెంటనే బయలువెడలు."

"ఇవాళ" కూ "రేపుకూ" పరస్పరసంబంధం వుంది. కొన్ని గంటల్లో "ఇవాళ" "రేపై" పోతుంది. ఆలాగే క్రియ వెంట ప్రతిక్రియ ఉండనే వుంటుంది.

"ప్రతియొకం డేదియో కోరువాడె, కాన
వేటగాని నిందించుట వెట్టి గాదె!"

మంచో చెడో ప్రతివాడికీ ఏదో ఒక కోర్కె వుంటుంది. వేటగానికి వలపన్ని ఏపక్షినో ప్రాణినో బంధించాలని, బాధించాలని వుంటుంది. అది వాడి కోరిక. అది తీర్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. వాడు చెడ్డవాడని నిందించడం దేనికి ? ప్రియురాలు తనను హింసపెడుతుంది. అది ఆమె ఇచ్ఛ. నిందించి లాభమేమి ?

"కాంక్షలన్నియు మృగతృష్ణికాతరంగ
ములగుగావున యేల నిష్ఫలత కేడ్తు ?"

అసలు కోరికలే ఎండమావులైనప్పుడు అవి ఫలించలేదని ఏడ్వడం దేనికి? ఎండమావు లందుతాయా ?

"వెతల మైదానమున వేరు గతియె లేదు,
బాష్ప వారిధారాసిక్త పథముగాక !"

దుఃఖాలనే మైదానంలో అడుగుపెట్టినతరువాత కన్నీళ్ళతో తడిసిన దారితప్ప మరోదారి ఎక్కడ లభిస్తుంది ?

"ప్రణయరంగాన సఫలత బడయు టెట్లు?
ఖైదులో గూడు కట్టెడి ఖగము నేను."

పక్షి పంజరంలో గూడు కట్టుకుంటే అది దానికి ఎంత స్వేచ్ఛ నిస్తుందో ప్రణయంలో పడి సాఫల్యాన్ని వెదకడం అంతే.

"మృతి నెరుంగని ఒంటిదేవతలకన్న
నలుగురికి మేలుచేసెడి నరుడె మిన్న."

దేవతలకు మృతి లేదు. వారు చేసేదీ, చేయవలసిందీ ఏమీ లేదు. తమను తాము చూచుకొని ఒంటిగా కాలం గడుపుతారు. మానవులు నలుగురి మేలును గోరి చనిపోయి పరోపకారు లౌతారు. కనుక నరులే నయం.

"చేసినట్టి పాపములకు శిక్ష యున్న
పాపములు చేయనందుకు వలయు రక్ష."

పాపాలు చేసే శిక్షిస్తారుగాని చేయని పాపాలకు ఏమైనా మెచ్చిరక్ష ఇస్తారా? ఇవ్వరు. శిక్షించేవాళ్లు రక్షించాలికూడా.

"'అస్తి' యని దగా చెందకు మయ్యా! నీవు,
వసుధపై నెంచిచూడ సర్వమ్ము 'నాస్తి'."

లోకంలో ఏదో వుందని దగాపడి దానికోసం తారట్లాడకు. లోకంలో అంతా 'నాస్తి'. ఎక్కడా ఏమీ లేదు. అంతా మాయామయం.

మహితకస్తూరికాపరిమళము జిమ్ము
సరస మధుధారకై గదా స్వర్గవాంఛ!"

స్వర్గాన్ని కోరి జపతపాలు చేసే వీరంతా పొందే దేమిటి? కస్తూరీపరిమళంతో ఘుమ ఘుమలాడే మధువునే గదా! ఆ వాంఛయే వీరిచేత ఈ జపతపాలు చేయిస్తున్నది. "స్వర్గంలో ఏమీ లేదు, అసలు స్వర్గమే లేదు" అనండి, నూటికి తొంబై తొమ్మండుగురు భక్తులు జపతపాలు మానుకుంటారు అంటాడు గాలిబ్. అందుకే ఒకచోట అన్నాడు—"ఈ స్వర్గాన్ని ఎవరైనా నరకంలో పారేస్తే బాగుండును. స్వర్గంమీది కాంక్షతో భగవత్ భజనలు చేసే చాలా మంది మానుకుంటారు" అని.

"స్వర్గమునుగూర్చి నాకు సర్వమ్ము తెలియు
మనసు సంతసపడుటకు మంచి ఊహ."

అసలు స్వర్గం లేనేలేదు. ఏదో మనస్సుకు సంతోషం కలగడానికి ఇదో కల్పన, అంటున్నాడు.

"అందకత్తెల సాహచర్యమ్మునందు
కొద్దినాళ్లులు గడపినగూడ చాలు,

ఘోరనిస్సార సంసార కుండమందు
శతయుగమ్ములు జీవించ జాలుకంకె.''

అందకత్తెల సాహచర్యం నాలుగునాళ్ళైనా చాలునట! కుటుంబ జంబాలంలో ఎన్నేండ్లు పడియుండి ఏం లాభం?

''సింధువును జేరి బిందువు సింధువగును.
ధ్యేయమునుబట్టి ప్రతిపని దివ్యమగును.''

నీటిచుక్క నదిలో కలిస్తే నది అవుతుంది, కుళ్ళు నీటి గుంటలోపడి కుళ్ళు నిరౌతుంది, బావిలో కలసి బావి అవుతుంది. అదే సముద్రంలో కలిస్తే చిన్న బిందువైనా సింధువౌతుంది. అలాగే ఉత్తమమైన ధ్యేయాన్ని కోరిచేసే పని ఉత్తమంగా పరిగణింపబడుతుంది. అధమధ్యేయమైతే అధమం అనిపించుకుంటుంది. ధ్యేయమే పనియొక్క ఔచిత్యాన్ని నిర్ణయిస్తుండి. వాస్తవం.

''చక్రవర్తిచేతి స్వర్ణపాత్రికకన్న
నాదు మట్టిచిప్ప నయము లెమ్ము.''

దుఃఖాన్ని కలిగించే ఏవస్తువైనా, అది ఎంత విలువైనదైనా లాభంలేదు. దుఃఖాన్ని కలిగించనిది ఎంత సామాన్యమైనదైనా ఉపాదేయమే. చక్రవర్తి చేతిలోని స్వర్ణకలశం నానా దుఃఖాలకూ మూలం. దాన్ని దొంగిలించడానికి అనేకులు ప్రయత్నిస్తారు. దాన్ని భద్రపరచడం ప్రతిరోజూ ఒక సమస్య. దానికోసం ప్రతిక్షణం ఆరాటం. మట్టిచిప్ప అయితే దాన్ని వాంఛించే వాడుండడు. పోతే ఇంకోటి సులభంగా దొరుకుతుంది. ఇలాటి భావం కలదే మరో పద్యం వుంది గాలిబ్ది. అది ఇది:—

''పగిలెనేని తెమ్ము పాత్రయెం, డిదె మేలు
మణికలశము కన్న మట్టిచిప్ప.''

ఒకటి పగిలిపోతే ఇంకో మట్టిచిప్ప చప్పన తెచ్చుకోవచ్చు. మణికలశం వెంట అనేక బాధలు.

''కామకుండుగూడ ప్రేమమ్ము నటియించె,
ప్రేమజీవి కింక విలువలేదు.''

నటించేవాణ్ణే లోకం నమ్ముతుంది. నిజమైన ప్రేమ కలవాణ్ణి తిరస్కరిస్తుంది. కృత్రిమత్వమే ఎక్కువ ఆకర్షకంగా వుంటుంది.

"మనిషి ఏకాకియైనను మనసులోన
గుంపులుగ భావములు చేరి గోష్ఠి జరుపు."

మనిషి ఒంటరి అయినా వాని మనసులో అనేక భావాలు. పరిపరి విధాల ఆలోచనలు. అవి అన్నీ చేరి అనుక్షణం గోష్ఠి జరుపుతుంటాయి.

"వెతల నోర్తు మేని వెత లంతమందును,
సులభమగు నలభ్యములును దాన."

కష్టాలు సహించగలిగితే అవి వాటంతటఅవే పోతాయి. అలభ్యములు కూడా సులభంగా దొరుకుతాయి. సహించడం ఒకటే కష్టాలను గెలిచే మార్గం. సహనంవల్ల అసాధ్యములు సుసాధ్యము లవుతాయి.

"వలపు లేనాటికేని నిష్ఫలము కావు,
కాయ కాయని వృక్షమ్ము కాదు వలపు."

ప్రస్తుతం నిష్ఫలంగా తోచినా ఏనాటికైనా వలపులు ఫలిస్తాయి. కాతరు కాయని వట్టి ఛాయాతరువులవంటిది కాదు వలపు.

"బిందు వణగారి సింధువై వెలసినట్లు
రుజయు పెంపొంది జౌషధరూప మందు."

ఒక్క నీటిచుక్క కరిగిపోయి సముద్రమంత అవుతుంది. అలాగే జబ్బు పెచ్చి తానే జౌషధం అవుతుంది. జబ్బుకు జబ్బే మందు కావడం అనగా మృతికలగడం.

ఎంత వేదన వెళ్ళబోసినా గాలిబ్ కొన్నికొన్ని తావుల మనను నవ్విస్తాడు. నర్మహాస్యం ప్రయోగించిన పట్టులను పరిశీలింతాం.

"గుండె దొంగిలించుకొనిపోయె హాయిగా
ముద్దొసంగ వెనుకముందు లాడు!"

ఎట్టి జంకూ గొంకూ లేకుండా నాహృదయాన్ని దొంగిలించుకుని వెళ్లిపోయింది గాని ముద్దొసగుటకు వెనుకముందులాడుతుందేం!

"నేను మరణింప నాయింటిలోన మిగిలె
ప్రేయసుల చిత్తరువులును, లేఖ లంతే."

ఇతను చనిపోగా ఇంటిలో మిగిలిన సంపద ఏమిటయ్యా అంటే — ప్రియురాండ్ర ఫోటోలు, వాళ్ళు తనకు వ్రాసిన ప్రణయలేఖలు, అంతే.

"డాగె పరదాల పగలు తారాగణమ్ము
రాత్రి కేమయ్యెనో దిగంబరమ్ము లయ్యె."

నక్షత్రాలు ఆకాశంలో పగలు కనపడవు. రాత్రి కనపడతాయి. ఈ విషయాన్ని గాలిబ్ తమాషాగా చెప్పినాడు. గోషాస్త్రీలు పరదాలో ఉంటారు. నక్షత్రాలుకూడా గోషాస్త్రీలవలె పగటిపూట పరదాలలో దాక్కుని కనపడవు. రాత్రికాగానే ఏమనిపించిదో ఏమో నగ్నంగా ప్రత్యక్షమైనై. పగలు అలా కనరానంతగా పరదాలలో దాకోక్కవడం ఏమిటి? ఇప్పుడు రాత్రిపూట నిర్భయంగా నగ్నంగా సాక్షాత్కరించడంఏమిటి?

"నీకు నేను గిట్టనియెడ, సాకి! నాకు
చషక మీకుము, దోసిట చాలు మధువు."

మధువు నందించు వారిని 'సాకి' అంటారు ఫార్సీలో. నీకు నేనంటే ద్వేషమో, కోపమో, అప్రియమో అయితే గౌరవంగా గిన్నెలో పోసి మధువు అంది వ్యవహారమే. దోసిలిపడతాను, మధువు పోయి; అంతేచాలు. నాకు ఎట్టి అగౌరవం లేదు. కావాలిసింది మధువు. అది దోసిలితో గ్రాగినా చషకంతో గ్రాగినా ఒకటె! పైగా నాకు చషకంలో వద్దు, దోసిట పోయుము అనడంలో ఎక్కువ పుచ్చుకోవాలనే ఎత్తుకూడ గోచరిస్తుంది!

"నా కొఱకు నీవు వత్తు వన్నయది నిజము,
జాగుసేయ వటన్నది సత్యమగును,
అసలు నావార్త నీ కందునంతలోన
మట్టిలో నేను కలసెడి మాట నిజము."

నేను చాలా ప్రమాదస్థితిలో ఉన్నానని నీకు తెలిస్తే తప్పక నావద్దకు వస్తావు. అది నిజం. ఏమాత్రం ఆలస్యం చేయవు. అదీ నిజమే. కాని అసలు అంతఃపురాలలో ఉన్న నీకు నావార్త అందేలోగానే నేను చచ్చి మన్నైపోతాను.

"గాలిబా! నీదు తాత్త్వికకలన, యహహా!
తాగకుండిన నిను మేము యోగియనమె!"

జనులు అంటారట — "గాలిబ్ ! నీవు ఎంతో చక్కగా తత్వబోధ చేస్తావు. ఎంతో వేదాంతపారంగుడవు. ఆహా! కాని ఒక్క తాగుడు అలవాటు లేకుంటే

నిన్ను యోగిపుంగవుడని పిలచేవాళ్ళంకదా'' అని. త్రాగడం లేకుండా, వేదాంతాలు వల్లెవేసేవాడల్లా యోగి అని లోకం గ్రుడ్డి అభిప్రాయం. చాలా పవిత్రులుగా కనబడి బహుదుర్మార్గాలు చేసేవాళ్ళు, దుష్టచింత కలవాళ్లు ఎందరో ఈ లోకంలో వున్నారు. వాళ్ళకన్న తాగ్రిగి ఎట్టి అపకారం చేయని మంచివారు యోగులు కారా ? అనుతారు. కాని, లోకం అంగీకరించదు. లోకానికి నటనే కావలసింది. అసలు హృదయపరిశీలన అక్కరలేదు.

''నాకమందు నరకలోకమ్మ్ము కలుపు కో
వలవదేలనోయి? భక్తపాల !
వాంఛ కలిగినపుడు వాహ్యాళి సేయగా
మరియు కొంత చోటు పెరుగునుగాదె?''

నరకాన్ని స్వర్గంలో కలిపివేయవేలనయ్యా ! దేవుడా ! దానివల్ల కాస్తచోటు పెరిగి వైశాల్యం ఏర్పడి వాహ్యాళికి వీలవుతుందికదా ! అంటాడు కవి. స్వర్గనరకాలు రెండూ ఒకటే. విడివిడిగా ఉంచడం భావ్యం కాదు. పాపులు, పుణ్యులు అంతాకూడా దేవుని అనుగ్రహపాత్రులే. నరకం అంటరానిది కాదు. స్వర్గనరకాలు కలగలసి ఉండడమే మేలు అంటున్నాడు.

''ఎవరి అధరచక్రిమును భావించినానొ
రేయి మదినెల్ల చుంబనశ్రేణి వెలసె.''

ఏ సుందరి పెదవులను భావించినానోగాని రాత్రి మనసులో ముద్దులు గుంపులు గుంపులుగా కురిసినవట !

''ఆమె తోటకు వాహ్యాళి కరిగె నంట,
ఇంక తోటలో పూలు వాంఛించు నెవడు?''

అందకత్తెయైన ఆమె తోటకు వాహ్యాళికి వెళితే అంతా ఆమెనే కోరుతారు గాని పూల నెవరు కోరుతారు? పూలకంటే అందమైనది, సుకుమారి ఆమె.

''అందకత్తెలతో మాటలాడుకొఱకు
చిత్రలేఖనవిద్య నేర్చితిని నేను.''

కళపై గల మక్కువతో చిత్రలేఖనం నేర్వలేదు. చిత్రాలు గీయించుకోడానికి వచ్చే అందగత్తెలతో తనివితీరా మాట్లాడే కోరికతోనే చిత్రలేఖనవిద్యను అభ్యసించినాడట !

"పరుగులెత్తి యెత్తి పట్టుబడితి నేను
బందిపోటుదొంగ పదము లొత్త."

దారిని పర్యాణం చేస్తున్నాడు. అడవిప్రాంతం. దొంగ వెంటపడ్డాడు. దొరక కుండా తప్పించుకోడానికి చాలా పరిగెత్తాడు. తుదకు అలసట వచ్చింది. ఇంకా పరుగెత్తలేక పట్టుబడ్డాడు. ఇంతసేపూ పరిగెత్తినందుకు ఇద్దరికీ కాళ్ళు నొస్సున్నై. కాని దొంగకు తాను లొంగినాడుగనుక దొంగకాళ్ళు తాను ఒత్త వలసివచ్చింది.

"హరిని ప్రార్థింప తల వంచినట్లు గానె
బాగప్రాగి ప్రొక్కుము మధుభాండమునకు."

దేవుడికి మొక్కినట్లే మధుభాండానికికూడా ప్రొక్కుమంటాడు. సకలా భీష్టాలనిచ్చే దేవుడివలెనే సకల కష్టములను పోఁగోల్చు మధుభాండమునకు మోకరిల్లమని భావము.

"పగలు దోయగాబడ, రాత్రి పట్టె నిద్ర,
నన్ను దోచిన దొంగకు నతులొనర్తు."

జేబులో డబ్బుంది. దాన్ని కాపాడుకోవడంలో రాత్రీ పగలూ సతమతమవు తున్నాడు. నిద్రలేక ఎన్నాళ్ళో అయింది. ఒకనాటి పట్టపగటిపూట దొంగ ఆ డబ్బును కాజేశాడు. పోయింది పోనేపోయింది. ఇక పోయేదేమీలేదని హాయిగా నిద్రపోయాడు. చిరకాలంగా లేని నిండునిద్రను ప్రసాదించిన దోపిడీదొంగకు నమస్కారాలు చేస్తున్నాడు.

"ఆమె ముద్దిచ్చుటకు వెనుకాడదేమొ!
కాని ఇమ్మని అడుగగా లేను నేను."

అడిగితే బహుశః ఆమె మధురచుంబనం ప్రసాదించవచ్చు. కాని అడిగే దమ్ములు లేవు. అడుగనిది ప్రసాదించ దామె. కనుక పెద్దచిక్కులో పడ్డాడు.

"అప్సరసను బోని ఆమెనే వర్ణింప
శత్రువయ్యె నాదు మిత్రవరుడు."

అసలే ఆమె అప్సరసవలె కడు అందకత్తె. ఇక ఆమెయొక్క సౌందర్యాన్ని ఎంతో చక్కగా వర్ణించినవాణ్ణి నేను. కాగా ఆమెసౌందర్యాన్నిగురించి నా నోట విని మోహితుడైనాడు నా మిత్రుడు. ఆమె నా ప్రియురాలుగనుక తనకు లభించడంలో నేను ఆటంకమని భావించి నాకు శత్రువై కూర్చున్నాడు.

ఆమెయొక్క అతిలోకసౌందర్యం, అందులోనూ నేను వర్ణించడం నా మిత్రుణ్ణే నాకు శత్రువునిగా మార్చింది.

"కయిని శక్తి లేదు, కన్నుల బల మున్న
దింక పానపాత్ర నెదుట నిడుము."

అతిగా త్రాగినాడు. పానపాత్రను చేతితో ఎత్తిపుచ్చుకునే శక్తిలేదు. అయినా ఇంకా పానపాత్రవైపు చూచే శక్తి కాస్తవున్నది. కనుక అప్పుడే పాన పాత్రను తీసుకుపోకు. నా కళ్లము ందుండనీ. త్రాగకున్నా, చూచి ఆనందిస్తుం టాను అంటాడు.

"పానశాల యేడ? భక్తుని ఇల్లేడ?
నేను వెడలుచుండ తాను జొచ్చె."

పానశాలకూ భగవద్భక్తుని ఇంటికీ బహుదూరం. కాని వాడు దొంగచాటుగా పానశాలకు వస్తూంటాడు. ఒకనాడు నేను పానశాలలోనుంచి బయటికి వెళ్ళు తున్నాను. అతను లోపలికి చొచ్చుతున్నాడు! ఇదీ కుహనాభక్తుల పని.

"ఇతరులు త్వదీయచషకమ్ము నెంగిలింప
పెదవులార నీవార్తకై ఎదురుచూతు."

ప్రియురాలా! నీవు అందిచ్చే మదిరాచషకాన్ని అన్యులు ఎంగిలించుతూ వుండగా నీవు నన్ను రమ్మంటావనే వార్తకోసం నేను పెదవులారిపోగా ఎదురు చూస్తున్నాను.

"స్వర్గమున తేనెధారల బడయగోరి
వసుధపై మద్యపానము వదలె దేల?
ఈగ లెన్నెన్ని యో ఎంగిలించినట్టి
తేనెగా దిది స్వచ్ఛమాధ్వీక మోయి!"

భూలోకంలో మద్యపానంవంటి పాపకార్యాలు చేయకుండా పవిత్రులుగా ఉన్న దైవభక్తులకు స్వర్గంలో తేనెధారలు లభిస్తాయని ఒక మతవాదం. గాలిబ్ అంటాడు— "స్వర్గంలో తేనె సాధించడంకోసం ఈ లోకంలోని మధువు వదలుకుంటావేమయ్యా! స్వర్గంలో తేనె ఈగల ఎంగిలివలన తయా రైనది. భూలోకంలో లభించే మదిర స్వచ్ఛమైన ఇప్పపూలలోనుండి వెడలి నది. కాన ఆ ఈగల ఎంగిలికన్న ఇది మంచిది. దీన్నే అనుభవించు"—అని.

"ఎంతో కోమలాంగి ఇంతి, చేజిక్కెను,
చేత తాకినంత చిమిడిపోవు."

చిరకాలం వేచిన కోమలాంగి చేతచిక్కింది ఇన్నాళ్లకు. కాని చేతితో తాకితే చిమిడిపోయేంత కోమలి. ఏం చేయను?

"గిన్నె నందించువారు లేకున్నయపుడు
కుండనే నోటి కానించుకొనుట మేలు."

గిన్నెలో మధువుపోసి అందించే అందకత్తె ఉన్నప్పుడు ఆమె ఎంతకొద్దిగా ఇచ్చినా ఆమెవలపువలన మైకం హెచ్చుతుంది. ఇప్పుడు గిన్నె అందించేవారు లేరు గనుక కుండను మొత్తానికిమొత్తం ఎత్తుకుని నోట కరచుకుని పుచ్చుకుంటే గాని చాలదు.

గాలిబ్ గొప్ప ఆశావాది. ఎంత వేదన ఉన్నా నిరాశపడి క్రుంగిపోడు. తనకష్టాలపైన నమ్మకము కలవాడు.

"కాలమే నాకు తగునవకాశ మిడిన
చేసిచూపుదు నెన్నెన్నో చిత్రములను,
మనసులో గల ఒకొక్కక్క మచ్చ నాది
బీజమగు దివ్యదీపికావృక్షమునకు."

తన హృదయంలోని మచ్చ దీపాలచెట్టుకు బీజంగా తోడ్పడుతుందట. "దీపాల చెట్టు" అన్న కల్పన తెలుగువారికి కొత్త. తన మనసులో పడిన గాయం మాని ఏర్పడిన మచ్చ కాంతివృక్షాలను లోకాన వెలయించే బీజం కాగలదని అంటున్నాడు కవి.

"ఈ యెడారిముండ్ల కెడద ముక్కలుచెక్కి
పూలవోలె నిలుపజాలినాడ."

ఎడారిలో అన్నీ ముండ్ల దుబ్బులుంటాయి. పూలుండవు. అయితే ఎడారిని పూలతో శోభించేట్లు చేయాలని సంకల్పం కవిది. దానికిగాను తన రక్తిలమైన హృదయాన్ని ముక్కముక్కలుగా కోసి ఆ ఎడారి ముండ్లకు వాటిని చెక్కి గులాబీపూలు మొలిచినవా అన్న భ్రాంతిని కలుగచేస్తానంటాడు. ఎడారులను తోటలుగా మార్చడానికి గుండెను కోసి ఇస్తాడట!

"దుఃఖములు ధీరులకు నొక్క త్రుటినితగ్గు,
వైద్యుతాగ్నితో శోకదీపంబు వెలుగు."

దుఃఖం ఉన్నమాట నిజమే. కాని ఆ దుఃఖంతో చిరకాలం క్రుంగను. త్రుటిలో దాన్ని తొలగద్రోస్తాను. మేఘాల్లోని మెరుపుతో శోకదీపాన్ని వెలిగిస్తాను. అనగా శోకంలో కూడా ధైర్యంగా ఉంటాను అని.

"లాగి విడిచిన బాణంబులాగు నడచు
పడతియెదలోన స్థాన మేర్పరచుకొనుము."

మందకొడిగా వుండేది కాకుండా, లాగివిడిచిన బాణంలా చురుగ్గావెళ్లే పడతి హృదయంలో స్థానం ఏర్పరచుకో. ఎన్ని బాధలు వచ్చినాసరే నిరాశవలదు.

"హింస భరియించు శక్తి నార్జించె మనసు
ఇంక నాక్రూరురాలి వరింతు నేను."

ఆమె ఎంతహింసపెట్టినా ఇక నిరాశపడను. భరించే శక్తి మనసుకు కలిగింది. కనుక భయపడి వెనక్కిపోక ఆ క్రూరురాలిని వరించి సాధించి తీరుతాను.

"గుండియ వియోగవహ్నిలో మండిపోయె,
కాని సంయోగవాంఛను మానలేదు."

వియోగాగ్నిలో గుండె మండిపోయినా నిరాశపడక సంయోగ వాంఛను కలిగి యున్నాను. కార్యదీక్షాపరులు వైఫల్యాలకు జడిసి వెనుతీయరు.

"జ్వాలయే దీపమునకు సర్వస్వమట్లు
ప్రణయమే జీవితంపు సర్వస్వమయ్యె.

* * * *

నన్ను కవ్వించబోకు, నా కన్నులందు
అశ్రుఝంఝూమరుత్ సమూహములు కలవు.

* * * *

మధువు గ్రోలి రాగిల్లిన వధువుమోము
చూడగోరె నా వెచ్చని చూపు లిపుడు.

* * * *

దేవి! నా తోటి బంధమ్ము ప్రేమించబోకు.
ప్రేమ లేకున్న, ఉండనీ ద్వేషమేని.

* * * *

మాటిమాటికి గిన్నెల మధువు బోసి
మధువునే బాధ పెట్టెడి విధ మదేల ?
దేవి ! మధుపూర్ణ భాండమే తెచ్చి నాదు
నోటి కందీయరాదె ! సంతోషపడెద.

* * * *

అస్మదశ్రుల గలవు గాయాల పూలు,
వధ్యశిల కేగెదను హాసవదనమునను.''

గాయాలను పూలుగాభావించి వధ్యశిలకు నవ్వు ముఖంతో వెళ్ళగలిగిన ధైర్యశాలితాన్ని కవితలో ప్రదర్శించినాడు గాలిబ్. ఆతడు చాలానవ్యుడు. ఎన్నడు ప్రాచీన సిద్ధాంతాలకు కట్టుబడిఉండలేదు.

గాలిబ్ రచనల్లోని మరోవిశేషం —ప్రతిపాఠకునికీ తన హృదయం గాలిబ్ రచనల్లో కనపడడం. మానవస్వభావంలోని వివిధరహస్యాలూ వీటిలో ద్యోతకమౌతాయి. గాలిబ్ వేదన ఆరోగ్యవంతుడైనవాని వేదన. వేదనా భరిత మైన ఆయనగేయాలలోని శబ్దాలు సాధారణార్థాన్ని దాటి విస్తృతార్థాన్నిస్తాయి. భావుకులైనవారికి బహుళారద్యోతకములైన గాలిబ్ పద్యాలు మఱింత హృద్యంగావుంటాయి. సమర్థుడైన కవి వాడిన శబ్దం సాధారణార్థాన్ని మించిన అర్థాన్ని ఇస్తుంది. కరెన్సీనోటు సాధారణమైన కాగితంతో చేయ బడినదే. అయినా వట్టికాగితం కంటే ఎన్నో రెట్లు ఎక్కువవిలువ కలిగివుంటుంది. అలాగే గాలిబ్ వాడిన పదాలు గంభీరార్థాలను ఇస్తాయి. అసలు శబ్దాలకు అందని అత్యున్నతభావాలను గాలిబ్ వ్యక్తపరచినప్పుడు వాటిని హృదయంతో ఆస్వాదించవలసిందేగాని నిఘంటువుల సహాయంతో రుచిచూడలేం.

నిఘంటువులకు, నియమనిబంధనలకు అతీతమైన గాలిబ్ అమృతకవిత లోని అనన్యసామాన్యమైన వైభవం ఆయనజీవితంలోకూడా కనిపిస్తుంది.

గాలిబ్ జీవితగాథ

గాలిబ్ పూర్తిపేరు మిర్జాఅసదుల్లాఖాన్ 'గాలిబ్'. 1797-వ సంవత్సరం డిసెంబరు 27-వ తేదీన 'ఆగ్రాలో' జన్మించినాడు. అతను టర్కీకి చెందిన ఐబక్ వంశస్థుడు. వాళ్ళల్లో తండ్రి ఆస్తి కూతురికి లభిస్తుండిగాని కొడుక్కి కాదు. కొడుక్కి తండ్రిఖడ్గంమాత్రమే వారసత్వంగా వస్తుంది. గాలిబ్‌ది మహావీరుల వంశం. గాలిబ్ తాత 'సమర్‌ఖండ్' నుండి షాఆలం రాజుకాలంలో భారతదేశం వచ్చాడు. ఆయన మాతృభాష టర్కిష్‌భాష. భారతదేశంరాగానే ఆయనకు ఒక జాగీరువంటిది దొరికింది. నెలజీతంకూడా ఏర్పాటుచేయించాడు రాజు. గాలిబ్ తండ్రిపేరు అబ్దుల్లాబేక్‌ఖాన్. గాలిబ్ తమ్మునిపేరు యూసుఫ్‌ఖాన్. మహానుభావులైన వారికి బాల్యంనుంచీ కష్టాలే వెన్నాడుతాయి.

గాలిబ్‌తండ్రి హైదరాబాదు సైన్యంలో కొంతకాలం పనిచేశాడు. ఆ తరువాత అన్వర్ సంస్థానసైన్యంలో చేరీచేరకుండానే శత్రువులచేత చంపబడినాడు. అప్పటికి గాలిబ్ వయస్సు అయిదేళ్ళు. తరువాత తొమ్మిదోయేట చిన్నాయనకూడా చనిపోయాడు. తండ్రీ, చిన్నాయనా చనిపోయినతరువాత గాలిబ్‌కు ప్రభుత్వంవారు సంవత్సరానికి ఏడువందల రూపాయలు సహాయంగా ఇచ్చేవారు. 1857 ఏప్రిల్ 30-వ తేదీదాకా ఈ డబ్బు దొరికింది. తరువాత ప్రథమస్వాతంత్ర్య సంగ్రామం (ఇంగ్లీషువారు దీన్ని 'సిపాయి పితూరీ' అన్నారు) సందర్భంగా ఈ సహాయం ఆగిపోయింది. మూడుసంవత్సరాలు చాలా కష్టపడ్డాడు గాలిబ్. దారిద్ర్యం దుర్భరమైంది. అప్పటి ఆయన దుర్భరస్థితి మీర్ మెహదీకిరాసిన లేఖలోని కొన్నిపంక్తులవల్ల తెలుస్తుంది. మహమ్మదీయులు "రమ్జాన్" నెలలో రోజూ పగలు ఉపవసిస్తారు. గాలిబ్ రాస్తాడు— "రమ్జాన్ నెలలో ఉపవాసాలు భోంచేస్తున్నాను. తినడానికి మరేదీ దొరక్కుంటే దుఃఖం వుండికదా అనుభవించడానికి" అని.

ఆగ్రాలో ఉండగా అబ్దుస్సమద్ అనే ఫార్సీవ్యక్తితో స్నేహం ఏర్పడింది. ఆయన గాలిబ్ ఇంట్లో మూడునాలుగేళ్ళు ఉన్నాడు. అతనివద్ద కొంత ఫార్సీ నేర్చుకున్నాడు. అయితే ఫార్సీలో గాలిబ్‌కు కలిగిన పాండిత్యం అంతా స్వయంకృషివల్లనే. గురువులేని విద్యేమిటి? అని ఎవరైనా అంటారేమో అని తాను అబ్దుస్సమద్‌వద్ద నేర్చుకున్నట్లు చెప్పుకునేవాడు. అబ్దుస్సమద్ బహుభాషావేత్త. ఫార్సీ, సంస్కృతభాషల ఏకమాతృకత్వాన్ని గూర్చి వీరిద్దరూ చర్చించుకునేవారు. గాలిబ్‌కు పదమూడవఏట వివాహమైంది.

గాలిబ్ సుస్థిరబుద్ధి. ఆరోగ్యవంతమైన శరీరం. ఢిల్లీకి బసమార్చిన తరువాత సొంతయిల్లు అనేది ఎరుగడు. ఎప్పుడూ అద్దె ఇళ్లలో ఉండేవాడు. సొంతఇల్లు కొనుక్కోలేదు. కట్టించుకోలేదు. ఒక ఇంటిమీద విసుగొస్తే ఇంకో ఇంటికి మారేవాడు. తుదిరోజుల్లో మసీదుకు దగ్గరగాఉన్న ఇంట్లో వున్నాడు. అప్పు డొకపద్యం చెప్పినాడు.

"నేను గుడిప్రక్క | గేహమ్ములోననుంటి
బ్రహ్మకే నేను ప్రక్కింటివాడినంటి."

మసీదుప్రక్కఇంట్లో వున్నాడట. మసీదు దేవునికి నివాసంగనక, ఆ మసీదు ప్రక్కన తానున్నాడుగనుక బ్రహ్మకు పక్కింటివాడైనాడట! దీనిలో రెండర్థాలు. ఒకటి—తాను దేవుడంతటివాని ఇంటి పక్కగా నివాసం ఏర్పరచుకున్నాడు. తనకు దేవుడు పక్కింట ఉన్నాడు. రెండవది — వయసు మళ్లినది. ఇక దేవునికి దగ్గరగా వెళ్ళాలిగనక మసీదుపక్క ఇల్లు తీసుకున్నాడు. క్రమంగా దేవుడికి మరీ సమీపానికి వెళతాడు, అనగా చనిపోనున్నాడు.

గాలిబ్ బాడుగఇండ్లలో ఉండడమేగాక ఎన్నడూ తనకోసం ఒక్క పుస్తకంకూడా కొనుక్కుని ఇంట్లో భాండాగారం ఏర్పరచుకోలేదు. బాడుగకు పుస్తకాలు తెప్పించి చదివి పంపించేవాడు. అత్యంతప్రతిభాశాలిగనుక తాను ఒక్కమాటు చదివిన పుస్తకంలోని విషయాలు ఎన్నటికీ మరిచేవాడు కాదు. కనుక పుస్తకాలు ఇంట్లో దాచుకోవలసిన అవసరమే ఉండేదికాదు.

అప్పటి వైస్రాయ్, లెఫ్టినెంట్‌గవర్నరూ దర్బారు చేసినప్పుడు గాలిబ్‌నుకూడా పిలిచి గౌరవించేవారు.

ఢిల్లీలో రథశబ్దాన్ని కొందరు స్త్రీలింగశబ్దంగాను, కొందరు పుంలింగశబ్దంగాను వాడతారు. ఏది సరియైనదో గాలిబ్‌ను అడిగి తెలుసుకుందామని కొందరు వచ్చి ఆయన్ని అడిగారు. ఆయనన్నాడు—ఆడవాళ్లెక్కిన రథం స్త్రీలింగం, మొగవాళ్ళెక్కిన రథం పుంలింగం—అని. హాస్యప్రియుడైన

గాలిబ్ ఇచ్చే సద్యఃప్రత్యుత్తరాలు చాలా హాస్యజనకంగా ఉండడమేగాక ప్రత్యర్థిని దెబ్బకొడతాయి.

గాలిబ్ గొప్ప ఆత్మగౌరవం కలవాడు. ఢిల్లీలో ఒక కళాశాల మొదటి సారి క్రమబద్ధంగా ఏర్పడినప్పుడు అక్కడ ఫార్సీభాషాభోధకుడు కావలసి వచ్చినాడు. గవర్నమెంటువారి విద్యాశాఖ సెక్రెటరీ టామ్సన్ దీనికి తగిన వారిని ఎన్నుకుంటాడు. జీతం నెలకు నూరురూపాయలు. గాలిబ్ కూడా అర్జీ పెట్టుకున్నాడు. ఇంటర్వ్యూకి పిలిచారు. రాజదర్బారుకు కవిరాజు వెళ్ళినట్లు పల్లకీలో టామ్సన్ కార్యాలయానికి వెళ్ళాడు. కార్యాలయంముందు దిగినాడు. తనను రాజాధిరాజులు ఎదురేగి ఆహ్వానిస్తారు, కాని ఈ ఇంటర్వ్యూ నాడు టామ్సను స్వాగతం చెప్పడానికి రాలేదు. అతను వచ్చి పిలుచుకోపోనిది లోనికి రాననన్నాడు గాలిబ్. "కవిగా గాలిబ్‌కు ఎదురేగి స్వాగతం చెప్పడానికి నాకు అభ్యంతరం లేదుగాని, ప్రభుత్వోద్యోగానికి అర్జీపెట్టుకున్న వ్యక్తిగా ఇప్పుడు వచ్చాడుగనుక ఆశాఖలోన్న అధికారినైన నేను అతన్ని ఎదురేగి ఆహ్వానించడం మంచిదికాదు" అన్నాడు టామ్సన్. "ఇంతవరకూ ఉన్న గౌరవానికి భంగం కలిగించే ఈ ఉద్యోగం నాకు అక్కరలేదు" అని ఇంటర్వ్యూకు హాజరుకాకుండానే వెళ్ళిపోయాడు. గాలిబ్ ఆత్మగౌరవానికీ, స్వతంత్ర ప్రవృత్తికీ, స్వేచ్ఛా భావానికీ ఈఘటన ఒక చక్కని ఉదాహరణ.

గాలిబ్‌కు పాచికలు ఆడడం, జూదం ఆడడం అంటే చాల ఇష్టం. జూదం ఆడినవారిని శిక్షించాలని ప్రభుత్వం శాసనం అమలుచేసింది. గాలిబ్ శాసనాలకు కట్టుపడేవాడు కాదు. పాచికలు ఆడుతూనేవుండేవాడు. ఒక నాడు రక్షకభటులు అతడు పాచికలు ఆడుతుండగా చూచి పట్టుకున్నారు. ఇంగ్లీషువారి పరిపాలన రోజుల మాట ఇది. పోలీసులు గాలిబ్‌ను మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారు. అతను ఆరునెలలు శిక్ష విధించాడు. అయితే జైల్లో అతన్ని ఎంతో గౌరవంగా చూచారు. అన్నిసౌకర్యాలూ కలుగజేశారు. మూడునెలలు కాగానే మిగతా మూడునెలల శిక్షతగ్గించి విడుదల చేశారు. జైల్లో ఉండవలసిన దౌర్భాగ్యం కలిగినందుకు మనస్సు నొచ్చినా గాలిబ్ నిరుత్సాహపడలేదు. జైలుజీవితాన్ని చిరునవ్వుతో వెళ్ళబుచ్చినాడు.

మూడునెలై జైల్లోనుంచి విడుదలకాగానే కాలేమియాఁ అనే మిత్రుని ఒత్తిడివల్ల అతని ఇంట్లో కొన్నాళ్ళు ఉన్నాడు. గాలిబ్ వంటి మహాకవి తమ అతిథిగా కొన్నాళ్ళు నిలుపుకోవడం గౌరవంగా భావించేవారు ధనికులు.

జైలునుంచి విడుదలైనాడని తెలిసి గాలిబ్ క్షేమసమాచారాలు అరసి పోవడానికి మిత్రులు వచ్చారు. వారిలో ఒకడన్నాడు "గాలిబ్! దేవుని దయవల్ల జైలునుంచి విడుదలైనావు. సంతోషం" అని. అది విని గాలిబ్

అన్నాడు— "జైలునుంచి విడుదలైన వెధవ ఎవడయ్యా! మొన్నటిదాకా తెల్లవాడిజైల్లో ఉన్నాను. ఇప్పుడు నల్లవాడిజైల్లో ఉన్నాను" అని. తాను ఏమిత్రుడింట్లో వున్నాడో అతనిపేరు కాలేమియాఁ. 'కాలా' అనగా నల్లని వాడు అని అర్థం. తెల్లవాని జైలు తప్పిగాని నల్లవాని ఇంట్లో నిర్భందంగా ఉంటున్నాను అని హాస్యానికి విసరినాడు. మరొకరైతే జైల్లో పడ్డంచుకు సిగ్గుపడి కొన్నేళ్ళు అన్యులకు కనపడేవాళ్ళు కారు. గాలిబ్ తాను నవ్వుతూ కాలం గడపడమేగాక ఇతరులను నవ్వించేవాడు.

ఢిల్లీని పరిపాలించిన మొగల్ వంశపు రాజులలో తుదివాడైన బహదుర్ షాజఫర్ ఆస్థానంలో పండితుడుగా, కవిగా కొంతకాలం ఉన్నాడు. తైమూర్ వంశచరిత్ర రాయడానికి గాలిబ్‌ను నియమించినాడు రాజు. బహదుర్ షా స్వయంగా కవి. అతని పద్యాలను సరిదిద్దడంకూడా చేస్తుండేవాడు గాలిబ్. ఒకనాడు రాజు ఏవో కొన్ని పద్యపాదాలుమాత్రమే వ్రాసి మిగతావి పూరించి సరిదిద్ది పంపవలసిందిగా కోరాడు. వెంటనే చకచకా వాటిని పూర్తిచేసి సవరించి పంపాడు గాలిబ్. క్షణంలో ఆశువుగా చెప్పినంతవేగంగా పద్యం రచించేవాడు గాలిబ్.

ఇంగ్లీషువారు 'జఫర్'రాజును గద్దెదించినతరువాత చాలా ఇబ్బందులు పడ్డాడు గాలిబ్. 1857 విప్లవం దేశాన్ని అల్లకల్లోలం చేసింది. దేశభక్తులైన వారిని ఇంగ్లీషువారు చిత్రహింసలపాలు చేశారు. ఢిల్లీలో కొన్ని నెలలపాటు ప్రజాజీవితం స్తంభించిపోయింది. ఒక ఇంటినుంచి ఇంకొక ఇంటికి వెళ్లే వీలు లేదు. మార్కెట్లు మూతపడ్డవి. ఆంగ్లసైనికులు ఇళ్ళలో జొరబడి, విప్లవ కారులకు సహాయంచేశారంటూ ఎవణ్ణి పడితే వాణ్ణి పట్టుకుపోయి నిర్బంధంలో ఉంచేవారు. హింసించేవారు. గాలిబ్‌కు దమ్మిడీఆదాయం లేదు. నానాఇబ్బందుల్లో వున్నాడు. గాలిబ్ సోదరుడు "యూసుఫ్‌ఖాన్" చిన్ననాటినుంచే పిచ్చివాడు. ఎన్నిచికిత్సలు చేయించినా అతని పిచ్చి తగ్గలేదు. తుదిని చాలా దీనావస్థలో 1857 విప్లవంరోజుల్లో మరణించాడు. శవానికి కప్పడానికి నాలుగుగజాల కొత్తగుడ్డ లభించలేదు. దుకాణాలన్నీ మూసి వున్నాయి. ఎటుచూచినా సైనికులు. ఇళ్ళల్లోనుంచి బయటకుపోయే వీలు లేదు. ఖననకర్మకు మనుషులు దొరకలేదు. శవాన్ని మోసేవాళ్ళు కరువైనారు. మిత్రుల సహాయంతో గాలిబ్ ఎలాగో సోదరుని అంత్యక్రియలు చేశాడు.

1857 విప్లవజ్వాలలు శమించిన తరువాత రాంపూర్ నవాబు గాలిబ్‌కు నెలకు నూరు రూపాయలు జీతంగా ఇచ్చేవాడు. ఆజీతంలోనే కాలక్షేపం చేసేవాడు గాలిబ్.

గాలిబ్ ఎంత కవో అంత పండితుడు. "బుర్హాన్‌ఖాతే" అనే నిఘంటువులోని లోపాలను చూపుతూ "ఖాతేబుర్హాన్" రచించాడు. అతని

పాండితికి జనులు ఆశ్చర్యపడ్డారు. ఒకతను "ఖాతేఖాతే" అనే పేరుతో గాలిబ్‌ను ఖండిస్తూ పుస్తకం రాశాడు. మిత్రులంతా గాలిబ్ వద్దకు వచ్చి— "అతనెవరో అవకతవకగా నిన్ను విమర్శించుతుంటే ఊరుకుంటావేం? జవాబివ్వు" అన్నారు. అప్పుడు గాలిబ్— "గాడిద మనను తంతే మనమూ గాడిదను తంతామా? పోనిద్దురూ! పశువు" అని ఊరుకున్నాడట!

గాలిబ్ కీర్తిని చూచి, విని ఈర్ష్యపడి చాలామంది గాలిబ్‌ను తిడుతూ ఉత్తరాలు రాశేవారు. అవి సావధానంగా చదువుకుని నవ్వుకుని ఊరుకునే వాడు గాలిబ్. ఒకడు "అమ్మ, తల్లి..." అంటూ బూతులు తిడుతూ ఉత్తరం రాశాడు. అది ఒక మిత్రునకు చూపి గాలిబ్ అన్నాడు— "ఈవెధవకు తిట్లుతిట్టడంకూడా రాదు. పిల్లవానికి వాని తల్లి నెవడైనా తిడితే ఎక్కడలేని కోపం వస్తుంది. కారణం, పిల్లవానికి తల్లితోగల విడరాని సాన్నిహిత్యం. అలాగే వయసువచ్చినవానికి భార్యను తిడితే కోపం వస్తుంది. ఎందుకంటే వాడికి ఇతరులతోకంటే భార్యతో సాన్నిహిత్యం, మక్కువ వుంటాయి. వృద్ధునికి కూతురిని తిడితే చెప్పరాని కోపంవస్తుంది. వృద్ధుడు కూతురుకు సన్నిహితంగా వుంటాడు. ఈవెధవ ముసలివాణ్ణయిన నాతల్లిని తిడితే ఏంబాగుంది చెప్మా? తిట్టడంకూడా రాని చవట" అని.

ఊరుదూ, ఫారసీభాషలవారు జరిపే "ముషాయిరా" లు (కవిసమ్మేళనాలు) చాలా ప్రసిద్ధి చెందినవి. ఈ ముషాయిరా సంప్రదాయం అన్యభాషల్లో ఇంతగా లేదు. పేదవానినుండి పెద్దదాకా అంతా ముషాయిరాలు వినడానికి వేలసంఖ్యలో వస్తారు. ఊరుదూభాష మాట్లాడేవారికి కవితాపఠనం, కవితాశ్రవణంమీద అన్యులకంటే ఆసక్తి చాలా ఎక్కువ. కనుక చిరకాలంగా ఊరుదూ, ఫారసీముషాయిరాలు మనదేశంలో చాలా ప్రసిద్ధములైనవి. ఢిల్లీలో రాజాస్థానాలలోను, ఇతరత్రాకూడా గొప్పగొప్ప కవితాగోష్ఠులు జరిగేవి. సుప్రసిద్ధులైన కవులు వాటిలో పాల్గొంటూవుండేవారు. తెల్లవార్లూ ఈ గోష్ఠులు జరుగుతుంటాయి. కవితామదిరానుపానం చేస్తూ ప్రజలు తన్మయత్వంలో మునిగి రాత్రులు రాత్రులు గడుపుతారు. వారు కవితాస్వాదన చేయగలిగినంత, ఆదరించగలిగినంత అన్యభాషలవారికి సాధ్యపడదు.

అసలు ఫారసీ, ఊరుదూకవితారీతే అట్టిది. క్లుప్తత ఆ కవితలో ముఖ్యలక్షణం. వేమనపద్యంగూడా ఊర్దూషేర్‌కంటె రెండింతల పెద్దగా వుంటుంది. నాలుగోపంక్తి మకుటమే అయినా మూడుపంక్తులైనా లేనిది తెలుగులోగాని, సంస్కృతంలోగాని ఒక భావం ముడివడదేమో! ఊరుదూ, ఫారసీ భాషలలో రెండు పంక్తులలో ఉపమానం, ఉపమేయంకూడా నిండుగా చెబుతారు. మళ్ళీ ఆ రెండుపంక్తుల్లో ధ్వనిని కుదిస్తారు. ఆ రెండు

పంక్తులూ ఎంతో ఆప్తభావంతో శ్రోతల హృదయాలలోకి చొచ్చుకుని వెళతాయి. కనుక ఉరుదూకవితలో ఉన్నంత క్లుప్తత, గుప్తత, ఆప్తత మరే భాషలోనూ కనిపించదు. కవి తాను రచించిన రెండు పంక్తుల పద్యం చదివేసరికి శ్రోతలు, హృదయాలుప్పొంగి "వహ్వా" అని తమ ఆనందాన్ని వ్యక్తపరచండే ఉండలేరు. లాగివదలిన బాణంలా ఆ పద్యం గుండెలోకి జొరబడి తనపనిని చేస్తుంది. ఇది అన్యభాషల్లో లేదు. ఒక చిన్న భావాన్ని పదిపన్నెండు పద్యాల్లోగాని మనం పూర్తిచేయలేం. Brevity కి ఫారసీ, ఉరుదూ భాషలు పెట్టినదిపేరు.

ఇట్టి ముషాయిరాలు ఢిల్లీలో రాజదర్బారుల్లో చాలా వైభవోపేతంగా జరుగుతుండేవి. రాజుల దర్బారుల్లోనేకాక అన్యత్రాకూడా జరిగేవి. వాటిల్లో గాలిబ్ పాల్గొనేవాడు. చాలా మనోహరంగా తన కవితను వినిపించేవాడు. అయితే సన్నాయి, మద్దెల పెట్టుకుని పాట పాడేవాడనుకునేరు. భావం విశదపడేట్టు చక్కగా పఠించేవాడు. ఆయన తన కవితను తాను పఠించగా విని జనులు ఎంతో ఆనందించేవారు.

ఒకరాత్రి ఢిల్లీలో ముషాయిరా జరిగింది. రాత్రి సాంతం కవిత వింటూనేవున్నారు సహృదయులు. అనేక కవులు తమ కవిత చదివారు. గాలిబ్ చదవవలసిన సమయానికి ఇంచుమించు తెల్లవారింది. "ఇప్పుడు నేను 'భైరవీరాగం' ఆలాపిస్తాను" అంటూ "నదీరోదన" అనే శీర్షిక గల ఫారసీ కవిత వినిపించాడు. ఆయన ఆ కవిత వినిపిస్తున్నంతసేపూ శ్రోతలు, హృదయాలు ద్రవించి కన్నీరుకారుస్తూనేవున్నారు. కొందరు వెక్కి వెక్కి రోదించారు. అప్పుడే వర్షంకూడా కురిసింది. సభ్యులలోనుండి ఒకరు లేచి "ఆస్మాన్ హం గరీస్త"—ఆకాశంకూడా కన్నీరు కారుస్తున్నది అన్నాడట. వేదనా భరితమైన గాలిబ్ కవిత కరగించని హృదయం లేనేలేదు. "పాషాణాదపి పీయూషం స్యందతే" అన్నట్టు కఠిన హృదయాలు సైతం కరగి కాల్వలు కట్టే రీతిని కవిత రచించినాడు గాలిబ్.

మహాకవి గాలిబ్‌కు భారతదేశంలోని నలుమూలలనుండి వేలాదిజనం లేఖలు వ్రాసేవారు. అనేక విషయాలను గూర్చి ప్రస్తి ఉంటూండేది ఆ లేఖల్లో. ఎన్ని పనులున్నా, ఎన్ని చిక్కులున్నా, ఎంత విచారంగా వున్నా, ఎంత అనారోగ్యంగావున్నా అన్ని ఉత్తరాలకూ తప్పనిసరిగా జవాబు ఇచ్చేవాడు. జవాబుకోసం కవర్లలో స్టాంపులు పెట్టి ఎవరైనా పంపితే చాలా కోపపడేవాడు. 'నాట్ పెయిడ్' ఉత్తరాలు వచ్చినా తిరగగొట్టక, డబ్బుచెల్లించి వాటిని తీసుకుని జవాబు ఇచ్చేవాడు. గాలిబ్‌తో పద్యాలు దిద్దించుకోవాలని చాలామంది అభిలాష. కనుక అనేకులు పద్యాలు దిద్దడానికి పంపేవారు. కండ్లు కనపడని వృద్ధాప్యంలోనూ, స్వయంగా వ్రాయ

జాలనినాడున్నా ఇతరుల సహాయంతో లేఖలకు జవాబులు పంపేవాడు. ఓపికగా పద్యాలు దిద్ది పంపించేవాడు. కాని మరీ వృద్ధుడయిపోయి మనస్సిమితం మరీ తగ్గిపోయినాక "ఇక దిద్దడానికి పద్యాలు పంపకండి. నాకు విశ్రాంతి నివ్వండి" అని విజ్ఞప్తి చేశాడు. అయినా జనం పద్యాలుపంపి దిద్దమని వేధిస్తుండేవారు. "మంచి భార్య చెడు భర్తతో విధిలేక కాలంగడిపి నట్లు, చేతగాకున్నా పద్యాలు దిద్దుతున్నాను" అన్నాడట ఒకసారి గాలిబ్.

తన ఆదాయం ఎంత తక్కువైనా, పేదలకు చేతనైనసహాయం చేసేవాడు. జీతం లేనినాడుకూడా ఇంట్లో పనివాళ్లను తొలగించలేదు. గాలిబ్ ఇంటి ముందు నుంటివాళ్ళు, గుర్తిడ్డివాళ్లు ఎప్పుడూ ఉంటుండేవారు. వాళ్ళకు తిండిపెట్టడం, బట్టయివ్వడం మానుకోలేదు. ఇవ్వడానికి అతని చేయి ఎన్నడూ వెనుతీయలేదు. పేదకవుల పద్యాలు దిద్దిపెట్టడమేగాక వారికి వీలైనంత ఆర్థిక సహాయంకూడ చేసేవాడు. వారిని ప్రోత్సహించేవాడు. అవకాశం దొరికినప్పుడల్లా వాళ్ళకు ఎక్కడో ఒకచోట ఆశ్రయం ఏర్పాటు చేసేవాడు.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఒకసారి గాలిబ్‌ను ఆహ్వానించి దర్బారులో వివిధ ఆభరణాలతో, శాలువలతో గౌరవించి బిరుదులు ప్రదానంచేశాడు. బహుమతులు పొందగానే గవర్నర్ గారి బంట్రోతులు "ఇనాం" ఇమ్మని గాలిబ్ ఇంటికి వచ్చారు. గాలిబ్‌వద్ద డబ్బులేదు. వెంటనే ఆ ఆభరణాలను అమ్మించి బంట్రోతులకు ఇనాం ఇచ్చి పంపించాడట.

గాలిబ్ మిత్రుడొకడు, బాగా బతికినవాడు, దౌర్భాగ్యవశాన చితికి పోయి దారిద్ర్యంవల్ల దీనావస్థలో వున్నాడు. అతడు పట్టుకమీజులకు బదులు చాలా చవకరకపు చీటీగుడ్డతో అంగరకా కుట్టించుకుని తొడుక్కుంటున్నాడు. చీటీగుడ్డఅంగరకా తొడుక్కుని అతను గాలిబ్ ఇంటికి వచ్చాడు. అది చూచి గాలిబ్ మనస్సు చివుక్కుమన్నది. "నాయనా! ఈ పలచని అంగరకా బాగుండోయ్. నా కిస్తావా? ఎండకాలం తొడుక్కుంటే హాయిగా వుంటుంది" అని అడిగాడు గాలిబ్. "ఓ, దానికేం తీసుకో" అన్నాడామిత్రుడు. "అది సరేగాని నీ అంగరకా నా కిచ్చి వొంటిమీద బట్టలేకుండా ఇంటికి వెళతావా? ఇదిగో, ఈ పట్టు షేర్వానీ తొడుక్కో" అని తన విలువైన జరీ షేర్వానీ అతనికి తొడిగించి ఆ అంగరకా తా నుంచుకున్నాడు.

మిత్రులంటే గాలిబ్‌కు చెప్పరాని ప్రీతి. నలుగురు మిత్రులతో కలసి కాలం గడపడంకన్న ధన్యత మరొకటి లేదనుకునేవాడు. భార్య, ఇల్లు, వాకిలి, డబ్బు, ఉద్యోగం సమస్తం మరిచేవాడు మిత్రుల సమక్షంలో. మిత్రుల కోసం ఏమైనా చేసేవాడు. "ఇతరులు బిచ్చమెత్తడం నేను చూడలేను. కావాలంటే ఇతరులకోసం నేను బిచ్చమెత్తుతాను" అన్నాడు గాలిబ్.

గాలిబ్ జ్ఞాపకశక్తి అద్వితీయమైనది. ఒకసారి ఒక పుస్తకం చదివాడంటే అందులోని విషయాలను జన్మలో మళ్ళీ మరిచేవాడు కాడు. ఎప్పుడంటే అప్పుడు వాటిని ఉదహరించగలిగేవాడు. ఇంట్లో ఒక్క పుస్తకం ఉండేది కాదు. ఎక్కడినించైనా తెచ్చుకుని చదివి ఇచ్చేసేవాడు. ఏదైనా ప్రయోగానికి ప్రాచీనకవుల రచనలనుండి ఉదాహరణలు ఇవ్వవలసివస్తే తడుము కోకుండా కనీసం పదిఉదాహరణలు గబగబా ఇచ్చేవాడు.

రాత్రిళ్ళు ఆలోచనాసమాధిలో ఉండేవాడు. ప్రతిఆలోచనా ఒక పద్యమై బయలువెడలేది. అయితే అప్పుడు వ్రాసుకునే ఓపికా, వ్యవధీ లేక ఒకొక్కపద్యానికీ ఒక ముడిచొప్పనతన పాజామా 'నాడా'కు వేసేవాడు. తెల్లవారి ఆ ముడులను విప్పుతూ ఆపద్యాలు జ్ఞాపకంచేసుకుని రాసుకునేవాడు. ఎంత జ్ఞాపకశక్తి! ఎంత జటిలమైన విషయమైనా సునిశితంగా పరిశీలించి, వాని లోతుల్లోకి దిగి తలస్పర్శిగా విమర్శించేవాడు.

గాలిబ్ టుక్రూలు చాలా ప్రశస్తిని సంపాదించుకున్నవి. చాలా నమ్రమైన హాస్యాన్ని ఒలుకుతాడు గాలిబ్.

ఒకనాడు రాజుగారివద్దకు వెళ్ళాడు, రమ్జాన్ పండుగ తరువాత. "ఎన్నాళ్ళు ఉపవాసం ఉన్నారు రమ్జాన్‌లో?" అని అడిగాడు రాజు. "ఒక్కనాడుఉండలేదు" అన్నాడు గాలిబ్. నెలరోజుల్లో ఒక్కరోజే ఉపవాసం ఉండలేదేమో అనుకున్నాడు రాజు. కాని "ఒక్కనాడూ ఉపవాసం ఉండలేదు! రోజూ సుష్ఠుగా భోంచేశాను" అని గాలిబ్ చెప్పదలచాడు. ఈ రెండు అర్థాలూ వచ్చే చిన్నమాట ఎంతో సమయస్ఫూర్తితో వేశాడు గాలిబ్.

రమ్జాన్ నెలలో అంతా ఉపవసించాలి. తాగరాదు. జూదాలు ఆడకూడదు. కాని గాలిబ్ మతవిరుద్ధమైన పనులన్నీ చేస్తూవుండేవాడు. ఒకనాడు జూదం ఆడుతుండగా ఒక మిత్రుడు చూచి, "ఏమయ్యా! రమ్జాన్ రోజుల్లో పాపపిశాచం కట్టుబడి ఖైదులో ఉంటుందంటారు. నీవు ఈ పాపపు పని ఎలా చేస్తున్నావయ్యా" అని అడిగాడు.

"అవును నిజమే. రమ్జాన్ నెలలో పాపపిశాచం కట్టుబడి ఖైదులో వుంటుంది. మా ఇల్లే ఆఖైదు. కనుక జూదం ఆడుతున్నాను. పాపపిశాచం విచ్చలవిడిగా ఈ నెలలో తిరుగదు. అంతేకాని ఖైదులోనన్నా వుంటుందా వుండదా? చెప్పు" అని చమత్కరించాడు గాలిబ్.

గాలిబ్‌కు మామిడిపళ్ళంటే చాలా ఇష్టం. మంచిమంచి పళ్ళు ఎక్కడ దొరుకుతాయని తెలిస్తే అక్కడినుంచి అడిగి తెప్పించుకునేవాడు. ఒకనాడు సాయంత్రంపూట రాజుగారివెంట మామిడి తోటలోకి వాహ్యాళికి వెళ్ళాడు. అది వైశాఖమాసం. చెట్లనిండా పండ్లున్నాయి. తడేకదీక్షతో చెట్లవైపు

చూస్తున్నాడు గాలిబ్. "అంత దీక్షగా ఆ చెట్లవైపు ఎందుకు చూస్తున్నారు" అని అడిగాడు రాజు.

"నాతండ్రితాతల పేర్లు ఏ పండుమోదైనా కనపడతయేమో అని చూస్తున్నాను" అన్నాడు గాలిబ్. అది గ్రహించి వెంటనే మంచిమంచి పండ్లు కోయించి బుట్టలనిండా గాలిబ్ ఇంటికి పంపినాడు రాజు. తన తండ్రి తాతల పేర్లు పండ్లమోద వుంటే వారసత్వంలో తనకు సంక్రమిస్తాయి. ఈ తోటలో ఇన్ని పండ్లున్నాయి. తనకు లభించేవి లేనేలేవా? అని గాలిబ్ చమత్కృతి.

మామిడిపళ్ల కాలంలో ఇంటినిండా మిత్రుల్ని కూచోపెట్టుకుని పండ్లు తినే వాడు గాలిబ్. ఒకనాడు మామిడిపండ్లంటే అసలు ఇష్టంలేని ఒక మిత్రుడు వచ్చాడు. అతనితో మాట్లాడుకుంటూ కూర్చున్నాడు గాలిబ్. ఇంటి ముందర మామిడితెంకలు పడివున్నాయి. ఒక గాడిద అటునుంచి పోతూ, మామిడితెంకను వాసనచూచి ముట్టకుండా వెళ్ళిపోయింది. మామిడిపండ్లంటే ఇష్టంలేని ఆయన అన్నాడు— "గాలిబ్! మామిడిపండ్లంటే నీవు అంత మురిసిపోతావు. గాడిదకూడా మామిడిపండు ముట్టడం లేదు చూడు" అని. అది విని గాలిబ్ అన్నాడు- "అవును నిజమే. గాడిదలు మామిడిపండ్లు ముట్టవు" అని. అతని ముఖం కత్తివిసరినా నెత్తుటిచుక్క లేనంత వెలవెల పోయింది.

రోజూ రాత్రిపూట కొంచెంగా మధువు ఆరగించేవాడు గాలిబ్. అయితే దాని కోకొలత వుండేది. మితంగా అంతే పుచ్చుకునేవాడు. సారాయిబుడ్లు దాచే పెట్టెతాళంచెవులు గుమాస్తావద్ద వుంచేవాడు. అడిగినా, నిర్ణయించుకున్న మితానికి మించి సారాయి ఇవ్వవద్దని అతనికి ఆదేశించాడు. తాగి ఆ మైకంలో 'ఇంకా తే, ఇంకా' తెమ్మనేవాడు. కాని ఆజ్ఞను అక్షరాలా పాటించే ఆగుమాస్తా ఎసేమీ అధికంగా మధువు ఇచ్చేవాడు కాదు. కాగా ఆ మత్తులో గాలిబ్ అతన్ని నానాతిట్లూ తిట్టేవాడు. అయినా అతను సహించి ఊరుకునేవాడు.

ఒకనాడు ఒక శిష్యుడు వచ్చి గాలిబ్ కాళ్లు పడతానన్నాడు. "నీవు ఎంత శిష్యుడవైనా గొప్పవంశానికి చెందినవాడవు. మర్యాదస్తుడవు. కాళ్ళు పట్టడం మంచిది కాదు," అన్నాడు గాలిబ్. "కాళ్ళు నొప్పులుగా ఉన్నప్పుడు ఎవరితోనైనా పట్టించుకుంటారుగదా! నాతో కాళ్ళు పట్టించుకోండి. ఉచితంగా కాదు. తరువాత దానికి తగిన కూలీ ఇవ్వండి. ఇంక అందులో అపచారం ఏమీ ఉండదు" అంటూ కాళ్లువొత్తడం మొదలుపెట్టాడు అతను. వొత్తడం అయినాక "నా కూలీ నాకు ఇవ్వండి" అన్నాడతను. "నాయనా! నీవు కాళ్ళుపట్టావు, నేను డబ్బుబిగపట్టాను. దానికీ దానికీ సరిపోయింది" అన్నాడట గాలిబ్.

మిత్రుడొకాయన గాలిబ్ ఇంటికి వచ్చాడు. చాలా రాత్రిదాకా మాట్లాడుకుంటూ కూర్చున్నారు. వెళ్లేప్పుడు దీపంతీసుకుని వాకిట్లోదాకా వచ్చి చెప్పులు చూపించాడు గాలిబ్. "నాచెప్పులు నేను తొడుక్కోలేనా! దీపం ఎందుకూ" అన్నాడతను. "అది నిజమే. నీచెప్పులు తొడుక్కోలేవని కాదు. నాచెప్పు లెక్కడ తొడుక్కోపోతావో అని దీపం తెచ్చాను" అన్నాడు గాలిబ్.

మిత్రుడు ఒకడు గాలిబ్ తాగుతున్నందుకు ఆక్షేపణగా అన్నాడు- "గాలిబ్! మద్యపానం పాపం కదూ! మద్యం పుచ్చుకునేవాని ప్రార్థనను భగవంతుడు అంగీకరించడు" అని. అది విని గాలిబ్ నవ్వి— "తాగడానికి మద్యం దొరికాక ఇంకా భగవంతుణ్ణి ప్రార్థించడం దేనికి?" అన్నాడు.

ఎండకాలం రాత్రిపూట ఆరుబయట మంచంలో పడుకుని ఆకాశంలోకి చూచాడు గాలిబ్. ఆకాశంనిండా చిందరవందరగా విరబోసి కనపడ్డాయి చుక్కలు. ఎవరిభయమూ లేకుండా స్వతంత్రుడైనవాడు తన ఇష్టం వచ్చినట్టు స్వేచ్ఛగా చేసే పనుల్లాగా క్రమరహితంగా విచ్చలవిడిగా పడివున్నాయి చుక్కలు అనుకున్నాడు గాలిబ్.

ఇతరులను పిచ్చిపిచ్చిగా స్తుతించడం గాలిబ్ వల్ల కాకపోయేది. ప్రశంసా పద్యాలు వ్రాయడంలో కొందరు సిద్ధహస్తులుగా వుంటారు. గాలిబ్ ఆ విషయంలో వట్టి అసమర్థుడు. తన హృదయాన్ని కదలించిన వస్తువునుతప్ప అన్యమును మెచ్చుకునేవాడు కాడు. పొగడేవాడు కాడు. ఎంతవాడు రాసినా సరే, తనకు నచ్చని పద్యాన్ని ఎన్నటికీ 'బాగుంది' అనేవాడు కాదు. తన హృదయాన్ని స్పృశించి హాయిహాయి అనిపించని రచనకు చంకలుకొట్టేవాడు కాదు. తనకునచ్చితే మెచ్చుకోడానికి ఎన్నడూ వెనకాడేవాడుకాదు.

"జౌఖ్" అనే ఒక సుప్రసిద్ధకవికీ గాలీబ్‌కూ ఎప్పుడూ పొసగేదికాదు. ఎప్పుడూ ఏవో అభిప్రాయభేదాలు, పొరుపులు ఉంటుండేవి. అయినా తనకు నచ్చిన పద్యం ఏదైనా జౌఖ్ రాస్తే ఉప్పొంగిపోయేవాడు గాలిబ్.

"పెనుబాధ లోర్వక చనిపోదు నందువు
హృదయ మపుడుఁ కలగ నెటు పోవ నెంతువు?"

ఈ పద్యం "జౌఖ్" ది. ఎన్ని అభిప్రాయభేదాలున్నా, అన్నీ మరిచి ఈ పద్యానికి ఉప్పొంగిపోయినాడు గాలిబ్. "బాధలు భరించలేక వాటినుండి తప్పించుకోవడానికి చనిపోతా నంటావు; అప్పటికీ హృదయంలో కలత తగ్గకుంటే ఇంకెటు పోతావు? చావుకన్న ఆఖరుచోటు ఇంకోటి లేదుకదా? అప్పటికీ బాధలు పోకుంటే ఎటుపోతావు? బాధలు చచ్చినా తప్పవు.

పలాయనవాదం పనికిరాదు. బ్రతికివుండే ఎదిరించాలి'' అన్న భావాన్ని ఈ పద్యంలో జౌఖ్ రమ్యంగా చెప్పినాడు. అది గాలిబ్‌కు నచ్చింది.

ఎంత చిన్నకవి అయినాసరే రచన బాగుంటే మెచ్చుకునేవాడు. ఒక శిష్యుడు సంస్కరణకోసం పంపిన పద్యాన్ని చదువుకుని మెచ్చుకుని అతని కో ఉత్తరం రాస్తూ ''నీపద్యాన్ని చదివి ఈర్ష్యపడుతున్నాను. ఎంత మంచి పద్యం రాశావోయ్ !'' అని దీవించాడు గాలిబ్.

ఇక తన పద్యంలో ఎవరైనా లోపం చూపిస్తే, వెంటనే అంగీకరించే వాడు. ఆ లోపాన్ని సవరించుకునేవాడు.

''స్వీయలోపమ్ము లెరుగుట పెద్దవిద్ది;
లోప మెరిగినవాడె పూర్ణుడగు నరుడు''

అన్నాడు గాలిబ్.

ఇక, తనకు నచ్చని పని ఎవరైనా చేయమంటే - అతడు రాజుకానీ - చేసేవాడు కాడు. తెలివిగా ఆ పనినుండి తప్పుకునేవాడు. ఎవరైనా చని పోతే వారినిగూర్చి అధ్యయనపద్యాలు రాయడం ఆరోజుల్లో ఆచారం. ఆ పద్యంలో ఆ చనిపోయిన వ్యక్తినిగూర్చి, చనిపోయిన తేదీ, నెల, సంవత్సరం సంకేతంగా ఇమిడేట్లు కవులు పద్యాలు వ్రాస్తుండేవారు. వాటిని ఆ చనిపోయిన వ్యక్తికి చెందినవారు సమాధిశిలమీద చెక్కించేవారు.

చనిపోయినప్పుడేగాక, పిల్లలు పుట్టినప్పుడు, పిల్లల పుట్టినరోజు పండుగలకు పద్యాలు రాయించుకుంటారు కొందరు. గాలిబ్ ఈ రెండురకాల పద్యాలుకూడా రాసేవాడు కాదు. ఒకసారి ఒక పెద్దమనిషి తన పిల్లవాడి పుట్టినరోజుసందర్భంలో పద్యం రాయమన్నాడు. 'రాయను' అని మోటుగా అని అతన్ని నొప్పించడం ఇష్టంలేదు. కనుక ఒక చమత్కారం చేశాడు. ''ఆమధ్య ఎవరిపిల్లవానికో పుట్టినరోజున పద్యంరాస్తే వాడు పుటుక్కున ఊపిరి వదిలాడు. నా రాతలు అచ్చిరావు. నాతో ఎందుకు రాయించుకుంటారు?'' అన్నాడు. దానితో ఆ రాతబెడద వదలిపోయింది. వాయిమని బలవంతం చేయడానికి ఇక వీలే లేకుండా జవాబిచ్చాడు గాలిబ్.

ఇలాటి చమత్కారఘట్టాలు గాలిబ్ జీవితంలో చాలా కనపడుతాయి.

ఒకసారి గాలిబ్ శిష్యుడు ఉమ్రావ్ సింగ్‌కు రెండవసారి భార్యావియోగం కలిగింది. చిన్నచిన్న పిల్లలు. మళ్ళీ వివాహం చేసుకోనిది తప్పని దుస్థితి ఏర్పడిందంటూ గాలిబ్‌కు ఉత్తరం వచ్చింది. దానికి జవాబుగా గాలిబ్ లేఖ ఇలా వ్రాశాడు:

"ఉమ్రావ్ సింగ్‌కు అప్పుడే మూడవ పెళ్ళికర్మ పట్టిందా? నాకు ఇంకా రెండో పెళ్ళి భాగ్యమైనా పట్టలేదు"--అని. తన భార్య ఇంకా బతికేవుందనీ, అది చనిపోతే రెండవపెళ్ళి చేసుకునే వాణ్ణనీ ధ్వనించే హాస్యం విసిరాడు గాలిబ్ ఆ లేఖలో. దీనివల్ల గాలిబ్‌కు భార్యపై విసుగుపుట్టి రాసినట్లు అనిపించవచ్చుగాని అది నిజంకాదు. హాస్యానికి రాసిన మాటేగాని భార్యంటే గాలిబ్‌కు చాలా ప్రీతి. ఆమె గొప్ప దైవభక్తిపరాయణురాలు. సదాచార సంపన్నురాలు. తాను భోంచేసే పాత్రలు వేరుగా, భర్తవి వేరుగా పెట్టేది. సర్వదా భర్తసుఖం కోరి పరిచర్య చేసేది.

ఒకమాటు ఇల్లు మారవలసివచ్చింది. అద్దెఇండ్లు వెతుకుతూ ఒక ఇల్లు తనకు నచ్చగా అందులోకి మారాలనుకున్నాడు గాలిబ్. అయితే ఆడవాళ్లకు కూడా నచ్చాలికాబట్టి 'వెళ్ళి చూచిర'మ్మని భార్యను పంపినాడు. ఆమె వెళ్ళి చూచివచ్చి అన్నది—"ఆ ఇంట్లో దయ్యం వుందని వదంతిగా వుందండీ ఆ వీధిలో—" అని. గాలిబ్ నవ్వి--"నిన్ను మించిన దయ్యం ఎక్కడుంటుంది? పద, ఆ ఇంటికి" అన్నాడట!

ఒక చలికాలంమాట. తన ఇంట్లో పంజరంలో చిలుక రెక్కల్లో ముక్కుదాచుకుని తలవంచుకుని కూచునివుంది. అది కంటబడింది గాలిబ్‌కి. "ఏమిటే చిలుకా? నీకు పెళ్ళాంలేదు, పిల్లలులేరు. అయినా ఎందుకిలా విచారంగా తల వాల్చుకునివున్నావు" అని అడిగాడు.

ఒకసారి గాలిబ్ మామగారి అన్న వచ్చారు. మహమ్మదీయమత ప్రవక్తల వంశవృక్షం తయారుచేశారు ఆయన. వాటి ప్రతులు తయారుచేయవలసిరాగా ఆ పని గాలిబ్‌కు పురమాయించారు. ఈసురోమంటూ రాసిందే రాసి కాపీలు తీయడం గాలిబ్‌కు ఇష్టంలేదు. కాని కాదనలేక ఒకటి రెండు ప్రతులు తీసి ఆయనకు చూపించాడు. అందులో కొన్నితరాలు వదిలేసి రాశాడు గాలిబ్. తాత తరువాత మనుమడు--ఇలాగ. అదిచూచి "ఏమిటి ఇలా చాలావదిలేశావు" అని అడిగాడు ఆయనగారు. "వంశవృక్షం పైదాకా వెళ్లడానికి ప్రతిమెట్లూ ఎక్కుతూపోతే చాలాకాలం పడుతుందిగనుక భక్తులుగబగబా పైకివెళ్లడానికి సులభమైన మార్గం వెదికాను" అన్నాడట గాలిబ్. ఇక ఇతనికి పని చెబితే లాభంలేదని తానే ప్రతులు తయారుచేసుకున్నాడట ఆ పెద్దమనిషి.

గాలిబ్‌కు పిల్లలులేరు. కలుగలేదని కాదు. ఏడుగురు పుట్టి ఏడుగురూ గిట్టినారు. ఆపిదప తన దగ్గరి బంధువుల పిల్లవాణ్ణి పెంచుకున్నాడు.

జీవితంలో ఎగుడుదిగుడులు, కష్టసుఖాలు దండిగా అనుభవించినవాడు గాలిబ్. వార్ధక్యం వచ్చి నడవలేని స్థితి ఏర్పడినపుడు కూడ సాహితీవ్యాసంగం

మానలేదు. ఆశువుగా పద్యాలు చెబుతుండేవాడు. ఇతరుల పద్యాలు దిద్దుతుండేవాడు. లేఖలకు జవాబులు వ్రాయిస్తుండేవాడు.

పోనుపోను జీవితంమీద విసుగొచ్చింది. ఇక ఈ యేడు చనిపోతాను; తప్పదు అంటుండేవాడు. ఒకయేడు మున్షీ జవాహర్ సింగ్ తన దగ్గరకు రాగా "నేను ఈయేడు తప్పక చనిపోతా"నన్నాడు. "మీరు ఈయేడు చనిపోరు" అన్నాడు మున్షీ. "చావు దానంతటది రాకపోతే తల పగులగొట్టుకుని చనిపోతా"నన్నాడు.

ఒకమాటు ఏదో అంటువ్యాధి ఊరంతా వ్యాపించింది. ఒకతను పర గ్రామవాసి, గాలిబ్ వద్దకు వచ్చి "మహామారి తగ్గిందా?" అని ఆడిగాడు. "డెబ్భైయేండ్లవృద్ధును చంపలేనిది మహామారి ఎలా అవుతుందయ్యా?" అని ఎదురు ప్రశ్న వేశాడట గాలిబ్.

తుదిరోజుల్లో తరుచు మూర్ఛలు వస్తుండేవి. స్పృహలేకుండా పడివుండే వాడు చాలాసేపు. కొన్నినిముషాలకు మళ్ళీ స్మృతివచ్చేది. చనిపోవడానికి ఒకరోజు ముందు చాలా సమయంతరువాత స్పృహవచ్చింది. ఒకరిలేఖకు జవాబువ్రాయిస్తున్నాడు గాలిబ్. "నా సంగతి నన్నేమడుగుతావు? కొద్ది రోజులైనాక పక్కింటి వాళ్లను అడుగు" అని జవాబు. ఆరోగ్యం, క్షేమ సమాచారం తెలుపవలసిందిగా అల్లావుద్దీన్ అహమద్ ఖాన్ రాసిన లేఖకు జవాబు ఇది. త్వరలో తాను చనిపోతానని చెప్పడానికి బదులు చమత్కారంగా—"నన్నేం క్షేమసమాచారాలు అడుగుతావు? కొన్నాళ్ళైనాక పక్కింటివాళ్లను అడుగు" అని రాయించాడు. పక్కవాళ్లను అడుగవలసి వస్తుందనగా తాను ఇక ఉండడు అని.

మహాకవీ, ఉత్తమ మానవుడూ, నిర్మల మనస్కుడూ, వ్యథితజీవీ, గాలిబ్ 1869-వ సంవత్సరం ఫిబ్రవరి 15-వ తేదీన తన భౌతికదేహాన్ని విసర్జించి అమరకీర్తికాయంతో అఖిలసాహితీలోకంలో అవతరించాడు.

జాగీర్దారీ, జమీందారీ సమాజ వ్యవస్థలో ఉన్నా, సంప్రదాయాలను ధిక్కరించడం బ్రహ్మప్రళయంగా కనిపించినా, తాను ఆత్మను అమ్ముకుని రాజాధిరాజుల కొలువు చేయలేదు. తన స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని అనుక్షణం కాపాడుకున్నాడు. తనను లెక్కచేయనివాణ్ణి తానూ లెక్కచేయలేదు. అన్యులకు దాసుడై నీచంగా జీవించలేదు. విషాన్ని అమృతంగా భుజించిన మహాశివుడతడు. దారిద్ర్యాన్ని మానవమనోబల పరీక్షానికషంగా భావించి అనుభవించాడు. నిరాశతో క్రుంగక, ఆశతో, ఉత్సాహంతో, చైతన్యంతో, ముందుకు సాగినాడు. తాను నమ్మినది చేసినాడు. తనకు నచ్చని దానిని తిరస్కరించినాడు. నవ్వి, నవ్వించి ఆరోగ్యవంతంగా జీవించినాడు.

మానవకోటి హృదయాలను ఆకళించుకుని వాటి స్వరూపస్వభావాలను అలవరచుకుని కవితద్వారా చిత్రాలుతీసినాడు. ప్రతి గుండెగాయాన్నీ ఒక కవితాధ్యాయంగా మలచినాడు. కష్టాలను ఇష్టంతో భరించినాడు.

భారతీయ మహాకవులలో ఒకడుగా ఉన్నతపదవిని పొందిన గాలిబ్ ఏ ఒక్క భాషకో, ఒక్క జాతికో, వర్గానికో, మతానికో చెందినవాడు కాడు. అతడు సంకుచితాలకు అతీతుడు. ఫార్సీలోనూ, ఉర్దూలోనూ మాత్రమే రాసినా, భాషలకు అతీతమైన ఆలోచనలను లోకానికి ప్రసాదించినాడు. మహమ్మదీయ మతసుడే అయినా అన్ని మతాలనూ ఆదరించినాడు. మతాల మడిని పులుముకోలేదు. ఎంత మహాపండితుడైనా, పాతనియమనిబంధనలకువిధిగా కట్టుబడి ఉండకుండా, స్వతంత్రంగా విహరించినాడు. మహారాజుల ఆస్థానాల్లో ఉన్నా, ఆత్మను వారికి అమ్ముకోలేదు. ప్రేయసీ విరహాన్ని వర్ణించినా, అసమర్థునివలె పొలికేకలు వేయలేదు. వెక్కిగా రోదించలేదు. ఆరోగ్యవంతమైన వేదననే అనుభవించినాడుగాని ఆత్మవినాశకరమైన బాధలో పడలేదు. మైత్రికి విశిష్టస్థానమిచ్చినాడు. ఎవరినీ ద్వేషించలేదు. అల్పాక్షరములలో అనల్పార్థమును చొప్పించినాడు. మృత్యువుకు జడియలేదు. డబ్బుకు లాలోచీపడలేదు. స్వసౌఖ్యాలకోసం అల్లులుచాచలేదు. తాత్వికచింత మరువలేదు. అయితే, సంకుచితమతధర్మాలను నమ్మనూలేదు.

అన్ని తరాలకూ, అన్ని యుగాలకూ, అన్ని జాతులకూ జలదరింపు కలిగించే సార్వజనీన సార్వకాలిక భావపరంపరను అభివ్యక్తంచేసి విశ్వభావనను పెంపొందించినాడు. అన్నిటిలో మితంగా వ్యవహరించినాడు.

గాలిబ్ ప్రేయసి విషయంలో ఎన్నో అభిప్రాయభేదాలున్నాయి. గాలిబ్ వివాహం 13 వ ఏటనే అయింది. వివాహం తరువాత కొన్నాళ్ళకు ఒకమ్మాయిని ప్రేమించినట్లు వదంతులున్నాయి. తాను స్వయంగా ఒక చోట ఒక అమ్మాయిని ప్రేమించినట్లు వ్రాసుకున్నాడుగాని, హాస్యానికో, లేక కేవలం ఊహాధోరణిలోనో రాసినా రాసివుండవచ్చు. అనుకూలవతియైన భార్యతో జీవితం వెళ్లబుచ్చిన గాలిబ్ ప్రణయాన్ని గురించిన వివరాలు బాగా తెలియవు. ఏమైనా ఆయన వెలువరించిన భావాలు కేవలం ఆయన అనుభవాలే కానక్కరలేదు. ద్రష్టయైన కవి వివిధ మానవస్వభావాలను ఇట్టే దర్శించగలడు. సాధారణాంశములలో ఉదాత్తతను కనిపెట్టగలడు కూడా.

అనువాదరీతి

నేను చిన్నతనాన ఖమ్మంమెట్టులోని ఉస్మానియా హైస్కూల్‌లో చదువుకునేటప్పుడు మాకు ఉర్దూ, ఫార్సీ చెప్పే మేష్టారు 'జక్కీ' సాహేబ్ మా పాఠ్యక్రమంలోని విషయాలను కొంచెం పక్కకుపెట్టి మహాకవి మిర్జా గాలిబ్ పద్యపాదాలు - ఫార్సీవి, ఉర్దూవి - చదివి, తాను తన్మయమవుతూ మమ్మల్నీ తన్మయపరిచేవాడు. గాలిబ్ పద్యాల విమానాలమీద ఎక్కి మేము సుందర నందనారామాలవైపు ఉడాయించేవాళ్లము. నా ఆ బాల్యమిత్రము శ్రీ డి. రామలింగం, నేనూ సాహితీవాసనా విలసితమైన మనస్సులతో ఏవో ఊహలు ఊహించుకుంటూ క్లాసురూములో అసలు పాఠాలవైపు పోలేకపోయేవాళ్లం.

నాకు అలనాడు గాలిబ్‌పట్ల ఏర్పడిన ఆమక్కువ ఈనాటికి ఆయన రచనల అనువాదంద్వారా రూపందిద్దుకున్నది. మతోన్మాదులు విహరించిన నేలన మతాతీతుడుగాను, సంప్రదాయజ్ఞులు వెలసినచోట సంప్రదాయ భేదకుడుగాను, పురాతనత్వమే ఆదర్శమని నమ్మినచోట అతినవ్యుడుగాను వెలసిన మహాకవి గాలిబ్ నా హృదయంలో ఇమిడిపోయినాడు. ఆయనలోని ఆక్లప్తత, ఆఆప్తత, ఆగుప్తత నన్ను ముగ్ధుణ్ణిచేసినవి. కాళిదాసాదులవలె మానవతాగిరి శిఖరాగ్రంమీద తేజోమూర్తిగా శాశ్వతస్థానం ఏర్పరచుకున్న గాలిబ్ అన్నిభాషలవారికీ ఆరాధ్యుడు.

భాషాబంధం కొంత కృత్రిమమైనదే అనాలి. మనం ఎరుగని భాషలోని మహాకవులు మనకు పరిగ్రాహ్యులు కారా! కాకుంటే కాళిదాసు, షేక్స్‌పియర్ వంటివారు వారివారి భాషాపరిధులలోనే బంధితులై ఉండవలసింది. అలా కాకుండా విశ్వకవులుగా వెలసినా రెట్లు? భాష శరీరంవంటిది; కవిత ఆత్మవంటిది. ఆత్మసౌందర్యాన్ని ఆరాధించేవారికి భాష అడ్డురాదు.

మన రాజ్యాంగం అలనాడు గుర్తించిన పదునాల్గు ముఖ్యభాషల్లో ఒకటై, కోట్లాదిప్రజలచేత మాట్లాడబడి, గొప్ప సాహిత్యసంపద గలిగి, గాలిబ్ వంటి మహానుభావులకు కాణాచియైన ఉరుదూభాష అన్యులకు ఎలా వున్నా, తెలుగువారికి ఆదరపాత్రమైనది. మన రాష్ట్రంలో ప్రభుత్వంచేత గుర్తించబడిన రెండవ అధికారభాష అది. అందులోని సొగసులు తెలుసుకోవడం చాలా అవసరం.

అయఃపేటికలలో భద్రపరచబడిన మణిని సాధించడం ఎంత కష్టమో పద్యాలలో డాగిన గాలిబ్ హృదయాన్ని అందుకోడంకూడా అంతశ్రమతో కూడిన పని. ప్రతిపద్యాన్నీ ఆకళించుకుని, ఆ పద్యానికి వివిధవ్యాఖ్యాతలూ, విమర్శకులూ చెప్పిన అర్థాన్ని చదివి, నాకు స్ఫురించిన అర్థాన్ని జీర్ణించుకుని, క్రొత్తి తెలుగురూపంలో మళ్లీ ఆ హృదయాన్ని ఆవిష్కరించడం కొంత కష్టమైనపనే. ఒక్కొక్క పద్యాన్నీ తెలుగులోకి దింపడానికి రోజులురోజులు పట్టేవి. అప్పటికీ సంపూర్ణంగా మూలార్థం రాకుంటే మళ్లీ మార్చవలసివచ్చేది. ఇది అనువాదం కాని అనుసరణ కాదు. కనుక నా కల్పన ఈషణ్మాత్రమూ పనికిరాదు. తెలుగుపాఠకులకు గాలిబ్ భావం అందడానికి కావలసిన హంగులు చేయడానికి మాత్రమే నాకు అధికారం వుంది. అంతకు మించి లేదు. ఇలాటి నిర్బంధాలతో ఈ అనువాదానికి ఉపక్రమించాను. బాగా జనాదరాన్ని పొందిన ఆయన పద్యాలు ఇంచుమించు అన్నీ తీసుకున్నాను. క్లుప్తత (Brevity) చెడకుండా రెండు పాదాలలోని భావాన్ని రెండుపాదాలలోనే చాలావరకూ ఇమిడ్చినాను. ఎక్కడో మరీ వివరణ అవసరమైనచోట నాలుగుపాదాలుగా పెంచాను. అనువాదానికి ఆటవెలది, తేటగీతం వాడుకున్నాను. ఎక్కడో ఒకటి రెండు చోట్ల ద్విపదను, రగడను ఉపయోగించినాను.

మూలానికి నా అనువాదం ఎంత సన్నిహితంగా వున్నదో మచ్చుకి ఇక్కడ చూపిస్తాను.

ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట యెంతో దుష్కరము సుమ్ము!

దీనికి మూలం :—

బస్కె దుష్వార్ హై హర్ కాం కా ఆసాఁ హోనా
ఆద్మీకోభి మయస్సర్ నహీఁ ఇన్సాఁ హోనా.

* * *

ఏమి వచియింతు దౌర్భాగ్య మింతకన్న ?
చచ్చిపోవుదమన్నను చావురాదు.

మూలం:—

కిస్ సే మ్రహూమీ యె ఖిస్మత్ కీ షికాయత్ కీజియే
హం నె చాహా థా కె మర్ జాయేఁ సో వఁభీ నహువా.

* * *

ఎంతకని వాఁకిలు నా గుండెవంత ? నింక
ఆమెకే చూపెదను రక్తిలాంగుళులను.

మూలం :—

దర్దిదిల్ లిఖూఁకబ్ తక్ జావూఁ ఉనూఁకా దిఖ్లాదూఁ
ఉంగ్లియాఁ ఫిగార్ అప్నీ ఖామయె ఖూఁచుకాఁ అప్నా.

* * *

నేను మరణింప నాయింటిలోన మిగిలె
ప్రేయసుల చిత్తరువులును, లేఖ; లంతె.

మూలం :—

చంద్ తస్వీరేబుతాఁ, చంద్ హసీనోంకే ఖుతూత్
బాద్ మర్నేకే మెరే ఘర్ సే యహ్ సామాఁ నిక్లా.

* * *

డాగె పరదాల, పగలు తారాగణమ్ము,
రాత్రికేమయ్యెనో దిగంబరమ్ము లయ్యె.

మూలం :—

థీఁ బనాతున్నా శెగర్దూఁ దిక్ కె పర్దేమేఁ నిహాఁ
షబ్‌గోఁ ఉక్ కే జేమె క్యా ఆయాకె ఉర్యాఁ హోగయాఁ.

* * *

ఏల నన్నుమరచె నెరుగబోయితి, నామె
వలపు చూపు చూచె, భస్మమైతి.

మూలం :—

కర్నే గయేథే ఉస్ సే తఘూఫుల్ కా హం గిలా
కీఏక్ హీసిగాహ్, కె బస్ ఖాక్ హోగయే.

* * *

ఏదో వక్షమ్మునందు బాధింపదొడగె;
హృదయమా? కాదు, బాణంపుటినుపముక్క.

మూలం :—

కుఛ్ ఖటక్తా థా మెరేసీనేమేఁ, లేకిన్ ఆఖర్
జిస్కుదిల్ కహ తేథిసో తీర్ కా పైకాఁ నిక్లా.

* * *

వచ్చె నరుణ తరుణ వాసంత సమయమ్మున,
గొల్లు మరల గుండె గోక జొచ్చె.

మూలం :—

ఫిర్ జిగర్ ఖోద్నేలగా నాఖూ
ఆమదె ఫస్లె లాలకారీ హై.

* * *

నీకు నేను గిట్టనియెడ సాకి! నాకు
చషకమీకుము, దోసిట చాలు మధువు.

మూలం :—

పిలాదే ఓక్ సే సాఖీ! జో హంసె నఫ్రత్ హై
ప్యాలా గర్ నహీఁ దేతా, నదే, షరాబ్ తో దే.

* * *

ఎచట నీ పదాంకముల నీక్షింతు, నచట
అడవిదారియు నందనమట్లు తోచు.

మూలం :—

జహాఁ తేరా నక్శె ఖదం దే ఖ్తేహైఁ
ఖియాబాఁ ఖియాబాఁ ఇరమ్ దే ఖ్తేహైఁ.

* * *

గాలిబా! నీదు తాత్త్విక కలన, యహహా!
తాఁకగకుండిన నిను మేము యోగి యనమె?

మూలం :—

యే మసఇలే తసవ్వుఫ్, యే తెరా బయాన్ గాలిబ్
తుఝే హం వలీ సమఝ్తే జో న బాదాఖ్వార్ హోతా.

* * *

హింసపడు మాకు బ్రహ్మాండ మెంతో ఇరుకు,
అందు గగన మ్మొక పిపీలికాండమంత.

మూలం :—

క్యాతంగ్ హం సితంజద్గాఁ కా జహాఁ హైఁ
జిస్మేకె ఎక్ బై జెఎమోర్ ఆస్మాఁహైఁ.

* * *

పత్రమున నగ్నిశిఖ భద్రపరుచ వచ్చు,
హృదయమున దుఃఖబాధ భరింప లేము.

మూలం :-

లపట్నా పర్నియాఁమేఁ ఫూలయే ఆతిష్కా ఆసఁహైఁ
వలేముషిఁకుల్ హైహిక్మత్ దిల్ మేఁ సోజెగంఛుసానేకా.

* * *

పానశాలయె లేని దేదైన నేమి?
బడి, మసీదు, సత్తరువు సర్వమ్మునొకటె.

మూలం :-

జబ్ మైకదా ఛుటాతో ఫిర్ అబ్ క్యాజగహ్‌కీఖైద,
మస్జిద్‌హో, మదర్సాహో, కొయిఖాన్‌ఖాహో.

* * *

ఎవతె అధరచక్రమును భావించినానొ
రేయి మదినెల్ల చుంబనశ్రేణి వెలసె.

మూలం :-

దహానెతంగ్ ముఝే కిస్‌కా యాద్ ఆయాథా
కె షబ్‌ఖూల్‌మేఁ బోసోఁకా అప్దహాన్ రహా.

* * *

స్వీయలోపమ్ము లెరుగుట పెద్ద విద్ది
లోప మెరిగినవాడె పూర్ణుడగు నరుడు.

మూలం :-

ఐబ్ కా దర్యాఫ్త్ కర్నాహై హునర్‌మందీ, అసద్
నుక్‌స్‌పర్ అప్నేహువా ముత్తెలా కా మిల్‌హువా.

* * *

వత్తునని రాక నాయింటి వాకిలికిని
నన్నె కాపలాగా నిల్పినావదేమె?

మూలం :-

వాదా ఆనేకా వఫాకీజే యహ్ కాస్ అందాజ్‌హై
తుంనే కోఁ సోన్పాహై మేరే ఘర్‌కీదర్బానీ ముఝే

* * *

భ్రుకుటి క్రిందుగ నయనమ్ము పోల్కి గానె
ఆలయము పంచలనె పానశాల వలయు.

మూలం :-

మస్జిద్ కే జేర్ సాయా ఖరాబాత్ చాహ్యే
భోఁపాస్ ఆఁఖ్ ఖిచ్లా హోజాత్ చాహ్యే.

* * *

మూలానికి బాగా సన్నిహితంగా ఉండేట్లు అనువాదం సాగించినాను. ఉభయ భాషలు ఎరిగినవారు, సహృదయులైన వారు సావధానంగా పరిశీలింతురుగాక.

కృతజ్ఞతలు

గాలిబ్ గీతాల రచనకు మొదట నన్ను ప్రోత్సహించి, తమ పత్రికలో వరుసగా ప్రచురించినవారు 'భారతీ' పత్రికా సంపాదకులు; ముఖ్యంగా నా మిత్రులు శ్రీ తిరుమల రామచంద్రగారు. నా అనువాదాలు విని "భేష్" అని నన్ను ఉత్సాహపరచినవారు శ్రీ ఆరుద్ర, శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ దేవులపల్లి రామానుజరావు గార్లు.

ఈ కావ్యాన్ని సర్వాంగ సుందరంగా ప్రచురించి ఆంధ్రప్రజలకు అందించిన భాషాభిమానులు యం. శేషాచలం అండ్ కంపెనీవారు; ముఖ్యంగా శ్రీ యం. యన్. రావుగారు. దీనిలోని భ్రంశములను సరిదిద్దిన పండితవర్యులు శ్రీ టి. వి. రంగాచార్యులు గారు. ఈ ప్రచురణ విషయంలో అత్యంతశ్రద్ధ వహించి తమ పనిగా భావించి శ్రమపడినవారు శ్రీ మల్లాది నరసింహశాస్త్రి గారు. ఈ గ్రంథానికి చక్కని చిత్రాలు రచించి ఇతోధికశోభను చేకూర్చిన వారు శ్రీ బాపు.

నా ఈ రచనను అంకితంగా గ్రహించి తమ సారస్వతాభిమానాన్ని వెలయించిన సహృదయులు, విఖ్యాతనటులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారు.

ఈ అనువాద సందర్భంలో రేయింబవళ్లూ నావెంట ఉండి గాలిబ్ రచనలపై వివిధ వ్యాఖ్యాతలొనర్చిన వ్యాఖ్యానాలను చదివి, వాటిలోని వైశిష్ట్యాన్ని నాకు అందించిన పండితులు, నా సహాధ్యాయి, ఆప్తుడు శ్రీకృష్ణ గోపాల్ సహాయం అనన్యమైనది.

డా॥ పల్లా దుర్గయ్యగారి ఇంట్లో సుఖంగా భోంచేసి రాత్రులు రాత్రులు నియాన్ లైట్ పాలవెన్నెలకాంతులలో గాలిబ్ మధురగీతాలను అనువదించాను. నాపట్ల, ఈ కావ్యంపట్ల ప్రత్యేకమైన అభిమానంతో ఉత్తమ పీఠిక రచించిన నా చిరమిత్రులు, రాజ్యసభాసభ్యులు, ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ కార్యదర్శి, బహుభాషావేత్తలు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి వాత్సల్యం మరువరానిది.

మహాకవి గాలిబ్ మధురహృదయాన్ని ఆంధ్రులకు అందించడంలో తోడ్పడిన ఇందరు మహానుభావులకూ నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలి.


ఈపని చాలా కష్టసాధ్యమైన దనుటలో అతిశయోక్తి లేదు. ఒక్కొక పద్యాన్ని జీర్ణించుకుని దాన్ని తెలుగులోకి దించడానికి రోజులు రోజులు పట్టేది. కడచిన 1960వ సంవత్సరమంతా గాలిబ్ కవితను మననం చేయడంలోనూ, దానికి తెనుగురూపం ఇవ్వడంలోనూ వ్యయించాను. ఆ సంవత్సరమంతా నా హృదయంలో సాక్షాత్కరించి అనుక్షణం నాకు తన హృదయరాహస్యములను బోధపరచిన అమరమూర్తి మిర్జా అసదుల్లాబేక్ గాలిబ్ నా నరనరాలలో జీర్ణించుకుపోయినాడు. ఆయన అమృత హృదయం సర్వదా నా కవితకు క్షుత్తును, గుప్తను, ఆప్తను ప్రసాదిస్తుందని ఆశిస్తున్నాను. భాషాభిమానులెల్లరు నా ఈ కృషిని సావధానంగా పరిశీలింతురుగాక!

దాశరథి

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
10446.

ISRAEL ARCHIVES
JERUSALEM
ACC. NO.
D.[illegible]

ఏను స్వయముగా కవితన్ వరింపలేదు,
తానె వరియించె కైతల రాణి నన్ను.



గాలిబ్ గీతాలు

ప్రతిది సులభమ్మగా సాధ్యపడదు లెమ్మ,
నరుడు నరుడౌట యెంతో దుష్కరము సుమ్మ. 1

వేరులోనుండి కొమ్మలు వెలసినట్లు
అన్నిశబ్దాలు నిశ్శబ్దమందె పుట్టె. 2

స్వీయలోపమ్మ లెరుగుట పెద్ద విద్దె;
లోప మెరిగినవాడె పూర్ణుడగు నరుడు. 3

పత్రమున నగ్నిశిఖ భద్రపరుచవచ్చు,
హృదయమున దుఃఖబాధ భరించలేము. 4

ఈ జగత్తు స్వభావమ్మ నేమియందు!
మంచి చేసిన వానిని ముంచునౌర! 5

నరములం దందరికి రక్త మురుకుగాని
కంట జారని దెట్లు రక్తమగునోయి? 6

అవల వెడలక నిలచిన అశ్రుకణము
పెను తుఫానుగా వెడలి వచ్చినది నేడు. 7

అన్ని రోగములకు నౌషధం బుండియు
ప్రణయరోగమునకు కనము మందు. 8

భిక్షుకునివంటి వేషము వేసినాను;
దాతలగువారి చేతలు చూతు నింక. 9

బ్రతుకుపై నింత విశ్వాస పడెదరేల?
ఏడి మాంధాత? పుడుకుత్సు డేడి నేడు? 10

గ్రీష్మమున వాన కురిసిన నూష్మమెసగు,
అట్లె కన్నీటితో గుండె నగ్ని పెరిగె. 11

సహృదయునకు బయట సన్మానమబ్బును
శు కివిడిన నాటి మా కికమున. 12


మహిత కస్తూరికా పరిమళము లొలుకు
సరస మధుధారకై గదా స్వర్గవాంఛ! 13

సింధువును జేరి బిందువు సింధువగును;
ధ్యేయమునుబట్టి ప్రతిపని దివ్యమగును. 14

చక్రవర్తిచేతి స్వర్ణపాత్రికకన్న
నాదు మట్టిచిప్ప నయము లెమ్ము. 15

నిప్పు నీళ్లలో చల్లార చప్పుడగును,
ఎదియు గతియించునపుడు రోదించుగాదె! 16

సంతసముగోరి మధువాను చవట యెవడు?
లోక మెల్లను మరువ గోరుదును నేను. 17



ప్రేయసిగృహవీథి స్పృహతప్పి పడిపోయి
ముదితకాలిగురుతు ముద్దుగొంటి. 18

బాధ కలిగినపుడు పలవించెదను నేను,
నాది హృదయమోయి, కాదు రాయి! 19

కత్తి చేతలేక కదనమ్ము జరిపెడి
ఇంతి కెవ్వ డసువు లీయకుండు? 20

బ్రతికినన్ని నాళ్ళు వెతలు తప్పవు కదా!
మృతియె వెతలదీర్చు మేటి మందు. 21

వెతల నోర్తుమేని వెత లంతమైపోవు,
సులభమగు నలభ్యములును దాన. 22

ప్రళయ ముండెగాని, తలప నద్ది వియోగ
రాత్రికన్న భీకరమ్ము కాదు. 23

వలపు లేనాడుగాని నిష్ఫలము గావు,
కాయ కాయని వృక్షమ్ము కాదు వలపు. 24

బాధలో నాకు రుచి కనుపట్టగానె
చాన నన్ను బాధించుట మానుకొనెను. 25

నేను నీ వాకిటనె కట్టినాను గృహము,
ఇంకనైన నా యిల్లెటో యెరుగ లేవె ? 26

బిందు వణగారి సింధువై వెలసినట్లు
రుజయు పెంపొంది ఔషధరూప మందు. 27

సఖికి కాన్క సమర్పింపజాల నేను,
ఈయదగు హృదయమె లేకపోయె నాకు. 28

ఆమెసౌందర్యమును చూచినంత తెలిసె
ప్రళయ ఝంఝూప్రభంజనబాధ యేమొ. 29

ఖైదులో నాకు నీ జడమీది చింత,
దానితోగూడ శృంఖలాగ్లాని కొంత. 30

గ్రంథిపడనినాడు కలవయ్యె నఖములు;
గ్రంథిపడెను నేడు, కలచె నఖము ? 31

ఈ యజాండమ్మునందు నశించు నన్ని,
గాలిలో దీపమ ట్లుండెగాదె రవియు ! 32

నీటిచుక్క ముత్తెమూట వర్జించెను,
కనులలోన నిలువగలిగె నిపుడు. 33



గుండె దొంగిలించుకొనిపోయె జంకక,
ముద్దొసంగ వెనుకముందులాడు. 34

చిత్రగుప్తుడు వ్రాసినమాత్ర మనము
పాపు లగుదుము; సాక్షి యెవ్వండు కలడు ? 35

నేను మరణింప నాయింటిలోన దొరికె
ప్రేయసుల చిత్తరువులును, లేఖ; లంతె. 36

డాగె పరదాల పగలు తారాగణమ్ము,
రాత్రి నేసుయ్యెనో దిగంబరమ్ములయ్యె. 37

ప్రేయసీకోపవహ్ని తప్పించుకొనగ
చత్తమన్నను నన్నది చావనీదు. 38

ఎంతకని వ్రాతు నాగుండెవంత ? నింక
ఆమెకున్ జూపెదను రక్తిలాంగుళులను. 39

నీకు నేను గిట్టనియెడ సాకి! నాకు
చనక మీకుము, దోసిట చాలు మధువు. 40

87



నేను మరణింప నామె చింతింపదొడగె,
ఎంత తొందరగా కరుణించె నన్ను ! 41

ఎప్పు డాలించు నామె నా హృదయబాధ ?
అదియు నానోటినుండి యె ప్పవధరించు ? 42

హృదయమందునుండి ఉదరమ్మునకు చేరి
రెంటి కలిపె నీదు కంటిచూపు. 43

వచ్చె నరుణతరుణ వాసంత సమయమ్మున,
గోళ్లు మరల గుండె గోకజొచ్చె. 44

ఏదొ వక్షమ్మునందు బాధింపదొడగె;
హృదయమా ! కాదు, బాణంపుటినుపముక్క. 45

ఏల నన్ను మరచె నెరుగబోయితి; నామె
వలపుచూపు చూచె, భస్మమైతి. 46

భ్రమరరోదన మెట్లు వ్యర్థముగ బోవు?
వెలది పువుగుండె వేయిముక్క లయిపోదె. 47

దుఃఖములు ధీరులకు నొక్కతొట్టిని తగ్గు,
వైద్యతాగ్నితో దుఃఖదీపంబు వెలుగు. 48

ఎచట నీ పదాంకముల నీక్షింతు, నచట
అడవిదారియు నందనమట్లు తోచు. 49

కానుపించుగాని గమ్యమ్మ్ర చిక్కదు;
నేను నడచినట్లు తాను నడచు. 50

ఎంతో ఉత్సాహపడుచు కష్టింతు మూర !
మృతియె లేకున్న రుచి యేది బ్రతుకులోన ? 51


గాలిబా ! నీదు తాత్త్విక కలన యహహా !
త్రాగకుండిన నిను మేము యోగి యనమె ? 52

హింసపడు మాకు బ్రహ్మాండ మెంతో ఇరుకు,
అందు గగన మొక్క పిపీలికాండ మంత. 53

పానశాలయె లేని దేదైన నేమి ?
బడి, మసీదు, సత్తరువు సర్వమ్ము నొకటె. 54

స్వాస్థ్యమెడలిన మందిచ్చువాడు వలదు;
ప్రాణములు పోవ నేడ్చెడివాడు వలదు. 55

కుసుమములు విచ్చె, మొగ్గలుకూడ విరిసె,
తెల్లవారె, నాయమ కన్ను తెరువ లేదు. 56



ద్వారబంధములును తలుపుతాళము లేని,
ఇరుగుపొరుగు లేని ఇల్లు వలయు. 57

మాటలాడువాడు, మందలించెడువాడు
నెవడు లేనియెడ వసింపవలయు. 58

సంతసం బింక నెట్టుల సాధ్యపడును ?
మెదడునను పూలతోటలు, మది నెడారి. 59

ఆమె తోటకు వాహ్యాళి కరిగె నంట,
ఇంక తోటలో పూలు వాంఛించు నెవడు ? 60

ఎవతె అధరచక్రమును భావించినానో
రేయి మదినిండ చుంబన్ర శేణి వెలసె. 61

ఈయెడారిముండ్ల కెడద ముక్కలుచెక్కి
పూలవోలె నిలుపజాలినాడ. 62


మెరుపులో, అగ్నికీలలో దొరుకబోని
అందచందాలు గల ఆ యెయ్యూరి యెవరు ? 63

వత్తునని రాక, నాయింటి వాకిలికిని
నన్నె కాపలాగా నిల్పినా వడేమె ? 64

భ్రుకుటిక్రిందుగ నయనముపోల్కి, గురువ !
ఆలయముపంచలనె పానశాల వలయు. 65

ఎడద నాది లోలోన దహింపజొచ్చె
కప్పుకొనియున్న బూదిలో నిప్పువోలె. 66

అందక త్తెలతో మాటలాడుకొంటకు
చిత్రలేఖనవిద్య నేర్చితిని నేను. 67



గుండెలో సఖిపై నున్న కోర్కి చచ్చె,
కారుచిచ్చంటి సకలమ్ము కాలిపోయె. 68

నా యెడందగూర్చి నా కేమి తెలియదు;
నేను వెదకుచుండ నీకు దొరికె. 69

మచ్చలను మృత్యువే కప్పిపుచ్చుకున్న
అంబరము లెన్ని యున్న దిగంబరుడనె. 70

మల్లియ, గులాబి, చంపకవల్లి పూచె;
రంగు వేరయ్యును వసంతు రాక చెప్పె. 71

హరిని ప్రార్థింప తలవంచినట్లుగానె
బాగ ప్రాగి ప్రొక్కము మధుభాండమునకు. 72

ఎంత విహగపూచెనే తోట! శుకపికా
లెగురునపుడు పూల తగిలె కాళ్లు. 73

మంచుకొఱకు తిరిగి మరి హెచ్చె నా బాధ
కాళ్లుగూడ నెత్రు గ్రక్కజొచ్చె. 74

పరుగు లెత్తియెత్తి పట్టుబడితి నేను
బందిపోటుదొంగ పదములొత్త. 75

ఆమెపాదతీర్థ మానగోరితిగాని
కాళ్లు నేలమీద కడిగె నామె. 76

అశ్రుధారావివర్ణ నేత్రాంచలములు
కాంతిలగ గుండెకోసి రక్తమ్ము నిడుదు. 77



ఎవని ఇలు కాదు, వాకిలియేని కాదు,
దారిలో కూరుచుంటి, వద్దనెద రేల? 78

పగలు దోయగాబడ, రాత్రి పట్టె నిద్ర,
నన్ను దోచిన దొంగకు నతులొనర్తు. 79

మబ్బువచ్చి నాదు మడిని పండింపగా
మెరుపువచ్చి దాని మ్రింగజొచ్చె. 80

శస్త్రవైద్య కత్తిసైతము రక్తాశ్రి
కణము లొలికె, నీవు కరుగవేమె? 81

నాదు గుండెగాయము కుట్టు సూదికంట
అశ్రుజలధార దారమై అవతరించె. 82

నేను తోటలో కాలూనినానో లేదో
కోకిలాబృందములు కావ్యగోష్ఠి జరిపె. 83

భానుసోమాదులకు తీసిపోని నాదు
నేత్రముల నీ పదా లంటనీయ వేమె? 84

నీ పదమ్ముల చుంబింపనీయవేమె?
గగనములతోడ సమమైన కానె నేను? 85

నన్ను తోటకు గొంపోకు, నన్ను జూచి
పూలకన్నులు రక్తాశ్రువులను సించు. 86

పానసమయాన ఎదవిచ్చి పలుక వేని
ఏను త్రాగినమిషను కవ్వింతు నిన్ను. 87

వెలది! నీ పరిణయాకృతి కొలుతునేని
ప్రళయబీభత్సమే ఒక నిలువు చిన్న. 88

ముదిమివలన వలపుపొలికేక లిడ్డైతి,
ఈ వసంతమెల్ల ఇక్లై గడచె. 89

నీదు రోగినిగూర్చి చింతించినారు
కాగితమ్మున మందులు కట్టువారు. 90


గాలిబా! త్రాగనని శపథాలు సేతు
గాని నీ ఒట్టుపై నమ్మకమ్ము పోయె. 91

నా విరహబాధ నేమందు! నాతిమొగము
లేల భావింతు, పొద్దటివేళ కురుల. 92

మనిషి ఏకాకియైనను మనసులోన
గుంపులుగ భావములు చేరి గోష్ఠిజరుపు. 93

ఏల కాళ్లు నొచ్చె బాలామణికి? రాత్రి
ఎవని స్వప్నసీమ కేగివచ్చె? 94





ఆమె ముద్దిచ్చుటకు వెనుకాడదేమొ!
కాని ఇమ్మని అడుగగా లేను నేను. 95

కోమలీ రాగరంజితాంగులికవోలె
ప్రీతికుసుమముకుళమ్ము కన్పట్టదొడగె. 96

వ్రీడతో మఱ్ఱివే పురి వీడిపోయె,
నన్ననుకరించి చెడిపోవకున్నె వాడు! 97

ఎన్నొ గాయమ్ము లెదనున్న నేమిపలుక,
ఏకవ్రణమునకే పువ్వు కేక పెట్టె. 98

ఇంత శ్రమపడి రం గద్దెదేల గోళ్ల?
రం గధికమైనయెడల జ్వాలలు రగిల్చు. 99

ప్రేమభిక్షుకునిన్ హింసపెట్టు టరయ
ప్రణయసౌందర్య రాజ్ఞికి పాడిగాదు. 100

వలపు వలన బ్రతుకు బహురుచ్యమైనది
ఎడద తీయదనము బడయసాగె;
బాధ కౌషధమ్ము బడసియు డెందంబు
మందులేని బాధ నందె మరల.

ఇంట నుండంగ ననుమతినిచ్చి తీవు;
చుట్టియుండిన నాసెజ్జ నట్టె విచ్చి
పరచితినో లేదో శయనించుకొరకు నేను,
అంతలో 'వద్దు వద్దు పో' మ్మందువేమె! 101


ఆమె నూర్వశితో పోల్చినంత, సుంత
కోపగింపక తా నూరకొనెనుగాని
కినుక బూనిన నాతప్పె యనును జగము,
ఆమె యెక్కడ! ఊర్వశి యనగ నేడ? 102

నాయెడద చీల్చి రక్తమండలము సేసె,
నేను వేదనతో మరణించినాను,
ఇపుడు గోళ్లకు నెరుపురం గెట్టు లెక్కి
వెలది తాను గోరంటాకు పెట్టుకున్న? 103

నాకొఱకు నీవు వత్తువన్నయది నిజము,
జాగుసేయవటన్నది సత్యమగును,
అసలు నా వార్త నీ కందునంతలోన
మట్టిలో నేను కలిసెడి మాట నిజము. 104

కాలమే నాకు తగు నవకాశ మిడిన
చేసిచూపుదు నెన్నెన్నొ చిత్రములను,
మనసులో గల ఒక్కొక్క మచ్చ నాది
బీజమగు దివ్యదీపికావృక్షమునకు. 105

పొలతినయనపక్ష్మములను వలచితినని
కోపమున జనుల్ ద్వేషెత్తి చూపినారు,
వారి ప్రతిద్వేలు బాణమై వచ్చి తాకి
అంతరాంతరములయందు వ్యథనుకూర్చు. 106



మాటిమాటికి గిన్నెల మధువు పోసి
మధువునే బాధపెట్టెడి విధ మదేల?
దేవి! మధుపూర్ణ భాండమే తెచ్చి నాదు
నోటి కందీయరాదె, సంతోషపడెద. 107

స్వర్గమున తేనెధారల బడయగోరి
వసుధపై సురాపానమ్ము వదలె దేల?
ఈగ లెన్నెన్ని యో ఎంగిలించినట్టి
తేనె గా దిది, దివ్యమాధ్వీక మోయి! 108

వలపువలన నీవు వలవల నేడ్చిన
నా శిరమ్ము ఛేదనమ్మ్మునందె,
ఖడ్గధార పదనుగలిగినట్లుగ నశ్రు
ధారవలన పదనువారె కనులు. 109

స్వప్నమందు తాను వచ్చి న న్నోదార్చి
శాంతపరచెనేని చాలు నాకు,
కాని దుఃఖవహ్ని కాసంత నిద్దుర
పట్టనీదు, స్వప్న మెట్టు లబ్బు? 110

నిన్ను ప్రేమించు టూటనుకొన్న దేమొ
నా యెడద, ఇప్పు డిటు వలపోయదొడగె,
ఇట్లు వలవంతపా లొనరించినట్టి
యెడద నేరీతి శిక్షింపదొడగవలయు? 111

ధనము మూల్గుచుండె ధరణిపై నిండుగా
దానవీరు డెవడు తనరబోక,
పానశాలలోన పాత్రలు మధువుతో
తొణకుచుండె ప్రాభవు మనిషి లేక. 112

నీవు ప్రేమతో వచ్చుట పూవుతోట
కెంత యో సంతసమ్ము కల్గించె ననగ
చేయిసాచి నిన్ కౌగిట చేర్చగోరి
మొగ్గలన్నియు వికసించ మొదలుపెట్టె. 113

ప్రాయ మేమి లేకపోయియు నీ పేరు
చేర్చి ప్రాతు నొక్క- చిన్ని లేఖ,
నీదు పేరు వలచి నిలచియున్నాడను
కాంక్షలూరు వలపుకాడ నేను. 114

వీణతీగ తాకెదేని జుంజుమ్మని
రాగములు పరంపరలుగ వెడలు,
అట్లె నను కదల్చినట్లైన నీవైన
నెన్నొ నేరములను విన్నవింతు. 115

తరుణిచేతి అంబు తగులునట్లుగ నిల్చి
గాయపడగ కోర్కి కలదు నాకు;
అంబు తగుల కేగ, అద్దాని కొనితెచ్చి
తరుణి కిత్తు మరల తాను వేయ. 116

—o—



కాళ్ళ బొబ్బలెత్తి కడు మెల్లగా సాగు
బాటసారివోలె పరగినట్టి
తారకాగణమ్ము త్వరగా చరింపదు
పరిణయదీర్ఘ మార్గవర్తియగుచు. 117

నే నొసంగిన లేఖ సందేశహరుడు
తీసుకొనిపోయి ఆమె కందిచ్చుకన్న
ముందె నే నామెయింటికి పోయినాడ!
మెచ్చుకొనుడు మీరెల్ల నా పిచ్చి నిపుడు. 118

అందకత్తెల సాహచర్యమ్మునందు
కొద్దినాళ్ళులు గడపినగూడ చాలు,
ఘోరనిస్సార సంసార కుండమందు
ఎన్నొ యుగములు జీవించు కేమిమేలు! 119

పిచ్చివాడ నేను, చచ్చిపోయిన గూడ
నా సమాధివీద దోస మనక
పిల్లవాండ్రు విసరివేసినా రెన్నెన్నొ
బండరాళ్లు పూలచెండులట్లు. 120

శివుని వెదుకబోతి, చిక్కలే దాతడు,
వటిచేతు లూని వతునేని
జనులు నవ్వగలరుగనుక నే రా నింక,
తిరిగిరాక యెటకొ అరుగగలను. 121

వనిత! నీవు భువిని వర్తిల్లుచుండగా
ఇంక నాకలోక మేల నాకు?
పోకతప్పదేని నాకలోకానకు,
నీవుగూడ వేగ రావలయును. 122

వన్ను హత్యజేసి నా సమాధిని నీదు
వీధిగట్టబోకు ప్రియ లతాంగి !
నా సమాధిబట్టి నలుగురు నీ యిల్లు
తెలిసికొనుట నోర్వగలనె నేను? 123

నాకు నీదు దర్శనమ్మైన యంతనే
మత్తుక్రమ్మి చూడ మరచినాను,
కానబడియుగూడ కనరాకపోతివి,
నాదు చూపు చెదరె నాల్గుదెసల. 124

నేను 'మజ్ను' వట్లు నీకు నాప్రణయమ్ము
బయలుపరచజాలువాడ, కాని
గుండెలోన డాగి మండించు నా బాధ
వ్యవధి నిడదు ప్రేమ బయలుపరుప. 125

రెక్క లూడిపోయె భృంగమ్మునకు నేడు
విశ్రమించుకొరకు వేళచిక్కె,
ఇంక పూలగూర్చి ఏమాత్రమైనను
కోర్క గలుగు వీలుగూడ లేదు. 126

ఆకురాలు కాల మైననేమి? వసంత
మరుగుదెంచినంత నొరుగునేమి ?
నాదు చిన్నగూడు, నా జీవితపు గోడు
నా విషాదగాథ నాదె కాదె! 127

ఆమె పల్లకిలో నెక్క అరిగె నాదు
వీధివెంబడి పడి కడు వేగమునను,
పల్లకిని మోయు బోయీలు బడువువలన
బుజము మార్చగా గోర నొప్పుకొనకుండ. 128

మనసులోని రహస్యాలు మరుగుపఱుప
నోరు మెదుపక కూర్చుండనోపుగాని,
నేను మాట్లాడియును దాచినాను వాని,
ఎవ్వరును వాని అర్థాల నెఱుగ లేరు. 129

చల్లచల్లని పూర్ణిమాశర్వరులను
ఎంత మధువు లభించిన నంతగ్రోల,
శ్లేష్మతత్వమ్ము గల్గు శరీరమందు
వెచ్చదనము మరింతగా వచ్చుగాదె! 130

మన రహస్య మొరులు కనినంతనే యెంతో
సిగ్గుజెంది ఆలసించ కేగి
మట్టిలోన డాగినట్టి నీ అభిమాన
మగు ననన్యసాధ్య మమృతవాణి! 131

వెలుగుచున్న దివ్వె మలిపివేసినయంత
కానుపించు నల్లనైన మచ్చ,
అట్లె పూర్తికాని అభిలాషముల మచ్చ
గుండెలోన కూరుచుండె నాకు. 132

గాలిబా! ఆమెతో చెప్పగలము నీదు
వ్యథనుగూరిచి, నీగుండెవంతగూర్చి,
కాని అంతమాత్రమున తా కనికరించి
చేరవచ్చు నటన్నది చెప్పలేము. 133

ఆదిమానవు డమరాలయమ్ము విడచి
వెడలిపోయిన గాథలు వింటిగాని
ఎంతో అవమానమంది నీయింటినుండి
ఎడద దురపిల్లగా నేనె ఏగుచుంటి. 134



కోపమనెడు కత్తి కున్న పదను జూచి
మురిసిపోయె దేల, ముదిత! నీవు?
నా విషాద మనెడు నదిలోన నొక చిన్ని
నెత్తురొలగవోలె నెగడు నద్ది. 135

సఖిసమాగమ వాంఛయు, సఖివియోగ
బాధయు మదీయహృదయాన ప్రజ్వరిల్లు,
నాతితో నాదు వాంఛయు, నాదు బాధ
చెప్పుకొనగల్గు రోజు వచ్చినను చాలు. 136

పాడువడినయింట పచ్చిక మొలిచెను
వచ్చె నవవసంతవాసరమ్ము,
ఇంక శైశిరమ్మె యేతెంచినప్పుడు
ఇంటి అందచంద మెట్టులుండు? 137

ఆమె తన గర్వమును వీడనపుడు నేను
ఆత్మగౌరవ మేల పోనాడవలయు?
నేను తలవంచి, నమ్రత బూని, పోయి
"అంత తలబిరు సే"లని అడుగు టేల? 138

కఠినశిలవంటి హృదయము గలుగుదాన!
తల పగులకొట్టుకొనుటయే వలపులైన,
నీ గృహద్వారబంధసన్నిహశిలనె
తల పగులగొట్టికొనియెడి తలపు లేల? 139


వల తగిలియున్న నాకు నాఇలునుగూర్చి
చెప్ప వెరచెద వేలనే చిన్నపక్షి!
వనములో నిన్న పడిన ప్రభంజనమ్మె
నా కులాయముపై పడె ననుట యెట్లు? 140


ఆమె తననుగూర్చి అతిగర్వపడుచుండు
కాన పిలువబోదు తాను నన్ను,
నేను స్వాభిమాననిరతుడ గావున
పిలువకుండ పోను; కలియు టెట్లు? 141

ప్రణయినీ ముఖప్రభారసమును గ్రోలి
పడిరి మత్తుజెంది పానపరులు,
మధుగృహమ్మ్మలోన మత్తు కల్గించెడి
దేమి లేదు మచ్చు కేనిగూడ. 142

కాలమేల నన్ను కడునిర్దయత్వాన
చెరిపివేయు, భక్తవరద! నేడు?
పుడమిపలకమీద పొడమిన అధికాక్ష
రమును గాను నేను రాచివేయ. 143

అద్దమందు నిన్నె అవలోకనముసేసి
ఈర్ష్య చెందుచుంటి వేమె, సుదతి!
నిన్నువంటి అంద మున్నవా రింకొక
రుండిరేని యెంత మండిపడెదొ? 144





దివ్వె వెలుగగోరుదురు రాత్రి జనులెల్ల,
దానియంతట నదె దగ్ధమైన నేమి
సేయజాలుదు? రక్షించు నా చింత నన్నె
చంపగా మిత్రు లేమి గావింపగలరు? 145

వెలది! స్వర్గము నీగృహవీథివోలె
అందచందాలతో నుండు ననుట నిజము
కాని నీవీథిలోపల కానుపించు
నంతమంది స్వర్గమ్ములోనైన లేరు. 146

త్రోవబోయెడి నూత్న పాంథుడను నేను,
పరుగులిడు ప్రతివానితో నురుకజూతు–
మార్గదర్శకు డెవ్వడో, మార్గ మేదొ
యెరుగగా లేదు నే నింతవరకుగూడ. 147

అదిగొ! ఆమెగూడ అనసాగినది నన్ను
'సిగ్గువిడిచె' నంచు, 'చెనటి' యనుచు;
ఇద్ది తెలిసియున్న ఇంతగా నాయిల్లు
గుల్లగుల్ల చేసికొనకపోదు. 148

ఉదర మేడిపించు, హృదయమ్ము నొప్పించు
నెంతకని రుదింతు, నేమిసేతు?
వీలుపడినయెడల వెలయిచ్చి పిలిపించి
ఏడ్చువారల నియమించదలతు. 149

తరలి సందేశహరి ఉత్తరము తెచ్చు
వరకు వేరొక లేఖను వ్రాసియుంతు,
ఏలయన, నాకు తెలియును బాల యెట్టి
పాటి ప్రశ్నోత్తరమ్మును పంపగలదొ. 150

ఆమెఱుంగరాలఅలకలు వలపన్ని
నన్ను ఉచ్చుపెట్టనున్నవోయి!
దైవమా! మదీయజీవితస్వాతంత్ర్య
వైభవమ్ము భంగపడగనీకు. 151

వానచినుకుల మ్రింగగా వాగులోని
పరితిరంగము మొసలిపై వాయి విచ్చె,
శుక్తిలో జేరి చినుకులు మౌక్తికమ్ము
లగుట కెన్నో యూటంకము లావహించు. 152

వలను పన్నువాండ్రపై వలపూనితి
కనుక ఎగిరిపోవగలిగిగూడ
వలను చిక్కినాను, బంధింపబడినాను,
బందివోలె నెంతో కుందినాను. 153

'వలపుపిచ్చి' యనెడు పానశాలావిశా
లతనుగూర్చి పరిశ్న లడుగబోకు,
దానితోడ పోల్చ ధారాధరపథంబు
చెత్త పారవైచు చిన్నిబుట్ట. 154

నా డెపుడో పోయినట్టి ధనమ్ము తలచి
గర్వమును చెందెడు దరిద్రు కరణిగానె
నాడె మానిన ప్రణయవ్రణములపూర్వ
రక్తిలత్వమ్ము నెంచి గర్వపడువాడ. 155

ఎన్ని విధముల సౌఖ్యము లున్న గూడ
వలపు వెట్టిని తగ్గింపగలుగవయ్యె,
పానపాత్రకై గల నీలవర్ణ మణులు
చిరుతపులిమచ్చలట్లు భీకరములయ్యె. 156

సాంధ్యకాలరక్తారుణచ్ఛటల గాంచ
నీ వియోగాన కుమిలి చింతించు నాకు
పూలతోటలసైతము ముమ్మరముగ
వహ్ని కురియుట జ్ఞప్తికివచ్చె సుదతి! 157

ప్రణయినీ రాగరంజితపదయుగమ్ము
ముద్దుగొను కోర్కి తీరకపోయెగనుక
ప్రియు సమాధిసమీప ధరిత్రినిండ
చిక్కచిక్కగా మైదాకుచెట్లు పెరిగె. 158

నాకమందు నరకలోకమ్ము కలుపుకో
వలవ దేలనోయి, భక్తపాల!
వాంఛ కలిగినపుడు వాహ్యాళి సేయగా
మరియు కొంత-చోటు పెరుగుగాదె! 159

బాధితులకు న్యాయము కూర్చ, బాధకులకు
శిక్షనిడుటకు శాసనరక్ష కలదు,
కాని కత్తిని పట్టకే కనులతోనె
హత్యయొనరించుదాసి కేఅడ్డు లేదు. 160



లాగివిడిచిన బాణంబులాగు నడచు
పడతియెదలోన స్థాన మేర్పఱచుకొనుము.



మునుపు పూదోటలన్నచో మురిసిపోతి,
పూలవాసన కూపిరిపోవు నేడు. 161

దరులు నదినీరు గోరినకరణి, సాకి!
ఎంత తాగింతు, వంత వాంఛింతు మధువు. 162

ఆమె రానుండె నను వార్త అందె నిపుడె,
నాకు నే డింట చాపైన లేకపోయె. 163

హృదయ మపహరించి కదలిపోయిన దామె
ప్రణయరీతి ఇట్టిపాటిదేమొ! 164

హింస భరియించు శక్తి నార్జించె మనసు,
ఇంక నా కూపిరాలి వరింతు నేను. 165

రెక్కలను సాచి ఈ కోన నక్కయుంటి,
నెంత బాగు పంజరపున్ తల్పు లిపుడు విడిన! 166

వెళ్ళువరకె ద్వారము విచ్చిపెట్టరాదు,
పిలువగనె ఆమె తలుపులు విచ్చవలయు. 167

ఎడదమచ్చయె బాగున్న దింతవరకు,
ఇపుడు వ్రణమె మచ్చను మించి హృద్యమయ్యె. 168

ఈ వపాంగ బాణములు వర్జించి తెపుడు?
వలపుబాకును మొలనుండి దులిపి తెపుడు? 169

దారి తెలియని ఈ మార్గదర్శి మనకు
దొరికినాడింక మన కేమి కొరత లేదు! 170

మృత్యు వేతెంచినపు డామెలేఖ వచ్చె,
చదువకయె వటుమున నుంచి చచ్చినాను. 171

ఎవరు గాలిబుతో కలహింపవలదు,
యోగి యాతడు లోలోన, రాగి పైన. 172

దుఃఖవిషము నా ప్రాణాలు తోడివేసె,
నీవు నను చంపితి వటంచు నింద యేల? 173

విరహమే నా బ్రతుకు భంగపరచినప్పుడు,
మరల త్యాగిన వచ్చెడి కొరత యేమి! 174

పడవనెక్కించవచ్చినవా రెరుగరు
పడవలో నాకు కలిగిన బాధలెల్ల. 175

ఒంటిగా కాశి కేగలేనోయి, గురువ!
యాత్రికులవెంట కష్టాల ననుభవింతు. 176

'సాకి' కనులు లేవు, చషకధ్వనులు లేవు,
గోష్ఠి దిరిగె గగనగోళమెల్ల. 177

వేదనమ్మువలన చేదైన నాల్కకు
ఆమెతీపిముద్దు లందుగాక ! 178

వదలిపోయిన సఖులకై వంతవలన
గుండెనెల్ల సదా దుమ్ముకొట్టుకొనును. 179

తిరబోవని కోర్కెల భార మిట్లు
మోతు, నేయభాగ్యుని మోముగీతనేమొ? 180

ఊహలో నున్న దానికై ఉబ్బిపోదు,
మధువు నూహించి పాడెడి మధుపమట్లు. 181

ఆర్ద్రతాబంధురంబైన అలరుతోట
అలరులే రాతిగోడలై అవతరించె. 182

వేటగాని వలన్ జిక్కి పిట్ట యొకటి,
వలయె దానికి తన గూటిభ్రాంతి తోచె. 183

ఆమె ఒరులింట దివ్వెయై అలరినంత
శోకగృహదీపమై నేను క్రుక్కినాను. 184

పూలు ముకోకపినరుల ముఖాలవోలె
ఎట్టబడిపోవు, నంతలో కట్టియగును. 185

ప్రతియొకం డేదియో కోరువాడెగాన
వేటగాని నిందించుట వెట్టిగాదె! 186


గాజునే కోయు మద్యముకరణిగానె
గుండెనే కోయు వేదన కూడె నాకు. 187

నాశమే విశ్వమునకు పునాదియగును,
కాని వలపునకును సమగ్రత పునాది. 188

నాల్గు నిశ్వాసములు వీడి నీల్గునట్టి
నరుని అతిశయమును చూచి నవ్వె పువ్వు. 198

కాంక్షలన్నియు మృగతృష్ణికాతరంగ
ము లగుగావున యేల నిష్ఫలత కేడ్పు? 190

హృదయదీపమ్ము మలిగిపోయినదిగాన
పొగ విసీలాంబరము కట్టి పొగులజొచ్చె. 191





పికము శిశిరు నెంచె వసంతవేళలందు
కాన ప్రతిపువ్వు జ్వాలయై కాల్చదొడగె. 192

గుండియ వియోగవహ్నితో మండిపోయె,
కాని సంయోగవాంఛను మానలేదు. 193

ఓయి దుఃఖనిశ్శ్వాసమా! ఈ యెడంద
కన్న చిక్కు-సమస్య లోకమున లేదు. 194

వెతల మైదానమున వేరు గతియె లేదు
బాష్పవారిధారాసిక్తపథముగాక. 195

వెతల కుందెడువాడు నవ్వినవిధాన
పైన సంతోషమును, లోన బాధ నాకు. 196

ఖైదులో గూడుకట్టెడి ఖగము నేను
ప్రణయరంగాన సఫలత బడయు టెట్లు? 197

మృతినొరుంగని ఱింటి దేవతలకన్న
నలుగురికి మేలుచేసెడి నరుడె మిన్న. 198

ఆమె కనులకు రక్తదాహమ్మ్ము కలదు,
నా కనుల నుండె రక్తాశ్రు శీకరములు. 199

నన్ను కవ్వించబోకు, నా కన్నులందు
అశ్రుఝంఝూమరుత్ సమూహములు కలవు. 200

మరల నలనాటి విశ్రాంతి దొరికెనేని
ప్రేయసీరమ్యమూర్తి భావించగలను. 201



అన్ని బంధాల విదలించినట్టి యెడద
కురుల ఉరులందునన్ చిక్కుకొనెను చెలియ! 202

మధువు గ్రోలి రాగిల్లెడి వధువుమోము
చూడగోరె నా వెచ్చని చూపు లిపుడు. 203

గాలిబు నెరుంగ రెవరు లోకమ్మునందు?
మంచి కవియైన అతని నిందించు జగము. 204

మధువు తగినంత లేదను మాట వినిన
క్రుంగిపోయెడి నిరుపేదగుండె నాది. 205

ఆమె కాతిథ్య మొసగి యేండ్లయ్యె, నింక
గోష్ఠిలో మధుదీపాలు కులికిగూడ. 206

స్వర్గమం దమృతము గూర్చి పలుకు గురువ!
నీవు కొనబోవు, మాకు నందింప లేవు. 207

చేసినట్టి పాపములకు శిక్షయున్న
పాపములు చేయనందుకు వలయు రక్ష. 208

మతగురువు నిన్ను నిందింప మథనపడకు,
అందరికిగూడ మంచివా డగు నెవండు? 209

వత్తునని మాటనిచ్చె నా వలపురాణి,
ఎదురుచూచెద రాకపోయిననుగాని. 210

వ్రాయునపుడు సిరా యొలికిపడినయట్లు
విరహినిశలు నాబ్రతుకున మరకలిడెను. 211

అభిమతము తీర్చుకొనుటె ధ్యేయమ్మ్మకాదు,
వివిధవాంఛ లొనర్చెడి వింత చూతు. 212

ఒక్క కోర్కెకై ప్రాణము లొడ్డబోవ
ఎన్నొ కోర్కెలు తీరకయున్న వింక. 213

హంత నా నెత్తు గని భయమందు కేల?
రక్తబాష్ప మూటలువారె బ్రతుకునిండ. 214

ఎవరి కడ కేగి నావెతల్ చెవులవేతు?
నన్ను మించిన బాధల నున్నవారు. 215

పరిణయమున చావు, బ్రతుకు సర్వమ్ము నొకటె,
ఎవరికై చావగలనొ, జీవించగలను. 216

పానశాల యేడ? భక్తుని ఇల్లేడ?
నేను వెడలుచుండ తాను చొచ్చె. 217

కుదులు విచ్చి కొలిచికొనుము, నీకన్నను
పొడవు లెమ్ము; గర్వపడకు చెలియ! 218

విరుల తోటపైని పెనుకోర్కి లే, ద్రైన
నిది వసంతవేళ, ఏగి వత్తు. 219

ఎడదగాయము నోర్విచ్చె నేని నాకు
చెలియ! నీముందు నోర్విచ్చ చేతనగును. 220

బాధ భరియించలేక బాష్పజల మోడ్చి
దాన తానమాడితి, పవిత్రితను గంటి. 221

నీదు కనుచూపు కత్తిగానీ ఎడంద
జొచ్చినపుడు మిత్రమువోలె చూచికొందు. 222

ప్రియకు నే గిట్టకున్నను ప్రియమె నాకు
ఆయమయొయారమును గన హర్ష మొదవు. 223

ఎడదలోనుండి వెడలిన, వెడలకున్న
క్రాలు నీ బాణసునిశితాగ్రమె ప్రియమ్ము. 224

నాయెదుట పానపాత్ర యున్నయెడ నింక
యెట్టి వాగ్ధాటి వెడలునో యెరుగుడోయి! 225

నీవు నేనున్న నెంత చింతించినావొ,
నీవు లేకున్న నంత చింతించినాను. 226

కుతల మిది, పిల్లవాం డ్రాడుకొనెడు చోటు
ఎవో చమత్కారములు చూతు పవలు రేలు. 227

ఆననము చూపకుండిన మానె చాన!
ముసుగు తీసి కుపితనేత్రములనె చూపు! 228

ఏదొమిషతోడ న న్నెవ్వరేని ఆమె
కడకు చేర్చిన నాయమ కరగునేమొ? 229

ఎంత దుష్టురాలవే? నిరాశాదేవి!
హృదయరాజ్ఞి నె మరపింపజూతు. 230

ఎంత దగ్గర కేగిన నంత దూర
మేగు నాయమ, నా వల పిటి డ్రార!
ట 231

ఆమె కోపన, నా కథ అధికదీర్ఘ,
మద్ది వినిపింప సందేశహరుడె జడియు. 232

కరుణ గలిగియు తన పూర్వ సరణి దలచి
సిగ్గుతో తాను వెనుకకు తగ్గజొచ్చె. 233

దుఃఖవిష మింక గళమునే దూర లేదు,
నరములను జేరినపు డెంత నరకమగునొ: 234

హృదయమా! ఆమెజడముడి నొదిగియుండు,
మెంత బాధ కల్గినను భరింపు మోయి! 235

ఇతరులు త్వదీయచషకము నెంగిలింప
పెదవులార నీ పిల్పు కే నెదురుచూతు. 236

ఇంతి దారికివచ్చెడిదేమొ తుదకు
నీవు తొందరపడి చనిపోవకున్న ! 237

ఇంత దుఃఖమ్ము సైపనా కేకహృదయ
మేల? ఒక పది ఇవ్వవై తేమి? దేవ! 238

ఒడలు కాలిపోయె, నెడద భస్మమ్మాయె,
నింక బూది వెదకె దేల నీవు? 239

నను వదలి పొగవలె నేగె నాదు నీడ,
గుండెలో నగ్గి గలవాని గోరు నేది? 240

తరుణిదీర్ఘ కేశములు సౌందర్యఖనులు
వెలసినవి నేడు నన్నుఱిపెట్టుకొరకు. 241

నాకు వైఫల్యమున రుచి రేకులెత్తు,
కాన కోర్కెలు పెంచి దుఃఖాన పడుదు. 242

కలలలో నామె నాస్థితి తెలియ వచ్చు,
కనుక ప్రత్యక్షముగ నడుగంగరాదు. 243

ఏదో అడిగెద నామె నున్నాదివోలె,
ఆమె ఉత్తరమీయ నే నాలకింప. 244

ఆమె దారిబోవుచు నాదు సేమ మడుగు,
నేమి చెప్పుదు దారిలో నింక నేను? 245

నా సమస్త మెరింగియున్నయటు లామె
మోసగించు, నింకేమి చెప్పుదును నేను? 246

నవవసంతము వచ్చి యువతినే తలపించు
పువు జూచి ఆమెమోముగ నెంచి చింతింతు. 247

'అస్తి' యని దగాచెందకుమయ్య! నీవు
వసుధపై నెంచిచూడ సర్వమ్ము 'నాస్తి'. 248

మొరపెట్టుకొనుటకై స్వరతాళములు లేవు
కన్నీటిపాటలో గణయతులు కనరావు. 249

ప్రణయ మనగ అగ్నివంటి; దంటించిన
నంట, దార్పినంత నారబోదు. 250

ఎంత కోమలాంగి ఇంతి, చేజిక్కియు
తాకదలచినంత తాకనీదు. 251

హృదయమా! ఆమె యెంత పిల్చినను రాదు,
రాకతప్పని స్థితి కల్గుగాక తనకు! 252


ఎంత దుఃఖించినను విమర్శించు నామె
కానిపని ఏమిచేసిన కానె కాదు. 253

చావగోరెడువానికి చావురాని
ఘోరదుర్గతి నిక చూచితీరవలయు. 254

ఎంతయిన సుందరులను ప్రేమించవలయు,
ఇటులె వారును వలచ నింకేమి వలయు? 255

మానిపోయెడి గాయము మాకు వలదు,
శత్రువున కది యొసగుము స్వామి! నేడె. 256

జ్వాలయే దీపమునకు సర్వస్వమట్లు
పరిణయమే జీవితంపు సర్వస్వ మయ్యె. 257



ప్రణయ మిట్లు వన్ను భ్రష్టుజేసెనుగాని
పనికివచ్చునట్టి మనిషి నేను. 258

పీడవో, పిశాచమవో, దుర్విధివొగాని
నీవు నాదానవైతివేని అదె చాలు. 259

ఏదో అలజడి యున్న నే ఇంటిశోభ
పెండ్లిగాకున్న, దుఃఖపువేళ నైన. 260

గిన్నె నందించువారు లేకున్నయపుడు
కుండనే నోటి కానించుకొనుట మేలు. 261

స్వర్గమునుగూర్చి నాకు సర్వమ్ము తెలియు,
మనసు సంతసపడుటకు మంచి ఊహ. 262


ఆమె గనినంత నా మొగ మందగించె,
రోగి భాగయ్యె ననుగొనసాగె నామె. 263

ముద్దొసంగబోదు పొలతి, నా హృదయమ్ము
నుచితముగ గ్రహింప మూహసేయు. 264

చెప్పనిమ్ము నాదు చింతనుగూరిచి
నీకు కొంత చింత సోకునట్లు. 265

నిన్ను నిందించు జంత్రమట్లున్న నన్ను
నీవు కవ్వింతువేని ధ్వనింపగలను. 266

రాత్రిగోష్ఠిలోన రాగిల్లిన జగమ్ము
తెల్లవారగానె నల్లవారె. 267



నీదు నింపుచూపునే కోరి వేచితి,
కాంతు వేమిటె అరకంట నన్ను! 268

విరహగాఢాంధకారబంధుర గృహాన
మలిగిపోయిన ఒక దివ్వె కలదు నాకు. 269

ఇతరులను బాధపెట్టుట హితము కాదు,
కాన నావ్యథ శత్రువుకైన వలదు. 270

పిన్నతనమున నాకథ వినని ఆమె
యీవనమున నాకథ లెట్లు లాలకించు? 271

ప్రణయబాధితులనుగూర్చి పలుక వశమె?
పాదములనుండి తలదాక బాధ యొప్పు. 272

గూటివద్ద వలను నాకై కిరాతుండు
ఎగురబోయి వలను తగులుకొంటి. 273

నీ పరధ్యాన మేదో ఘనిష్ఠమైన
ప్రణయరాహస్యమును బయల్పరచుచుండె. 274

మరల క్రూరరాలికొరకు నే పలవింతు
మరల బ్రతుకు దుఃఖభరిత మయ్యె. 275

గుడిని శివుడు దొరుకకున్న కాశికిగాని
పరువులెత్తి నేను బడయగలను. 276

కరుణ యెరుగనట్టి కామినీమణినుండి
కరుణ కోరుచుంటిగాదె నేను! 277

పిచ్చిహృదయమ! నీ కేమి వచ్చెనోయి!
అసలు నీబాధ కెయ్యది ఔషధమ్మ్ము? 278

ఎచటనుండి వచ్చె నీపూలు, ఫలములు?
కారుమబ్బులేమి? గాడ్పులేమి? 279

ఆమెయనిన నాకు నధికానురాగమ్మ్ము,
ఏనటన్న ఆమె కెంతో విసుగు. 280

దైవమా! నీవు కోరని వేవి లేవు,
లోకమున మరి ఇట్టి కల్లోల మేల? 281

మొదట నాపయి నాకె న వ్వాదవెగాని
ఇప్పు డెద్దానగూడ న వ్వేమి రాదు. 282

నాకు విధిలేక మూగినై నానుగాని
లేనిచో నేను మాటాడలేని దేది? 283

నన్ను గూర్చి వార్త నాకె అందనిచోట
నేనె వాసముండినాను నేడు. 284

ఇపుడు కాశి కెట్లు లేగెద ఓకవీ!
నీకు సుంత సిగ్గు లేకపోయె. 285

అన్ని బాధలు నేటితో అంతమొందె,
ఇక అకస్మాన్మరణబాధ ఒకటె మిగిలె. 286

ఇంక బ్రతుకవలసెనేని వేరువిధాన
బ్రతుకునట్టి రీతి వెతుకువాడ. 287

ఏది యమునింటి అగ్గిలో ఇంత వేడి?
కనపడక కాల్చు వేదనాంగార మిద్ది. 288

ఈవు తెచ్చిఇత్తువేని గోజటికన్న
అధికముగనె మధువు నారగింతు. 289

కాముకుండుగూడ ప్రేమమ్ము నటియించె,
ప్రేమజీవి కింక విలువ లేదు. 290

పిచ్చివాని నన్ను వేధింతు వేలనే,
కొనకు నీవె వంతగొనద ఓసి! 291

ఉవిదగోష్ఠిలో నే నుండకుంట మేలు,
నన్ను గూర్చిన ప్రస్తావనమ్మె చాలు. 292

నాకు నిష్కామకర్మ యెంతయు ప్రియమ్మో,
కాని నైరాశ్య మలమి నన్ కలతపరచు. 293

ఇంటిలో వసంతము ప్రవేశించగానె
నే నరణ్యమునం దుండినాను నేడు. 294

ఎంతో పట్టనియ ట్లుందు నింతిగూర్చి,
అయినగూడ నాదు రహస్య మరసె నామె. 295

వలపునం బడి సుందరి బక్కబడెను,
చిక్కినకొలంది హెచ్చెను చక్కదనము. 296

నా రోదనమ్ము నిన్ను చేరినంతటనె
మారిపోవునుగదే మధురగానముగ! 297

నీదు లేఖను పొంది ఆమోదపడను.
జాబు తెచ్చువానిపయి నీర్ష్యపడుకతన. 298

నీవు గోడుచెప్పినా వామె వినెగాని,
ఉత్తరమ్ము నేమి యొసగ లేదు. 399

ఇంత కష్టమ్ముగా బ్రతుకీడ్చు నాకు
దేవు డెక్కడ నున్నాడు భావమందు? 300

ఊహల పథాల పడిపోవుచున్న నాకు
మరలివచ్చెడి కోరిక మాయుగాక 301

హృదయరాహస్య మితరుల కెట్లు తెలియు
నేను ప్రణయగీతములు రచింపకున్న? 302



నడుము బిగియించుచుంటివి నన్ను తునుమ,
నాకు తెలియులే నీ కెంత నడుముకలదో? 303

దేవి! మన పూర్వ బంధమ్ము ప్రేంచబోకు,
ప్రేమ లేకున్న నుండనీ ద్వేషమేని. 304

గోష్ఠి కే నేగుదెంచుట కోపమేని
కలసికొందము లెమ్ము ఏకాంతముగనె. 305

మెరుపువోలె ప్రబలుకు పరువెత్తుచున్నను
వ్యవధి గలిగె ప్రియుని హత్యసేయ! 306

ఆమెకనులు నిశ్శబ్దమ్ములయ్యె పలుకు,
పలుకు టగ్గిని పొగయె కజ్జలముకాగ. 307

త్రవ్వి త్రవ్వి అడుగదలచకు నాబాధ,
అగ్ని నీకుగూడ అంటగలదు. 308

జగతియంత ఊహాజాలముగనె తోచు,
కనుక నా జాలమున చిక్కగొనకు మోయి! 309

వానరాత్రి నిన్ను వదలి యెట్టుల పుత్తు?
లెక్కబెట్ట నొక్క చుక్క లేదు. 310

ఉన్న హృదయ మొకటి—నిన్ను చూడని బాధ,
నిన్ను వినని బాధ యెన్న రెండు. 311

పాడువడిన ఇల్లు బాగుసేయగ లేను,
చెడినదాని నేమి చెరతు వింక! 312

అలిగితిని నీపయిన్ ప్రియురాల! నేను
అదియు నా వెరిగిలో నొక అంగమగును. 313

మెరబెట్టుకొన్నచో మరి బాధ హెచ్చునని
ఎరిగియుండిన నేను మెరబెట్టుకొనకుందు. 314

గగన మనెడు 'సాకి' కడ సౌఖ్యమధు వేది?
బోరగిలిన గిన్నెవోలె నుండె. 315

మబ్బులున్న రేబ మరి వెన్నెలల రేల
త్రాగ విడిచిగూడ త్రాగుచుందు. 316

దుర్గమమ్మ పథము, దొంగల్ ప్రయాణికుల్,
ఇంక ఒంటిబోవుటే నయమ్మ. 317

అడుగులొత్తు మటంచు పడతి కోరినయంత
కడుసంతసమున నా కాల్దేతు లాడవు. 318



నావలెనె దుర్దినములున్న నరుడొకండు
రేయినే పగలనుకొన్న పోయెనేమి? 319

ప్రణయపరితప్తుడను, పిచ్చివాడ గాను;
విరహవేదనలో శాంతి దొరకు నెటు? 320

అన్ని వేదనలకు నౌషధం బుండగా
ప్రేమబాధకే లభింప దేల? 321

ప్రాపి రాత్రివేళ తరుణి రావలెగాని
వెంట అన్యు డెవడొ ఉండ తగదు. 322

నేను లేకపోవ నిలిచిపోవున దేమి?
ఏల నన్ను కూర్చి జాలిపడుట? 323

ఎన్నొ అందాలు మట్టిలో నిగిరిపోయె;
కొన్ని మాత్రము పూలయి కన్నువిచ్చె. 324

లోకమందు సుఖము, శోకమ్ము కల వంద్రు,
శోక మొకడె ఇచ్చె నాకు బ్రహ్మ. 325

గాయపడిన నాగుండెను కాంతు రేల?
తరుణికరమున కే దిష్టి తగులునట్లు. 326

ఆమె మాయింటి కెట్టులో అరుగుదెంచె,
దైవకృత మగు నిద్ది, సాధారణమ్మె? 327

పరుని తీపిమాటలకు లోబడెనుగాని
నోరు లేని న న్నాయము చేరనీదు. 328

"నాకమునసేని నిన్ను పొందగల" నంటి,
"అచ్చరను కాను లెమ్ము నే" ననియె నామె. 329

ఎంతకాల ముంటినో ఇల నేమి చెప్ప
విరహరాత్రిలగూడ కల్పితనయేని? 330

కలను కానుపించి పలికె "వత్తు" నటంచు
బ్రతుకదెల్ల నిదరి పట్టలేదు. 331

చచ్చిపోవుట యేమి దుష్కరము కాదు;
సఖిరహస్యము తెలియు నన్ జంకుతప్ప. 332

ఆశతో బ్రతుకుదు రని అనుచె తప్ప
నాకు బ్రతికెడి ఆశయే లేకపోయె. 333

మూతిలేనికతన ముద్దొసంగకుగాని
నాల్క లేదె నీకు నన్ను తిట్ట? 334

నన్ను వలచినంత ని న్నొరుల్ నిందింత్రు;
మంచివారి చెడుగ నెంచు జగము. 335

భావమందు వలపువన్నియ లిపు డేవి?
వలపులాడి ఒకతివలన వచ్చె. 336

వలపుజూదపుటింటిని వదలుకొంటి,
అచట ఒడ్డుటకై ధన మసలె లేదు. 337

నవవసంతశోభ ననుభవింపగనీవు,
మధువులేని గిన్నె, వ్యథితమనసు. 338

ఊర్పులు ఫలించుటకు నొక యుగము వలయు,
ఇంతి! నినుపొందుదాక జీవించు నెవడు ? 339

నీవు కురులు సింగారించినావుగాని
దాని పరిణామ మూహించినాను నేను. 340

నీదు కుడ్యము గనినంతనే స్ఫురించు
పిచ్చి 'గాలిబు' తల ఇట ప్రీలె ననుచు. 341

కవితతోగూడ నేను వికీయమగుదును
సారమెరిగి క్రయించెడివారికొఱకు. 342

నేను నీవాకిటనె కట్టినాను గృహము
ఇంకనైన నాయిల్లెటో యెరుగలేవె? 343

పలుక లేని దౌర్బల్యమ్ము కలిగె నాకు,
"పలుకకయె బాధ తెలియు నెట్లు?" లను నామె. 344

క్రూరురాలని జగతిలో పేరుబడిన
దానితో నాకు పనిబడె దైవవశత. 345

విగ్రహముపూజసేత తప్పె యగుగాక,
విధిగ పూజింతు నా ప్రేమవిగ్రహమ్ము. 346

గోడ అడ్డమునుచుకొని దాగియుంటివే?
ఎగసివచ్చు శక్తి నిచ్చె గోడ. 347

ఉచితముగ సేతు కజ్జలరచన నేను
క్రయికు నయనాల నా ఉపకార మడర. 348

ఎట్టి అధికుడ నే, నెట్టి దిట్టనోయి?
విధి అకారణముగ శత్రువృత్తిబూనె. 349

వెడలుచుంటి నిరాశను వెంటగొనుచు,
మలిగినట్టి దివ్వెను, సభన్ నిలువ తగను. 350

ఉత్తరీయాంచలము తడి నొందలేదు,
నీరు తగ్గి పాపస్రవంతిక యె ఇంకె. 351

నీవు రాగోరితివిగాని నిన్ను పోవ
నీక బంధించు ప్రత్యర్థి లేకపోడు. 352

తరుణిచేత చంపబడంగ తగను నేను,
చచ్చుటకు వేరె మార్గ మెంచదగు నాకు. 353

ఎన్నియొ విచారములు నాకు నున్న నేమి?
నిన్ను మరువగాజాల నే నెన్నడేని. 354

వార్త తెచ్చినవానిని వధ యొనర్ప,
కద్ది నా తప్పు, వాని నే మనగవద్దు. 355

చెలియ అద్దాన మో మెంచి చిన్నబోయె,
ఒరుల కెదనీని గర్వమ్ము తరిగిపోయె. 356

"చెడితి నీచేత" నని నిందసేయబోవ,
అందు నా అదృష్టము కొంత అలరుకతన. 357

మెరపొకటి వచ్చి కనులలో మెరసిపోయె,
దానితో కొంత మాట్లాడ దప్పిగొంటి. 358

హంత! నను చంపరాలేదు చెంత కేల?
నీదు పొదిలోన బాణము లేదె, చెపుమ? 359

వెలదిచూపుతూపులను తప్పించుకొనగ
జూచె హృదయము, తుదకు గ్రుచ్చుకొని చచ్చె. 360

దుఃఖితుడ నేను, నా తల దునుమకున్న
వ్రాలియుండును మోకాళ్లపైన నెపుడు. 361

ఎంత తీయని పెదవులే ఇంతి! నీవి?
తిట్టుచున్నప్పుడునుగూడ తీపికురియు. 362

అపుడు గోష్ఠిలోనుండి నన్నవల త్రోసి,
రిపుడు చచ్చితి, నన్నెవ్వ డెత్తివైచు? 363

పగిలెనేని తెమ్ము పాత్ర యెుం, డిదె మేలు
మణికలశముకన్న మట్టిచిప్ప. 364

బ్రతుకు పదవెత్తుచుండె గుఱ్ఱమ్మువోలె;
చేత కళ్లెమ్ము లేదు, కా లూతగొనదు. 365

నాశమంచుకూడ నవసౌఖ్య మున్నది,
నఖము కత్తిరింప సుఖము కలుగు. 366

లేనియప్పుడు దేవుడ లెమ్ము నేను,
ఉన్నయప్పుడు నరుడన్నై యుంటి నౌర! 367

నాకమును పారవేయుడీ నరకమందు,
అమృతమునకయి యెవ డింక ఆశపడడు? 368

ఏమి వచియింతు దౌర్భాగ్య మింతకన్న
చచ్చిపోవుద మన్నను చావు రాదు. 369

బారెడంత వస్త్రంపు దౌర్భాగ్య మూర!
విరహి తొడిగిన అంగియె వెలయవలసె. 370

మలిగిన ప్రదీపమున పొగ మలసినట్లు
ప్రేమ నీలిబట్టలను నా పిదప కట్టె. 371

వెతల పోద్రోలు మం దేది మృతియెగాక?
ఉదయ మగుదాక దివ్వె వెల్గొందవలయు. 372

చెదరి ఎవనిపై పడునో నీ చికుర రాశి,
అతనిదె అదృష్ట, మతనిదే హాయిసుమ్మి! 373

'గాలి బెవ్వ' డంచు కాంత ప్రశ్నించిన
నేమి ఉత్తరమ్మ్ము నీయవలయు? 374

వీణమెట్టు గాను, విరుల నవ్వును గాను,
నా పరాజయప్రణాద మేను. 375

బాల్యమున నేను 'మజ్ను'పై ప్రస్తరమ్ము
విసరబోవగ నా తల వెస స్ఫురించె. 376

ఇంకొకని నెట్టు లేని ప్రేమించినావు,
పాపమునకు ప్రతిఫలమ్ము బడసి తీవు. 377

స్వర్గమును గూర్చిన ప్రశంస చాల వింటి
కాని అది నీ నివాస మీగాక, చెలియ! 378

హృదయ మెవరికో యిచ్చి దుఃఖింపనేల?
ఎద నెడద లేక నాలుక యేల నోట? 379

ఏయలంకరణము లేని సేయకగూడ
ప్రియుల మోహపరతు వేమె! నీవు? 380

ఆ యెడారిని 'మజ్ను'గా కరుగ రెవరు,
సంకుచితు చూపువలె అది చాల ఇరుకు. 381

చెలి కరమ్ముల తెగు వ్రాత కలదు నాకు,
కాన ప్రతి కత్తికడ వంచినాను తలను. 382

చెలియతో నాకు కలయిక కలుగుననుట
శత్రుభావమ్మె యగు నోయి మిత్రులార! 383

కంట నశ్రుధార కార్చుచుండుము నీవు,
ఇంకగూడ ఢిల్లి ఎంతో దవ్వు. 384

ఆరటమ్మున మనసు వ్రయ్యలొనరిచితి,
చూడ కద్దముపైన గూర్చుండినట్లు. 385

అంధకారమై దౌర్భాగ్య మావరించె,
ఇంక తెలిరేక యొకటి నీక్షించనైతి. 386

నన్నె కాల్చు నీ నిశ్వాసనముల వహ్ని
పరికయింటిపై పడబోవ దొరకరవ్వ. 387

అప్సరసనువోని ఆమెనే వర్ణింప
శత్రువయ్యె నాదు మిత్రవరుడు. 388

నీ వెలుగుచేత సూర్యుడు నింగి మెరయు
కానిచో సూర్య డొక బిచ్చగాని వరము. 389

కయిని శక్తి లేదు, కన్నుల బలమున్న,
దింక పానపాత్ర నెదుట నిడుము. 390

పిచ్చివలన నేమేమియో ప్రేలుచుంటి,
ఎవరి కర్థముగాకపోయెడినిగాక! 391

క్రీస్తు లాగున ప్రేమ వర్షించి వచ్చి
దుఃఖమునకు మందిచ్చు వైద్యుండు వలయు. 392

నన్ను కరుణించి పిలువు మేనాడుగాని
కాను గతమును, తిరిగి రాగలను నేను. 393

మూగవడు నెప్డో తనువల్లకీగళమ్ము
కాన దుఃఖాశ్రుగీతమే యైన ప్రియము. 394

ఇంతిచూపు తూపులను తప్పించుకొనుట
సులభమని పరుగెత్తి నిష్ఫలుడ నైతి. 395

బానిసనె యయ్యు స్వాతంత్ర్యపరుడ నేను,
వెడలివత్తు కాశినిన్ గౌరవింపకున్న. 396

మిత్రుని రహస్య మందెను శత్రువునకు,
అయ్యది రహస్య మని గర్వ మంద తగునె! 397

మధువు తగినంత లే దను మాట వినిన
కుంగిపోయెడి నిరుపేదగుండె నాది. 398

సకియతో నాకు సంబంధసరణి వలయు,
కలయికలు లేనిచో వియోగమ్మె ప్రియము. 399

ఒరుల కొసగ లేదె ఉవిద! నీ అధరమ్ము?
నాకుగూడ నోరు లేకపోదు! 400

ఇష్టి కేల తెచ్చినావు వాగ్దానమ్ము?
మరచిపోతి ననును తరుణి తుదకు. 401

నా పిదప నావలపునకు నతు లొనర్ప
నెవడు లేడాయె ననుచు దుఃఖించినాను. 402

తరుణి! నీదు రమ్యాంగుళి మరతునేని
ప్రేలినుండి గోరూడినరీతి బాధ! 403

రక్తధారలు తలపైన ప్రాలనిమ్ము
ప్రేయసీగృహసీమను వీడగలనె? 404

గ్రహములు భ్రమించెబో అహోరాత్రములును
జరుగు నేదో ఒకటి, యేల వెరగుపడగ? 405

అస్మదశ్రుల తోచె గాయాల పూలు
వధ్యశిల కేగెదను హాసవదనమునను. 406

గోష్ఠి కేగి ప్రాగకుండ రానేరాను,
ప్రాగువరకు 'సాకి' రట్టుబెట్టు. 407

కవితా వివరణ

[అన్ని పద్యాలకూ వివరణ వ్రాస్తే గ్రంథం మరీ విస్తరిస్తుంది. కనుక భావం వెంటనే స్ఫురించని కొన్ని పద్యాలకే వివరణ ఇవ్వడం జరిగింది.]

14. ఒక చిన్ని నీటి బిందువు. అది దేనిలో చేరితే ఆ ఆకారాన్ని పొందుతుంది. బావిలో బావిగా, నదిలో నదిగా, సముద్రంలో సముద్రంగా మారిపోతుంది. బిందువు ఒక్కటే. అలాగే ఒకపని, దాని ధ్యేయాన్ని బట్టి దివ్యత్వాన్ని సంపాదిస్తుంది. పది అడుగులు నడచి దేవాలయానికి వెళ్లవచ్చు, పానశాలకు వెళ్లవచ్చు, వేశ్యా గృహానికి వెళ్లవచ్చు, ఎవరినైనా హత్య చేయడానికి వెళ్లవచ్చు. కాని దేవాలయానికి నడచి వెళ్ళిన పని దివ్యము; తక్కినవి దారుణములు. మురికి గుంతలో పడిన నీటి చుక్కకీ, సముద్రంలో పడిన నీటి చుక్కకీ తేడా లేదూ!

16. నీళ్ళలో నిప్పు పడగానే చుఱయి మంటుంది. తరువాత చల్లారి పోతుంది. వేదనతో చనిపోయేవాడు దుఃఖపు కేక వేసి చనిపోతాడు. గాలిబ్, తన విరహ గీతాలను తాను చనిపోయే ముందు చేసే ఆక్రందన అంటున్నాడు. నిశ్శబ్దంగా చనిపోవడం ఎలా? చప్పుడు కాకుండా నిప్పు చల్లారుతుందా? చల్లారే నిప్పు చేసే చప్పుడువలె తాను గతించేటప్పుడు రోదిస్తున్నాడట!

20. ప్రియురాలు తన చేతిలో కత్తి లేకుండానే ప్రియుణ్ణి గాయ పరుస్తున్నది. కత్తి చేతపట్టుకుని యుద్ధం చేస్తే, మరొక కత్తి చేత బూని ఆమెతో యుద్ధం చేసి ఆమెను ఓడించడానికి ప్రయత్నించవచ్చు. కాని కత్తే లేకుండా కదనం జరిపే ఆమెను చూసి ప్రతివాడూ ఓడిపోదలుస్తాడు. ప్రాణం ఇవ్వదలుస్తాడు. ఆమెకు తన అసువులు అర్పించడం అంత ఇష్టమైన పని. ఆమెను ఎదిరించడం లేనే లేదు.

30. ఖైదులో ఉన్నాడు తాను. అక్కడ కూడా ప్రియురాలి నీలి నీలి జడ జ్ఞాపకం వచ్చి, మనస్సు బాధ పడుతున్నది. అయితే జైలులో ఇనుప గొలుసుల వలన కలిగిన బాధకూడా లేకపోలేదు. కాని జడ జ్ఞాపకం వచ్చి కలిగే బాధకన్న అది తక్కువే. ఇనుప గొలుసులనూ, జడనూ జతపరచి ఊహించండి. నల్లగా అల్లుకుని ఉంటుంది జడ. గొలుసులు కూడా అంతే. అయితే, ఒకటి హృదయాన్ని బంధిస్తే ఒకటి కాళ్లేతులను బంధిస్తుంది.

33. స్వాతి వాన చినుకు ముత్తెపు చిప్పలో పడి ముత్యం అవుతుంది. ఎట్టి విలువలేని నీటి చుక్కకు ముత్యం కావడం కన్న ఘనత యేమిటి? నీటి చుక్కకు సార్థకత ముత్యం కావడమే. కాని నీటి చుక్కకు ముత్యం కన్న విలువైన మరొక స్థానం ఉందంటున్నాడు గాలిబ్. అయితే ముత్యం కావాలనే కోర్కిని ఆ నీటి చుక్క వదలుకున్నప్పుడే ఆ స్థానం లభించుతుంది. అసలు ఆ స్థానం ఏమిటి? కంటిలో కన్నీటి చుక్క అగుట. కంటిలో కన్నీటి చుక్క అవడం ముత్యం అవడం కన్న గొప్ప దశయా? అవును. ముత్యం అయితే మెడలోని ఆభరణం లోనో, చెవిలోని కమ్మలలోనో స్థానం లభిస్తుంది. అశ్రు బిందువైతే నయనంలో స్థానం లభిస్తుంది. అన్ని ఇంద్రియాలలో పరిధానమై, కాంతి మంతమైన నయన పీఠం మీద కూర్చునే భాగ్యం ముత్యానికుందా? లేదు. ఆ స్థానం అశ్రువుకు మాత్రమే లభిస్తుంది. కనుక జలబిందువు ముక్తికం కావడాన్ని విసర్జించి, అశ్రు రూపం ధరిస్తున్నది.

37. నక్షత్రాలు పగటి పూట ఆకాశంలో కనుపించవు. గోపాస్త్రీల వలె పరదాలలో దాక్కుని రహస్యంగా వుంటాయి. అయితే సాయంత్రం కాగానే ఏమవుతుందో ఏమో, గోపా తొలగించుకుని, వస్త్రాలు విప్పుకుని నగ్నంగా ఆకాశంలో సాక్షాత్కరిస్తాయి చుక్కలు. పగలు అంత దాపరికం గల ఈ చుక్కలకు రాత్రి ఈ దిగంబరత ఏల? చిత్రమైన జిజ్ఞాస!

45. గుండెలో ఏదో కెలుకుతోంది. ఏమిటది? వక్షస్థలంలో ఉండేది హృదయమే. హృదయమే ఇలా బాధ పెడుతున్నదా? కాదు. బాణపు ఇనుప ముక్క. బాణ మెక్కడినుంచి వచ్చింది? ఆమె తనను చూచింది. ఆ చూపు, వాడి బాణం వలె వచ్చి గుండెలో గుచ్చుకున్నది. అంతలో ఆమె చూపు మరల్చుకున్నది. బాణం లాగేసినట్లైంది. కాని లాగినప్పుడు ఆ బాణానికున్న ఇనుపముక్క లోపల విరిగి ఉండిపోయింది. ఆది మాటి మాటికీ విరిగిన ముల్లులాగా కలుక్కు మంటున్నది. ఆమెను గూర్చిన భావన ఇనుప ముక్కయై బాధ పెడుతున్నది.

47. భ్రమరము తన ప్రేయసియైన పువ్వు కోసం దుఃఖిస్తున్నది. మొదట పువ్వు ద్వేషంతో భ్రమరాన్ని తనవద్దకు రానీకుండా మూతి బిగించుకు కూచున్నది. కాని భ్రమరము హృదయ విదారకంగా రోదించేసరికి వెలది వంటి పువ్వుగుండె ముక్క ముక్కలై పోయింది. భ్రమర రోదనం వృథా పోలేదు. పువ్వు గుండెను కరగించింది. వియోగ గీతాలు వృథాపోవు. ప్రేయసిని కరగించుతై.

48. ఎంత దుఃఖం వున్నా ధీరులు లెక్కచేయరు. క్షణంలో దాన్ని తొలగద్రోసుకుని పోతారు. ఆకాశంలోని మబ్బుల డొక్కలో మెరిసే

మెరుపుతో ధీరులైనవారు దుఃఖ దీపాన్ని వెలిగిస్తారు. ఆశయే మెరుపు. దుఃఖదీపాన్ని ఆశా విద్యుదగ్నితో వెలిగించుకుంటారు ధీరులు. అంధకారంలో మెరుపు తీగ సహాయంతో సాగిపోతారు.

50. గమ్యం వైపు పోతున్నాడు. అది కనుమేర దూరాన కనుపిస్తున్నది. కాని ఈ యాత్రికుని దౌర్భాగ్యమేమో, గమ్యంకూడా ముందుకు నడచిపోతున్నది. యాత్రికుడు ఎంత నడచినా అది అందదు. కనిపిస్తూనే వుంటుంది. ఇతడు ఏ వేగాన నడుస్తున్నాడో ఆ వేగంతోనే అదీ ముందుకు పోతున్నది. అలాటి గమ్యం కనుచూపు దూరాన ఉండి మాత్రం ఏమి లాభం! ఎంత నడచినా, ఎంత పరుగెత్తినా చేరుకోలేం. పోయినది తనకు స్వాధీనురాలవుతుం దనిపిస్తూనే ఉంటుంది కాని అందదు.

51. గాలిబ్ యొక్క తత్వబోధలు విని అంతావచ్చి ఆయనతో అంటున్నారు — "గాలిబ్! ఏమి తత్వబోధ! ఏమి తత్వచింత! ఇంత తత్వచింత కలిగికూడా తాగుతా వేమయ్యా! నీవు తాగుడు మానుకుంటే, నీ బోధలకు మేము నిన్ను యోగి అనేవాళ్లం" అని. తాగకుండా ఉత్తముని వలె నటించి తత్వబోధ చేసేవాడు సులభంగా యోగి అనిపించుకోగలడు. వానిలో యోగిత్వం లేకున్నా ఫరవాలేదు. కాని నిజంగా యోగచింత గలిగి, ఉత్తముడై ఉండి, తాగుడు అభ్యాసం ఉంటే, అతను యోగి అనిపించుకోలేడు. నటనలోనే సర్వంవుంది. నిర్మల హృదయాన్ని ఎవడూ గమనించడు.

59. సంతోషం అనేది ఎలా లభిస్తుంది? ఆలోచనలో అన్నీ పూలతోటలు. అనగా, కాంక్షలు ఫలిస్తాయనే నమ్మకం. మరి హృదయమేమో వియోగాగ్నితో ఎడారిలా వుంది. మెదడు ఒకవైపు, హృదయం మరొకవైపు లాగుతున్నాయి. ఇట్టి సందిగ్ధావస్థలో సంతోషం ఎలా సాధ్యపడుతుంది?

62. బ్రతుకు యెడారిలా వుంది. ఒంటరి తనం భయంకరంగా వుంది. యెడారినిండా ముండ్లు. పూలు లేనే లేవు. అలాటి యెడారిలో పూలు పూయించడం ఎలా? గాలిబ్ యెడారిని పూయిస్తాడు. తన ఎఱ్ఱని హృదయాన్ని ముక్కలు ముక్కలుగా నరికి ఒక్కొక్క ముక్కను ఒక్కొక్క గులాబీ పూవువలె ఆ ముండ్లకు చెక్కుతాడట! తాను బలియై తన ఎడారి బ్రతుకును పూయించుతాడట!

65. మత బోధకుడైన గురువు, దేవాలయం పంచల్లో పానశాల ఉండడాన్ని సహించడు. కాని దేవాలయం పంచల్లో పానశాల ఉండడం సహజం అంటున్నాడు గాలిబ్. పాప పుణ్యాలు, మంచి చెడ్డలు, వెలుగు నీడలు కలసి మెలసి వుంటాయి. కనుబొమ్మ క్రిందుగా కన్నుంటుంది గాని

V.R. NARLA MEMORIAL LIBRARY V.R.D.P.R.I. Acc. No.

పాదాల వద్ద వుండదు. కనుబొమ్మ చూడ లేదు. కన్ను చూస్తుంది. దేవాలయం వల్ల మనో వికాసం లేదు; పానం వల్ల మనస్సు తన్మయమే కొత్త ఆలోచనలను పొందుతుందిట!

68. సఖిపై గల కోర్క చచ్చిపోయిందట! కోర్క యిండుకు చచ్చింది? కారు చిచ్చు అంటుకుంటే అరణ్యంలో ఒక చెట్టు కాలి ఒక చెట్టు కాలకుండా ఉండదు. సమస్తం కాలి పోతుంది. అలాగే వియోగాగ్ని హృదయాన్ని పూర్తిగా దహించి వేసింది కనుక హృదయంలో ఉన్న కోర్క కూడా కాలి పోయింది. సఖీ వియోగ దవాగ్ని సఖిపైగల కోర్కని కూడా కాల్చి వేసేటంత దారుణమైనది.

69. తన హృదయం ఎక్కడో తప్పి పోయిందట. అది ఎక్కడ తప్పి పోయిందో తనకు తెలియదు. పోయిన హృదయం కోసం తాను వెతుకుతున్నాడు. వెతుకుతున్న వాడికి కాకుండా, ఆమెకు దొరికింది హృదయం! "నా హృదయం నీ వద్ద ఉన్నది. నేను నిన్ను ప్రేమించాను" అని వ్యంగ్యంగా చెబుతున్నాడు గాలిబ్.

75. దొంగకు దొరకకుండా పరుగెత్తినాడు. తుదకు పట్టుబడాడు. ఇతన్ని పట్టుకోడానికి పరుగెత్తడం వల్ల దొంగ కాళ్ళు నొచ్చినవి. ఇతని కాళ్లూ నొచ్చినవి. కాని దొంగకు, దొరికిన వాడు లోకువ గనుక ఇతనితో కాళ్ళు ఒత్తించు కున్నాడు దొంగ.

85. ఆమె తన పదాలను ముద్దు పెట్టుకోడానికి కూడా ప్రియునికి అనుమతి ఇవ్వడం లేదు. "నేను ఆకాశంతో సమానమైనా కానా? నాకు నీ పాదాలు చుంబించే అనుమతి ఇవ్వవు" అంటున్నాడు. ఆకాశం ఒక విధంగా ఉన్నతమైనది. ఒక విధంగా వట్టి శూన్యం. ఆమె పాదాలను ఆకాశంలోని దేవతలు చుంబిస్తారు అని ఒక అర్థం. తన ప్రియురాలు అంత గొప్పది అని చెబుతున్నాడు. తాను ఆకాశంవలె శూన్యుణ్ణి అంటున్నాడు. ఆకాశం అనగా అవకాశాన్ని ఇచ్చేది. నిజానికి ఆకాశం అంతటా వుంటుంది. మన తలల మీద ఎతుగా నీలనీలంగా కనిపించేదే ఆకాశం కాదు. ఆమె పాదాల చుట్టూ ఉన్న కాళీ స్థలం కూడా ఆకాశమే. కనుక ఆకాశం ఆమె పాదాలను చుంబిస్తున్నది. తానూ ప్రియా విరహ పరితాపంవలన శూన్యుడైనాడు. తనకు ఆ ప్రియా పాద చుంబన భాగ్యం కలుగదేమి?

88. ఆమె ప్రణయస్వరూపం చూస్తే హృదయం తరుక్కు పోతుంది. అంత సౌందర్యవతి తనకు లభించనందుకు భరించరాని బాధ కలుగుతుంది. ఆ బాధ ప్రళయబాధ కన్న హెచ్చు, అని చెప్పడానికి ఈ పద్యం రచించి

నాడు గాలిబ్. ప్రళయం ఆకారం ధరించి నిలబడితే, దాని ప్రక్కన తనను బాధించే ప్రేయసి నిలబడితే, ప్రళయమే ఒక్క నిలువెడు తక్కువ ఎత్తట! ప్రళయంకన్నా ఎక్కువ బాధ కలిగిస్తున్నది ప్రియురాలు.

90. డాక్టర్లు, వైద్యులు, హకీములు అని అనడానికి బదులు వాళ్ళను "కాగితమ్మున మందులు కట్టువారు" అని అవహేళన చేస్తున్నాడు గాలిబ్. ఎందుకంటే, వాళ్లు తన విరహ రోగాన్ని తగ్గించలేరు. పైగా రోగికి జబ్బు తగ్గదని చింతిస్తున్నారట!

92. విరహ బాధ భరించరాకుండా వుంది. రాత్రి అంధకారంలో ఆమె ముఖ చంద్రబింబాన్ని భావించుతున్నాడు. పగలు సూర్యాతపం భరించ లేక ఆమె కురులను భావించి వాటి చాటున దాక్కుంటున్నాడు. అయినా బాధ దుర్భరంగానే వుంది.

101. చాలా కాలానికి ప్రియుడి మీద ఆమెకు కనికరం కలిగింది. ఇంట్లోకి రావడానికి అనుమతి ఇచ్చింది. ఇన్నాళ్ళకు దయ కలిగినందుకు సంతసించి అతను ఆమె ఇంట్లోకి ప్రవేశించినాడు. తన పక్కవిచ్చి పరుచుకున్నాడు. అంతలో ఆమె మనస్సు మారింది. 'వెళ్ళిపో' మని వెళ్ళగొట్టింది. అంత చలచిత్తురాలు. పక్క పరచుకునే లోపల మళ్ళీ కోపంవచ్చి వెళ్ళిపొమ్మన్నదట!

102. ఆమెను ఊర్వశి అన్నాడట. ఆవిడ ఏమనకుండా ఊరుకుంది. ఒకవేళ ఆమె కోపగించితే, లోకులు, ఆమె కోపం సమంజసమే అంటారు. ఎందుకంటే- ఆమె ఎక్కడ? ఊర్వశి ఎక్కడ? ఊర్వశి కంటె కూడా అందకత్తె అని భావం.

105. గుండెలో గాయాలు పడి, ఆ గాయాలు మాని మచ్చలైనవి. ఆ ప్రతిమచ్చ దీపికా వృక్షానికి బీజమట! తన బాధయే తన శక్తికి బీజమని గాలిబ్ భావన. తాను తన బాధకు క్రుంగిపోక, బాధలోనుండే నూతన కాంతినీ, స్ఫూర్తినీ పొంది లోకాన్ని దీపికా వృక్షమయం చేస్తానంటున్నాడు ఆశావాది గాలిబ్.

108. స్వర్గంలో జరా మరణ రహిత యౌవనాన్ని ప్రసాదించే తేనె లభిస్తుందని కొందరు భక్తుల మూఢవిశ్వాసం. ఆ మధువును పొందడానికి ఈ లోకంలో మద్యపానం చేయడం మానుకుంటారు ఆ భక్తులు. గాలిబ్ అంటాడు: "పిచ్చివాళ్ళల్లారా! తేనె, ఈగెల ఎంగిలితో తయారౌతుంది. మద్యము పూల అర్కము. కనుక స్వర్గంలో దొరుకనున్న ఈగెల ఎంగిలికోసం పుష్ప రసాన్ని ఎందుకు వదులుకుంటున్నారు?" అని.

109. ప్రేమతో ఆమె కన్నీరు కారుస్తే ఆ కన్నీటిధారకు ఇతని తల తెగిందట. ఖడ్గధారవలె పదునైన కన్నీటిధార తన తలను తెగగొట్టిందట. ఖడ్గానికీ ధారవుంటుంది, నీళ్ళకూ ధారవుంటుంది. కత్తికీ పదను వుంటుంది, కన్నులకూ పదను ఉంటుంది. పదను అనగా తడి. ఆమె ఏడిస్తే తనతల తెగినంత బాధ అవుతుంది అని భావం.

116. ఆమె కోపంతో నన్ను చంపడానికి గాను బాణం వదలితే ఆ బాణం తాకి చనిపోవాలనే కాంక్ష నాకుంది. కనుక ఆమె శ్రమపడి గురి కుదుర్చుకో నక్కరలేకుండా నేనే యెదుట నిలుస్తాను. అప్పటికీ ఆమె బాణం తప్పిపోతే, ఆ తప్పిపోయిన బాణాన్ని తెచ్చి ఆమె కిచ్చి, మళ్ళీ గుండెకు సరీగా గురిచూచి కొట్టమని కోరుతాను.

117. ఎండకాలంలో సుదూర ప్రయాణం చేసేవాళ్ళకు కాళ్ళు కాలి బొబ్బ లెక్కతాయి. ఆ బొబ్బల నొప్పికి ఆ బాటసారులు గబగబా నడవ లేరు. ఆకాశంలో చుక్కలు కూడా పరిణయ దీర్ఘ మార్గం మీద నడచి నడచి, బొబ్బలెక్కిన కాళ్ళతో గబగబా నడవలేకుండా ఉన్నాయట ! చుక్కలు గబగబా నడుస్తున్నట్లు కనబడవు. చాలా మెల్లగా ఈసురో మంటూ నడుస్తున్నట్లుంటాయి. రాత్రి ఎంతకూ తెగదు. విరహరాత్రి సుదీర్ఘ మార్గంలా వుంటుంది.

131. తనకు, ఆమెకు పరిణయ సంబంధమున్నట్లు ఇతరులకు తెలియ గానే సిగ్గుచెంది అభిమానంతో వెళ్ళి చనిపోయిందామె. అంత అభిమానవతి. సిగ్గుతో ఆడవాళ్ళు పరుగెత్తి పరదాలో దాక్కున్నట్లు, ఆమె మట్టిలో దాక్కున్నదట, పాపం ! ఎంత అభిమానవతి !

134. సృష్టి ఆదిని 'ఆడం' స్వర్గాన్ని విడిచి నరకంలోకి వెళ్ళిన గాథలు విని బాధ పడ్డానుగాని, నేను స్వయంగా నీచే వెడల గొట్టబడి నీ ఇంట్లోంచి వెళ్ళిపోయి అనుభవించిన బాధ అంతకన్న వేయిరెట్లెక్కువ.

135. నీ కోపపు కత్తితో నన్ను నరకగల ననుకొంటున్నావేమో. నా విషాదర కనదిలో అది ఒక తరంగం మాత్రమే. నీ కోపం నన్ను ఇంకేం చేయలేదు. ఇంత కన్న బాధింపలేదు.

137. వసంతం వస్తే తన పాడుపడిన ఇంటినిండా గడ్డి మొలిచింది. నడి ఇంట్లో గడ్డి మొలిస్తే పాడు పడడానికి చిహ్నం. ఇక శిశిర ఋతువులో గడ్డైనా మొలవనప్పుడు ఇంకా ఎంత ఘోరంగా వుంటుందో !

140. తాను వలలో పడియున్నాడు. తన ఇంటిని గూర్చి చెప్పడానికి ఒక పక్షి వచ్చింది. కాని చెప్పడానికి వెనుకాడుతున్నది. ఇప్పుడు తన

గూడు ఏమైనా తనకేంలేదు. అయినా నిన్న అడవిలో పడ్డ పిడుగు తన ఇంటిమీదే పడిందని ఎందు కనుకోవాలి? తన గూడు బాగానే ఉండి ఉండవచ్చుగదా !

142. పాఠశాలలో అంతా మత్తిల్లి పడి ఉండడానికి కారణం అక్కడి మధువు కాదు. ప్రియురాలు కనపడే వరకు ఆమె ముఖ కాంతి వారిని మత్తు పరచింది. నిజానికి మధువు వారి నెవరినీ ఇప్పుడు మత్తు పరచే శక్తి కలిగి లేదు.

143. పలక మీద పిల్ల వాడు అక్షరాలు రాస్తూ అనవసరమైన ఒక అధికాక్షరం పొరపాటున వ్రాసి దాన్ని నిర్దాక్షిణ్యంగా చెరిపి వేస్తాడు. అలాగే భగవంతుడు తనను పొరపాటున సృష్టించి, అది గ్రహించి చెరిపి వేస్తున్నాడట. తాను అనవసరాక్షరమంత పనికి రాని వాడా?

144. అద్దంలో తన ముఖం చూచుకుని, ఇంకెవతో అందకత్తె వచ్చిందని ఈర్ష్య పడుతున్నదట! తన వంటి అందకత్తె ఊళ్ళో మరొకత్తె వుంటే మరెంత మండి పడుతుందో? తన ప్రతిబింబాన్ని చూచే భరించలేని ఆమె ఈర్ష్య వర్ణనాతీతం.

154. ప్రణయోన్మాదాన్ని పాఠశాలతో పోల్చితే దాని వైశాల్యం ఎంత అని అడగడం దేనికి? వలపు పిచ్చి యొక్క విశాలత్వాన్ని ఆకాశంతో పోల్చి చూస్తే ఆకాశం, చెత్త పారవేసే చిన్ని బుట్టంత వుంటుందట! వలపు పిచ్చి ఆకాశం కన్న అనేక రెట్లు విశాలం. ఆ పిచ్చికి అంతులేదని అర్థం.

167. తాను ఆమె ఇంటికి వెళతాడు. వెళ్ళే వరకే తలుపులు తెరిచి ఉంటే తనకు బాధ అవుతుంది. ఎందుకనగా, ఆ తలుపులు మరెవరి కోసమో ఇది వరకే తెరువ బడినవి అనే అనుమానాన్ని కలిగిస్తవి. కనుక తాను వెళ్ళే వరకు తలుపు మూసి ఉండాలి. తాను పిలువగానే ఆమె వచ్చి తలుపు తీయాలి. అదీ తనకోరిక.

173. "నా దుఃఖమే విషమై నన్ను చంపింది. నీవు నన్ను చంపినావని జనం నిన్ను నిందించడం దేనికి?" అంటున్నాడు. కాని ఈ దుఃఖానికి కారణం నీవే. నీవే నన్ను బాధించి చంపినావనే ధ్వని ఇందులో వుంది.

177. గోష్ఠికి వెళ్ళినాడు. అక్కడ ఏమీ లేదు. శూన్యం. "సాకీ" లేదు. చషకములూ లేవు. గగన గోళాలు గోష్ఠిలో తిరుగుట యనగా శూన్యం క్రమ్ముకొనుట.

182. పూలతోట నిండా ఆర్ద్రత ఉన్నది. అంత ఆర్ద్రమైన తోటకు రాతిగోడకూడా పూలతోనే కట్టినారట! కఠినమైన వస్తువే ఆ తోటలో లేదు. పరిణయార్ద్రమైన తన హృదయాన్ని అట్టి పూలతోటతో పోల్చు తున్నాడు కవి.

187. కొన్ని మద్యములు సీసాలో పోస్తే, సీసా కోతపడి కరిగి పోతుంది. అంత తీక్ష్ణమైన రసాయనము లన్న మాట అవి. "సీసాలో పోయ గానే సీసాను కోసే సారాయి వలె మనసును కోసే వేదన నాలో చేరింది," అంటున్నాడు.

191. దీపం మలగ్గానే పొగ చుట్టుకుంటుంది. దీపం బాగా వెలుగు తున్నప్పుడు పొగవుండదు. దీపం భర్త, పొగ భార్య. దీపం మలిగే సరికి వియోగంవలన దుఃఖిస్తూ, పొగ నల్లచీర కట్టుకున్నదట. నల్లదుస్తులు కట్టు కోడం విచార చిహ్నం. దీపం మలిగినందుకు దుఃఖిస్తూ, పొగ నల్లచీర కట్టు కున్నది!

194. లోకంలో హృదయంకన్న చిక్కు సమస్య మరొకటి లేదట!

207. గురువా! స్వర్గంలోని మధువునుగూర్చి ప్రస్తావిస్తావు. అది నీవు పుచ్చుకోలేవు, మాకు ఇచ్చుకోలేవు. అది ఎవరికీ అందేది కాదనీ, ఈ లోకంలో లభించే మధువును ఆస్వాదించక ఏల వృథాశ్రమ అనీ అంటు న్నాడు కవి.

218. "నీవు చాలా పొడవుగా, కోలగా, అందంగా ఉన్నావను కుంటున్నావేమో, నీ కురులను విరబోసిచూడు ప్రేయసీ! అవి నీకన్న పొడుగుగా వున్నాయి. కనుక గర్వపడకు. నీవు నీ కురులంత పొడుగైనా లేవు" అంటున్నాడు. ధ్వని: ఆమె కురులు ఆమెకన్న పొడవుగా ఉన్నవి. కనుక ఆమె చాలా అందకత్తె అని అర్థం. అందకత్తెల కురులు చాలా పొడ వుగా వుంటాయని ప్రాచీనుల భావన. ఇప్పటి అందకత్తెలు జుట్లు కత్తిరించు కుంటున్నారు!

222. ఆమె కనుచూపు, కత్తిలా గుండెలో గుచ్చుకుని బాధించినా ఫరవాలేదు. గుండెలోకి ప్రవేశించిన నీ చూపు, కత్తిలా బాధాకరమే అయినాసరే మిత్రమువలె చూచుకుంటాను. హృదయంలో మిత్రులే ప్రవే శించ గలరు.

224. గుండెలో గుచ్చుకుని బయటకు వెడలకున్నాసరే, నీ బాణపు వాడి ముక్కే నాకు ఇష్టము.

238. దుఃఖాన్ని సహించడానికి ఒక్క హృదయం చాలడంలేదు. ఇంత దుఃఖం పెట్టినవాడవు, దాన్ని భరించడానికి ఒక పది హృదయాలు ఇవ్వకపోయావా? దేవా! ఒక్క హృదయమే ఎందుకిచ్చావు?

240. అతిదీనుడు, దుఃఖితుడు అయిన తనను తన నీడగూడా విడిచి పోయింది. నిప్పంటే పొగ లేచి పైకిపోతుంది. అలాగే గుండెలో అగ్ని (బాధ) వున్నవానిని, నీడకూడా వదలి వెళ్ళిపోతుంది. ఎవ్వరూ అతనివెంట వుండరు. దుఃఖితునికి తోడు నీడ వుండరు.

255. సుందరీమణులను ఏమైనాసరే ప్రేమించాల్సిందే. అయితే ఆ సుందరీమణులు కూడా అలాగే ప్రేమిస్తే ఇంకేం కావాలి! చాలా బావుంటుంది. కాని వారు అలా ప్రేమించరు. వీరు ప్రేమించి బాధపడతారు.

256. "గుండె గాయము మానిపోతే సంచలనమే పోతుంది. బాధయే చైతన్యానికి నిదర్శనము. కనుక గాయం ఎప్పుడూ మానకుండా హృదయంలో 'సెల' వేస్తూ వుండాలి. మానిపోయే గాయం శత్రువుకు ఇవ్వు గాని నాకు వద్దు" అంటున్నాడు దైవంతో గాలిబ్.

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	AOUA101B102
పుస్తకం పేరు	గాంధీ గీతాలు
తారీఖు	31 December 202[illegible]
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	144
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	CL, 2, 10(a) no bad
లేని పేజీలు	
తయారు చేసినది	Jayalaxmi Vidyarthi
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	MADHU MATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	9.2.24

పుట్టిన పేజీలు

78, 80, 88, 94, 100, 104, 110

118, 124, 130, 140, 150, DCL